

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

8-6-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 127 పేజీలు: 10+4 వెల: 8.00



మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కన్నుమూత 3లో

మహారాష్ట్రలో ప్రజాస్వామ్య రిగ్గింగ్: రాహుల్ 5లో


# 'వన్‌టైమ్ ఎమ్మెల్యేలు' కావొద్దు

## ప్రతి 6నెలలకోసారి ఎంపిలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు

### పని చేస్తే ప్రోత్సహిస్తా, లేకుంటే వదులుకుంటా

### 14లోపునే 'తల్లికి వందనం'

### త్వరలో ప్రతి ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు

### టెలికాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు



**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాభివృద్ధిలో ఏడాది కాలం లో స్పష్టమైన మార్పు చూపించినట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. తెలుగుదేశంపార్టీ నాయకులు,ప్రజాప్రతినిధులు, మంత్రులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిం చాలన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరి పనితీరుపై సర్వేలు చేయిస్తున్నాం.బాగా పనిచేసిన వారికి ప్రోత్సాహం ఉంటుంది. పార్టీ, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటామన్నారు. మొదటిసారి గెలిచిన ఎంఎల్‌ఏలు మరింత భాధ్యతగా పనిచేయాలని, ప్రజలు,కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఓ ప్రజాప్రతినిధి ఒక్కసారికే ఎంఎల్‌ఏలుగా కనుమరుగు కాకూడదనే నా ఆలోచన అని ప్రజలు అన్నీ గమనిస్తారని జాగ్రత్తగా ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రమంతా నిరాశ,నిస్పృహ, చీకటి అలుముకుంది. భయంకర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు చూశారు. రాష్ట్రం పేరు వింటేనే దగ్గరకు వచ్చే పరిస్థితి లేకుండా చేశారు. అసమర్థ పాలనతో ఏపీని ఆర్థికంగా పాతాళానికి తొక్కేశారు. మనం తీసుకునే నిర్ణయాలతోనే మంచి ఫలితాలు వస్తున్నాయి. గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు ఏకపక్షంగా మనల్ని గెలిపించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి ఎంపీలు, ఎంఎల్‌ఏల పనితీరుపై సర్వేలు,నివేదికలు ఉంటాయి. మంచి చేస్తే అభినందిస్తాం, తప్పు చేస్తే దూరం పెడతా త్వరలోనే ఒక్కో ఎంఎల్‌ఏతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తా, ఎవరు ఎంత అడ్డుపడినా రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు. ఈ నెలలోనే తల్లికి వందనం నగదు తల్లులకు అందింస్తామని చంద్రబాబు తెలిపారు.ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఏడాది పాలనపై 12న నియోజక వర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు చేయాలని నిర్ణయించారు. అదేరోజున సాయంత్రం ఎన్డీయే పక్షాలు,అధికార యంత్రాంగంతో సమీక్ష నిర్వహించనున్నారు. వచ్చే నాలుగేళ్ళలో చేపట్టే కార్యక్రమాలపై ఇక్కడ చర్చించనున్నారు.

ఈ నెల 12 లేదా 14వ తేదీలోపే తల్లికి వందనం నగదు తల్లులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. 5లక్షల కోట్ల పెట్టుబడులకు పాలనా అనుమతులు ఇచ్చామని, తద్వారా 4.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం గోదావరినదిపై కట్టిన ఏ ఒక్క ప్రాజెక్టునూ తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించలేదని చంద్రబాబు గుర్తు చేశారు. పోలవరం-బనకచర్ల అనుసంధానంపై కొందరు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ యోగా డే నిర్వహణలో పార్టీ శ్రేణులు భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పని చేయాలని, ప్రజలు,కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని >>2

## ఆర్టీసికి మరో 600 విద్యుత్ బస్సులు!



**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్‌ఆర్టీసీ మరో 600 విద్యుత్తు బస్సులు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. వీటిని వివిధ నగరాల పరిధిలో, వాటి చుట్టుపక్కల ప్రాంతాలకు నడపాలని చూస్తోంది. 2 నెలల్లో బస్సులు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికలను ఆర్టీసీ సిద్ధం చేసింది. ప్రధానమంత్రి ఈ బస్ సేవా పథకం కింద కేంద్రం దేశవ్యాప్తంగా 14 వేల విద్యుత్తు బస్సులను వివిధ రాష్ట్రాల ఆర్టీసీలకు కేటాయిస్తోంది. ఇప్పటికే ఏపీలోని 11 నగరాలకు 750 బస్సులు కేటాయించింది. ఆర్టీసీ అదనంగా కేంద్రాన్ని కోరుతున్న వాటిలో 15 ఏళ్లు దాటినవి తుక్కుగా మార్చివేస్తే వాటి బదులు 300, కొత్తగా మరో 300 బస్సులు ఉన్నాయి.ఇక వీటిలో అమరావతికి కేటాయించిన బస్సులను మంగళగిరి డిపోకు, విజయవాడ, విద్యాధరపురం, తిరుపతివి మంగళం డిపోలకు అందిస్తారు.విశాఖ విద్యుత్తు బస్సులు గాజువాక డిపోతోపాటు కొత్తగా ఏర్పాటుచేసే సింహపురి డిపోకు ఇవ్వనున్నారు. ఇందుకు సింహాచలం నుంచి వేపగుంట వెళ్లే మార్గంలో సింహపురి కాలనీ వద్ద 4ఎకరాల స్థలంలో డిపో నిర్మించనున్నారు. డిపోల్లో విద్యుత్ బస్సుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. హెచ్‌టీ లైన్ కోసం విద్యుత్తుశాఖకు ఆర్టీసీ అధికారులు దరఖాస్తు చేశారు. విద్యుత్తు లైన్ ఖర్చంతా కేంద్రమే భరించనుంది.ఇప్పటికే కేటాయించిన బస్సుల్లో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు నగరాల్లో వంద చొప్పున, అమరావతి, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, రాజమహేంద్రవరం, కాకినాడల్లో 50 చొప్పున నడపనున్నారు. వీటిని పుణెకు చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్ సంస్థ గ్రాస్ కాస్ట్‌కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో నడపనుంది. మొత్తం 750 బస్సులు ఉండగా 9మీటర్ల పొడవు ఉండేవి 124 >>2

# బందరుకు ఇక పూర్వ వైభవం

### నవాబుల కాలం నుంచి వెలుగొందిన గడ్డ ఇది

### టూరిజం అభివృద్ధికి మరిన్ని చర్యలు

### మసులా బీచ్ ఉత్సవాలలో మంత్రి కొల్లు రవీంద్ర



శనివార మసులా బీచ్ పెస్టివల్‌లో సాంస్కృతిక వేదికపై నుంచి ప్రసంగిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** హైదరాబాద్ నవాబుల కాలం నుంచి కొన్ని శతాబ్దాలుగా వెలుగొందినటువంటి గడ్డ ఈ బందరు గడ్డ, ఇక్కడ పుట్టడం మనందరి అదృష్టం అని అందుకు ఒకసారి గట్టిగా భగవంతుడికి ధన్యవాదాలు తెలియజేద్దామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మసులా బీచ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ఈ రోజు ఒకమంచి ఆలోచనతో మన ప్రాంతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అదేవిధంగా యువనాయకులు నారా లోకేష్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి టూరిజం రంగంను ప్రమోట్ చేస్తున్నారన్నారు. అతి తక్కువ ఖర్చుతో అతి ఎక్కువ ఉద్యోగవకాశాలు ఈ రంగంలో సృష్టించ వచ్చున్నారు. అధిక జీడీపీని కూడా పెంచుకునే రంగం టూరిజమన్నారు. ఇవాళ ప్రపంచంలో కొన్ని దేశాలు టూరిజం మీద బతుకుతున్నాయి అంటే మనం టూరిజం రంగాన్ని చాలా నిర్లక్ష్యం చేసుకున్నామని, దానికోసమే మసులా ఫెస్ట్-2025ని మూడో రోజు చేసుకుంటున్నామన్నారు. ఈ ఉత్సవాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ నటించిన హిస్టారికల్ సినిమాకి డైరెక్ట్ చేసి మన ముందుకు వచ్చినటువంటి జ్యోతి కృష్ణకి హృదయపూర్వక అభినందనలు తెలియజేద్దామన్నారు. ఆ సినిమాలో నటించిన హీరోయిన్ నిధి అగర్వాల్‌కు అభినందనలు తెలియజేద్దామన్నారు. అదేవిధంగా జబర్దస్త్ టీమ్ బుల్లెట్ భాస్కర్ ఆధ్వర్యంలో ఇక్కడ ప్రదర్శనలు ఇవ్వడం అభినందించదగ్గ విషయమన్నారు. నేను 2014లో మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ఈ బీచ్ 10కోట్లతో అభివృద్ధి చేసామన్నారు. కానీ తర్వాత గవర్నమెంట్ మారిపోవడం మళ్లీ ఈ బీచ్‌ను మూసేశారన్నారు. ముఖ్యమంత్రి ఆశీర్వచనంతో రాజధాని అమరావతిలో నిర్మించే ఐకానిక్ టవర్ ఫ్లాగ్‌ను మనం మచిలీపట్నంలో ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇండియన్ ఫ్లాగ్‌ని 100 ఫీట్ హైట్‌లో ఫస్ట్ టైం మన మచిలీపట్నంలో నిర్మించుకున్నామన్నారు. కృష్ణాజిల్లాలో మనం మచిలీపట్నం నేషనల్ కాలేజీలో గాంధీకి మొదటిసారి ఇండియన్ ఫ్లాగ్‌ను అందించిన వ్యక్తి పింగళి వెంకయ మన ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడం మనం గర్వించదగ్గ విషయమన్నారు. నేషనల్ బీచ్ కబడ్డీకి 29 రాష్ట్రాల నుంచి మసులా ఫెస్ట్‌కువచ్చారన్నారు. 20 రాష్ట్రాల నుంచి సీ కయాకింగ్ పోటీలకు మహిళల, పురుషులకు చెందిన టీమ్స్ వచ్చాయి. విజయవాడ మొత్తం బందరుకు కదిలి వచ్చినట్లు ఉందన్నారు. హరిహర వీరమల్లు ఒక మల్ల యోధుడు కథ అని ఆయన ఇక్కడే మనరాష్ట్రంలో, మన ప్రాంతంలోనే తిరిగారనే కథ ఉందన్నారు. అలాంటి నేపథ్యం కలిగిన సినిమాను విజయవంతం చేద్దామన్నారు. పోర్టు కోసం 100రోజులు దీక్ష చేసి, >>2



శనివారం కేరళలో కంపెనీ ప్రతినిధులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సవిత

# పెట్టుబడులకు ఎపి అనుకూలం

### త్వరలో రాష్ట్రానికి కేరళ కిటెక్స్ గార్మెంట్స్

### 10 నెలల్లో రూ.9.70 లక్షలకోట్ల పెట్టుబడులు రాక: మంత్రి సవిత వెల్లడి

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** టెక్స్‌టైల్స్ రంగంలో ప్రపంచ శ్రేణి దిగ్గజ కంపెనీ కిటెక్స్ గార్మెంట్స్ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. త్వరలోనే సీఎం చంద్రబాబుతో కంపెనీ యాజమాన్యం భేటీ కానుందని వెల్లడించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయాన్ని మంత్రి సవిత శనివారం సందర్శించారు. అక్కడ తయారవుతున్న దుస్తులను పరిశీలించి, ఉద్యోగులతోనూ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కిటెక్ గార్మెంట్స్ ఛైర్మన్ సాబు జాకబ్‌తో కలిసి మంత్రి సవిత మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరవాత ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గంగా మారిందన్నారు. కేవలం పదినెలల కాలంలో రూ.9.70 లక్షల కోట్ల మేర పెట్టుబడులు ఏపీకి తరలొచ్చాయన్నారు. పీఎం నరేంద్రమోడి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఏపీలో డబుల్ ఇంజన్ సర్కార్ పాలిస్తోందన్నారు. >>2



## స్కూళ్లకు ల్యాబ్ పరికరాలు, ఆట వస్తువులు

### మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక,విజ్ఞాన అంశాలపై విద్యార్థులకు అవగాహన పెరగాలని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలకు ల్యాబ్ పరికరాలు, ఆట వస్తువులను అందిస్తామన్నారు.ఉండవల్లిలోని నివాసంలో సమగ్ర శిక్షా అభియాన్ తరపున వాటిని ప్రదర్శించారు.మంత్రి నారా లోకేష్ పరిశీలించారు వీటి పరిశీలించారు. రాష్ట్రం లోని 222 పిఎంశ్రీ పాఠశాలలకు స్టెమ్ ల్యాబ్ కిట్లు అందించనున్నారు. ఒక్కో స్టెమ్ ల్యాబ్ కిట్‌లో 335 వస్తువులు ఉండనున్నాయి. రీసెర్చ్,కాన్సెప్ట్ ఓరియంటెడ్‌గా వీటిని రూపొందించారు. విద్యార్థులకు సైన్సు, టెక్నాలజీ, గణితం అంశాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, నైపుణ్యాల >>2

## 10వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

### సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 7,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలమైన ఏఐ వ్యవస్థ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నామని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన "ఎక్స్"లో పోస్టు చేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఎన్‌విడియాతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. ఈ సంస్థ మద తుతో నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. తద్వారా వారిలో ఉపాధి,ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు ఏపీ నుండి 500 ఏఐ స్టార్టప్‌లు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. విద్య, నైపుణ్యం నుండి పరిశోధన,ఆవిష్కరణ వరకు ఏపీ పునాది వేస్తోందని చంద్రబాబు వివరించారు. ప్రతిరంగంలోను >>2

# ఎన్‌కౌంటర్: మరో 5గురు మావోయిస్టుల హతం

### మృతుల్లో ఇద్దరు మహిళలు

**చర్ల, జూన్ 7, ప్రభాతవార్త:** ఆపరేషన్ నేషనల్ అటవిప్రాంతంలో మూడురోజులు జరుగుతున్న సెర్చ్ ఆపరేషన్ లో గురు,శుక్రవారంలో కేంద్రకమిటి సభ్యుడు సుధాకర్ రాష్ట్ర కమిటి సభ్యుడు భాస్కర్ లు మృతిచెందగా తాజా శనివారం ఐదుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు చత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.మృతిచెందిన వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారని తెలిపారు.మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందని.నేషనల్ పార్క్ ఏరియాలో సెర్చ్ ఆపరేషన్‌ను మరింత ఉధృతం చేసామన్నారు.దట్టమైన అటవి ప్రాంతం కావడంతో భద్రతా బలగాలకు కొంత సవాల్‌గా మారిందని కొందరు విషపూరిత క్రిమీకిటకాలు పాముకాటుకు గురైయ్యారని అనారోగ్య సమస్యలతో కొంత ఇబ్బందులు పడ్డారని ప్రస్తుతం వారందరూ అరోగ్య పరిస్థితి మెరుగుపడిందని చత్తస్ ఘడ్ పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

ఆపరేషన్ కగార్ అంతిమ దశకు చేరిందా అంటే అవుననే సమాదానం వస్తుంది కేంద్ర చత్తీస్‌గఢ్ ప్రభుత్వాల నుండి ఇప్పటికే బస్తర్ ప్రాంతాన్ని మావోయిస్టు రహిత జిల్లా ప్రకటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శనివారం ఆపరేషన్ పర్య వేక్షిస్తున్న అధికారులను అభినందించారు.ఇప్పటికే కర్రెగుట్టలు మాఢ్ ఏరియాలలో మావోల ఉణికి లేకుండా చేసిన భద్రతా బలగాలు ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలోని దట్టమైన అటవి ప్రాంతంలోకి మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు ఆపరేషన్ నేపనల్ పార్క్‌ను >>2

# 'శాతవాహన' కూల్చివేత ఉద్రిక్తం

### స్థల యాజమాన్య వివాదం

### యువత,విద్యార్థి సంఘాల ఆందోళన

### నిరసనకు వామపక్ష పార్టీల మద్దతు



కళాశాల గేటు వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న నాయకులు

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్త బ్యూరో:** స్థానిక శాతవాహన కళాశాల భవనాలు కూల్చివేత వివాదం, విజయవాడ నగరంలో శనివారం తీవ్ర ఉద్రికత్తకు దారి తీసింది. ఈ కళాశాల శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి సొసైటీ ఆధ్వర్యంలో గత 55 ఏళ్ల క్రితం స్థాపితమైంది. ఈ కళాశాల స్థలానికి సంబంధించి యాజమాన్య వివాదం అనేక ఏళ్లుగా ఇరువార్గల మధ్య కొనసాగుతూ వస్తోంది. స్వయంగా తమకు తాము కళాశాల కమిటీలుగా ప్రకటించుకున్న ఇరు వర్గాల మధ్య, గత కొంత కాలంగా అన్నీ దశలు దాటి సుప్రీం కోర్టు పరిధి వరకూ కొనసాగుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కళాశాల ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్‌ను ఇటీవల కొందరు కిడ్నాప్ చేశారు. ఆ వివాదం సద్దుమణగ ముందే కళాశాల స్థలం తమదిగా పేర్కొంటూ, ఇతరుల ప్రవేశాన్ని నిషేధించే బోర్డును ఒక కమిటీకి చెందిన కొందరు కళాశాల మెయిన్ గేట్‌కు తగిలించారు. ఈ చర్య >>2

## 6వేలకు చేరువలో కరోనా కేసులు

### వివిధ రాష్ట్రాల్లో మృతులు- 59



**న్యూఢిల్లీ, జూన్ 7:** దేశంలో కరోనా కేసులు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. శనివారం ఉదయానికి దేశంలో మొత్తం 5755 కేసులు నమోదయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఒక్కరోజులోనే 391 కేసులుపెరిగాయి. అలాగే ఒక్కరోజులోనే నలుగురు మృతిచెందారు. మొత్తం మరణాలు 59గా నమోదయ్యాయి. ప్రస్తుతం ఆందోళన అవసరం లేదని, వైరస్ సోకినట్లు అనుమానం వచ్చినవెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలని వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం చేసింది. దేశంలో రాష్ట్రాలవారీగా కేసులను చూస్తే కేరళలో అత్యధికంగా ఉన్నాయి. మొత్తం 1806 మందికి వైరస్‌సోకినట్లు తేలింది.ఆ తర్వాత స్థానంలో గుజరాత్717 కేసులు నమోదయ్యాయి.

## 143 ఎకరాల్లో 'గూగుల్'

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతికి ప్రపంచ దిగ్గజసంస్థ గూగుల్ రానుంది. రాష్ట్రప్రభుత్వంతో ఉన్నతస్థాయిలో గూగుల్ ప్రతినిధులు చర్చిస్తున్నారు. ఇందుకుగాను అనంతవరం, నెక్కల్లు మధ్య సమీపంలోని ఈ8 రోడ్డు పక్కన సర్వేనంబర్లు 10, 12, 13, 15, 16లో సుమారు 143ఎకరాల భూమి ఉంది. దాన్ని గూగుల్‌కు కేటాయించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. గూగుల్‌సంస్థ ప్రారంభించబోయే ప్రతిష్మాత్మకప్రాజెక్టుకు అమరావతిలో అంకురార్పణ చేయనున్నారని తెలిసింది. ఆ సంస్థ ప్రతినిధులు, సీఆర్డీఏ అధికారులతో కలసి రోజున నెక్కల్లులో స్థలంపరిశీలించారు. ఇక్కడికి సమీపంలో విమానాశ్రయం, రైల్వేస్టేషన్ కూడా రానుండడంతో సంస్థ ప్రతినిధులు స్థలంపై ఆసక్తిచూపినట్లు కథనం.గూగుల్ సంస్థను ఇక్కడ నెల కొల్పితే పారిశ్రామికంగా ఈప్రాంతంఅభివృద్ధిచెందుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మళ్లీ పెరిగిన ఎండలు

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** అంచనాలకు భిన్నంగా ఏపీలో వాతావరణ పరిస్థితులున్నాయి. శనివారం రాష్ట్రమంతటా ఉక్కపోతతో కూడిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు,ఎన్టీఆర్,గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో గరిష్టంగా 42 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు నమోదయినట్లు ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో ఎండల తీవ్రత ఇంకా అధికంగానే ఉంది. జంగమహేశ్వరపురంలో అత్యధికంగా 41, కావలిలో 40.6, నెల్లూరు 40.4, బాపట్లలో 40డిగ్రీల ఉష్ణోగ్రతలు నమో దయ్యాయి.

ఉత్తర కోస్తాలో అక్కడక్కడ శుక్రవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షాలు కురిసాయి.



నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న అధికారులను శనివారం అభినందిస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా

# పేదరికం తగ్గుతోంది

## పదేళ్లలో 27.1శాతం నుంచి 5.3కు తగ్గుదల

## 26.9 కోట్లమందికి పేదరికం నుంచి విముక్తి

### ప్రపంచ బ్యాంకు నివేదిక

**న్యూఢిల్లీ, జూన్ 7:** భారత్‌లో గడచిన దశాబ్దకాలంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రపంచ బ్యాంకు విశ్లేషించింది. 2011-12 సంవత్సరాంతంలో 27.1శాతం ఉన్న పేదరికం 2022-23 సంవత్సరాంతానికిగాను 5.3శాతానికి తగ్గిందని బ్యాంకు వెల్లడించింది. సుమారు 75.24 మిలియన్ల మందిప్రజలు దుర్భరదారిద్ర్యంలోఉన్నట్లు తేల్చింది. అదే దశాబ్దం క్రితం గణాంకాలనుచూస్తే ఆనాడు 344.47 మిలియన్ల జనాభా కడు పేదరికంలో జీవించినట్లు నివేదికలు వెల్లడించింది. దీన్నిబట్టిచూస్తే మొత్తం 26.9 కోట్లమంది ప్రజలు పేదరికంనుంచి విముక్తిపొందినట్లు తేలింది. 11 ఏళ్లలోనే భారత్ గణనీయమైన ప్రగతిని సాధించిందని ప్రపంచ బ్యాంకు ఈసందర్భంగా వెల్లడించింది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు 2011-12 మధ్యకాలంలో దేశంలోని మొత్తం నిరుపేదల్లో 65శాతం మంది ఈరాష్ట్రాల్లోనే ఉన్నట్లు తేల్చింది. ఈ దశాబ్దకాలంలో 344.47 మిలియన్లనుంచి కేవలం 75.24 మిలియన్లకు తగ్గారని, దీన్నిబట్టిచూస్తే పేదరికం గణనీయంగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు ప్రకటించడం భారత్‌కు శుభసూచకం. రోజుకు 3 డాలర్ల దినసరి వేతనం వస్తున్నట్లయితే గ్రామీణ ప్రాంతాల్లో కొంతమేర విముక్తికి ఆస్కారం ఉంటుందని తేల్చింది. 2017 ధరలప్రకారంచూస్తే రోజుకు 2.15 డాలర్ల వ్యయం అవసరం అవుతోంది. దుర్భరదారిద్ర్యంలో ఉన్న ప్రజానీకం జనాభాలో 2.3వాతం వరకూ ఉన్నట్లు తేలింది. అదే దశాబ్దం క్రితంచూస్తే 16.2శాతం వరకూ ఉన్నట్లు ప్రపంచబ్యాంకు చూపించింది. ఇక మల్టీడైమెన్షనల్ పావర్టీ సూచిని బట్టిచూస్తే 2005-06లో 53.8శాతం ఉన్న పేదరికం 2019-21 నాటికల్లా 16.4శాతానికి దిగివచ్చిందని, రానురాను 2022-23నాటికి 15.5శాతంగా వచ్చిందన్నారు. బిజెపి ఆధ్వర్యంలోనిఎన్‌డీయే ప్రభుత్వం కేంద్రంలో 11ఏళ్ల పాలన పూర్తిచేసుకుంది. ఈ పదకొండేళ్ల కాలంలోనే పేదరికాన్ని గణనీయంగా తగ్గించేందుకు కృషిచేసింది. పిఎం ఆవాస్‌యోజన, పిఎం ఉజ్వల యోజన,జన్‌ధన్‌యోజన, ఆయుష్మాన్‌భారత్ వంటిపథకాలు గ్రామీణ భారతావనికి ఎంతోమేలు చేసినట్లు తెలుస్తోంది. నేరుగా లబ్దిబదిలీ (డిబిటి) ద్వారా నేరుగా ప్రభుత్వప్రయోజనాలు లబ్దిదారుల ఖాతాల్లోనే జమ అవుతున్నట్లు తేలింది. వీటన్నింటి దృష్ట్యానే 25 కోట్లమంది ఇప్పటికే పేదరికంనుంచి విముక్తిగా ఈసంఖ్య మరింతగాపెరుగుతుండటం శుభపరిణామం అని ఎన్డీయే నేతలు చెపుతున్నారు.

# భవిష్యత్ 'గ్రీన్ పవర్ దే'

## 2030 నాటికి 20,000 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

## ఇప్పటికే లక్షకోట్ల పెట్టుబడికి ఎంఒయులు

### కర్నూలులో పిన్నాపురం గ్రామాన్ని సందర్శించిన

### తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్7:** భవిష్యత్తు అంతా గ్రీన్ పవర్ దే, ఆ మేరకు తెలంగాణ రాష్ట్రం ప్రాధాన్యక్రమంగా గుర్తించి, ప్రణాళికలతో ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామంలో గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును సందర్శించిన అనంతరం ఆయన స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఏపీలోని కర్నూలు జిల్లాలో నిర్మితమవుతోన్న పిన్నాపురం గ్రీన్ కో ప్రాజెక్టు దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిందని, దీనికి ఏపీని అభినందిస్తున్నానని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీకి సంబంధించి లక్ష కోట్ల రూపాయల విలువైన ఎంఒయు లు జరిగాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ రాష్ట్రం 2025 న్యూ ఎనర్జీ పాలసీని తీసుకువచ్చింది, 2029-30 నాటికి తెలంగాణ రాష్ట్రంలో 2000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు వినియోగం అవసరాలను దృష్టిలో పెట్టుకొని వివిధ మార్గాల్లో విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలను అన్వేషిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిగులు విద్యుత్ దిశగా ముందుకు పోతుందని తెలిపారు. ఈ ప్రపంచంలో ప్రతి ఉత్పత్తికి విద్యుత్తు అవసరం, ఉత్పత్తి పెరగాలంటే విద్యుత్తు సరఫరా పుష్కలంగా ఉండాలి, ఉత్పత్తులు పెరిగితే ఉపాధితో పాటు రాష్ట్ర జీడీపీ పెరుగుతుంది ఇదంతా ఒక చక్రంలా తిరుగుతుందని డిప్యూటీ సీఎం వివరించారు. దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతోంది కేవలం బొగ్గు ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఖర్చు పెరగడంతో పాటు, కాలుష్యం పెరిగి వాతావరణ సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రపంచం మొత్తం గ్రీన్ పవర్ వైపు పరుగులు పెడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. అన్ని దేశాలు సోలార్‌తో పాటు విండ్, థర్మల్, అప్పుడు స్టోరేజ్, ఫ్లోటింగ్ సోలార్, హైడ్రోజన్ పవర్ వంటి మార్గాల ద్వారా విద్యుత్తుత్పత్తి ప్రోత్సహిస్తూ ముందుకు పోతున్నాయని తెలిపారు. పగలు సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్ ను స్టోరేజ్ చేసుకొని, రాత్రివేళ పంపుడు స్టోరేజ్ ద్వారా పీక్ అవర్స్ లో విద్యుత్తు ఉత్పత్తి చేయడం వినియోగాలకు సరఫరా చేస్తున్న గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టును కంపెనీ యాజమాన్యం ఆహ్వానం మేరకు గ్రీన్ పవర్ ఉత్పత్తి పరిశీలనకు కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పిన్నాపురం గ్రామానికి వచ్చినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. గ్రీన్ కో పవర్ కంపెనీ అనుకున్న సమయానికి విద్యుత్తు ఉత్పత్తిని



ప్రారంభించడం అభినందించదగిన విషయం అన్నారు. వారు 4వేల ఎకరాల విస్తీర్ణంలో ఒకే చోట సోలార్, విండ్, పంపుడ్ స్టోరేజీ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడం ప్రపంచంలోనే మొదటిసారి అని తెలిపారు. గ్రీన్ కో కంపెనీ సోలార్ ద్వారా నాలుగు వేల మెగావాట్లు, విండ్ పవర్ ద్వారా వేయి మెగావాట్లు, పంపుడు స్టోరేజీ ద్వారా 1,680 మెగావాట్లు మొత్తంగా ఒకే చోట 6,680 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి అభినందించదగిన విషయం అన్నారు. దేశంలో భవిష్యత్తులో గ్రీన్ కో వంటి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున రావాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రీన్ కో పవర్ ప్రాజెక్టు సందర్శనలో భాగంగా భాగంగా డిప్యూటీ సీఎం ప్రాజెక్ట్ సైట్‌పై హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. క్లోజ్డ్‌లూప్ పంప్డ్ స్టోరేజ్ సిస్టమ్‌కు సంబంధించిన ఎగువన మరియు కింది రిజర్వాయర్లు, పవర్‌హౌస్ కాంప్లెక్స్, ఆధునిక సబ్ స్టేషన్ వంటి కీలక మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గ్రీన్‌కో సంస్థకు చెందిన ఇంజినీర్లు మరియు నిర్వహణ బృందంతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, ఈ ప్రాజెక్టులో సోలార్ పవర్, విండ్ పవర్ మరియు రోజుకు రెండు సార్లు నాలుగు గంటల నిల్వ సామర్థ్యంతో కూడిన 1,680 మెగావాట్ల హైడ్రో పవర్ నిల్వ వ్యవస్థ కలిపి నిర్వహిస్తున్న విధానాన్ని డిప్యూటీ సీఎం తన అధికార బృందంతో కలిసి పర్యటించారు. డిప్యూటీ సీఎం వెంట ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, జెన్ కో సిఎండి హరీశ్, దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'వన్‌టైమ్ ఎమ్మెల్యేలు' కావొద్దు

>> పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచాం కదా అని ఎవరైనా ఓవర్ కాన్ఫిడెన్స్‌కు పోతే వారికే ఎక్కువ నష్టం జరుగుతుందని తేల్చి చెప్పారు. వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు అనేది తన ఆలోచన అని అధినేత వెల్లడించారు. శాశ్వతంగా ప్రజలు మనతో ఉండేలా చూసుకంటూ మరింత నమ్మకాన్ని కలిగించాలని అభిప్రాయపడ్డారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేసి నివేదికలు తెప్పించుకుంటున్నట్లు తెలిపారు. మంచి చేస్తే అభినందించి ప్రోత్సహిస్తానని, అవకాశాలు కల్పిస్తానని, తప్పు చేస్తే మాత్రం దూరం పెడతానని ఇందులో రాజీ లేదనే విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలని తేల్చిచెప్పారు. ఏ ఒక్కరి చర్యల వల్ల వ్యవస్థకు నష్టం జరుగుతుంది అంటే అంగీక రించేది లేదని వెల్లడించారు. ఒకరిద్దరి వల్ల అక్కడక్కడా నష్టం కూడా జరుగుతోందని గుర్తు చేశారు. కొన్ని సందర్భాల్లో అడ్మినిస్ట్రేషన్‌లో తప్పుల వల్ల, అధికారుల తీరు వల్ల కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. మంత్రులు ఈ విషయంలో మరింత బాధ్యతగా ఉం డాలని సూచించారు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పేనని హెచ్చరించారు. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తానన్నారు. అధికారంలో ఉన్న మనల్ని ప్రజలు అన్ని రకాలుగా గమనిస్తుంటారు కాబట్టి జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రమంతా నిరాశ, నిస్పృహ, చీకటి అలుముకుందని ధ్వజమెత్తారు. భయంకర పరిస్థితులను రాష్ట్ర ప్రజలు చూశారని గుర్తు చేశారు. రాష్ట్రం పేరు వింటేనే దగ్గరకు వచ్చే పరిస్థితి లేకుండా చేశారని మండిపడ్డారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని అసమర్థ పాలనతో పాతాళానికి తొక్కేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతోనే మంచి ఫలితాలు వస్తున్నాయన్న చంద్రబాబు, గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు ఏకపక్షంగా ఓట్లువేసి గెలిపించారని స్పష్టం చేశారు.

# బందరుకు ఇక పూర్వ వైభవం

>> ఎన్నో పోరాటాల ద్వారా తెచ్చుకున్నామన్నారు. 2026 జూన్ లేదా జూలైలోగాని పోర్టు ప్రారంభం అవుతుందన్నారు. దీనివల్ల మన యువతకు వేల ఉద్యోగవకాశాలు లభిస్తాయన్నారు. మనం స్వదేశీ దర్శన కింద గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఒక రూ. 120 కోట్లతో డిపిఆర్ తయారుచేసి పంపించడం జరిగిందన్నారు. ఇప్పటికే చాలామంది మేము వచ్చి ఇక్కడ రిసార్ట్స్ కడతామని చాలామంది ముందుకు వస్తున్నారన్నారు. షిప్ యార్డు కు 3 కంపెనీలు వస్తున్నాయన్నారు. షిప్ బిల్డింగ్ బీచ్ వద్ద తయారు అవుతుందన్నారు. ఇవన్నీ వస్తే మచిలీపట్టణం అభివృద్ధికి తిరుగు ఉండదన్నారు. మసులా ఫెస్ట్‌కు 300 మంది వివిధ రకాల క్రీడాకారులు మచిలీపట్టణంకు వచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, కలెక్టర్ డీ.కె. బాలాజీ, తదితర జిల్లా అధికారులు, సినిమా రంగానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాగరతీరంలో సాంస్కృతి ఉత్సవాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో గాయని గీతా మాధురి సంగీత విభావరి, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు, జబర్దస్త్ టీమ్ హాస్య భరిత నాటికలు, మిమిక్రీతో ప్రేక్షకులకు ఆద్యాంతం వినోదాన్ని పంచారు. కార్యక్రమానికి రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్ కృష్ణయ్య, కార్యక్రమ నోడల్ అధికారి మెప్మా పీడి సాయి బాబు, కూటమి నాయకులు బండి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోపు సత్యనారాయణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులకు ఎపి అనుకూలం

>> పెట్టుబడులకు అవసరమైన భూ కేటాయింపులు, విద్యుత్, నీటి సౌకర్యం సహా అన్ని మౌలిక వసతులు కల్పనకు తమ కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యంగా ఏపీలో టెక్స్ టైల్ రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఇటీవలే నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కేరళలలో పెట్టుబడుదారులతో సమావేశమవుతున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా కిటెక్స్ యాజమాన్యంతో భేటీ అయినట్లు మంత్రి సవిత వెల్లడించారు. సత్యసాయి జిల్లాలో కిటెక్స్ గార్మెంట్స్ ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సమీపంలో బెంగుళూరు విమానాశ్రయంతో పాటు కృష్ణపట్నం పోర్టు, రైల్వే కనెక్టవిటీ కూడా ఉందని, దీనివల్ల ఉత్పత్తుల ఎగుమతులు ఎంతో అవకాశముందన్నారు. కర్నూల్ లో పత్తి ఎక్కువగా ఉత్పత్తవుతోందని, కిటెక్స్ గార్మెంట్స్ కావాల్సిన రా మెటీరియల్ అక్కడి నుంచే సరఫరా చేయొచ్చునని మంత్రి సవిత వెల్లడించారు. కిటెక్స్ నిర్వహణ భేష్‌కిటెక్స్ గార్మెంట్ నిర్వహణపై మంత్రి సవిత సంతృప్తి వ్యక్తంచేశారు. లాభార్జనతో కాకుండా నైతిక విలువలతో వ్యాపార నిర్వహణ చేస్తోందన్నారు. 15 వేల మంది ఉద్యోగులను కుటుంబ సభ్యుల్లా గౌరవిస్తుండడంపై కిటెక్స్ యాజమాన్యాన్ని కొనియడారు. టెక్స్ టైల్స్ రంగంలో కేరళలో అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న సంస్థగా నిలిచిందన్నారు. దుస్తుల తయారీలో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా కిటెక్స్ గుర్తింపు పొందిందన్నారు. ఇటీవలే తెలంగాణాలో కిటెక్స్ రూ.3,600 కోట్లు పెట్టుబడులు పెట్టిందని మంత్రి సవిత వెల్లడించారు. ఏపీలో కిటెక్స్ పెట్టుబడులపై హర్షంఏపీలోనూ కిటెక్స్ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేస్తూ, సంస్థ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత కిటెక్స్ గార్మెంట్స్ ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆమెతో పాటు ఆ సంస్థ ఎండీ సాబు జాకబ్, ఇతర సిబ్బంది ఉన్నారు.

# స్కూళ్లకు ల్యాబ్ పరికరాలు, ఆట వస్తువులు

>> అభివృద్ధికి ఇవి ఉపయోగపడనున్నాయి. మంత్రి వీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా రామవరప్పాడు ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న మస్తాన్‌రావు, విజయవాడ పటమట బడిలో రెండో తరగతి చదువుతున్న నీహారిక గీసిన చిత్రాలను సిబ్బంది మంత్రి లోకేష్‌కు బహూకరించారు.

# ఎన్‌కౌంటర్: మరో 5గురు మావోయిస్టుల హతం

>> ఆపరేషన్ కగార్ అంతిమ దశకు చేరిందా అంటే అవుననే సమాధానం వస్తుంది కేంద్ర చత్తీస్‌గఢ్ ప్రభుత్వాల నుండి ఇప్పటికే బస్తర్ ప్రాంతాన్ని మావోయిస్టు రహిత జిల్లా ప్రకటించారు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శనివారం ఆపరేషన్ పర్యవేక్షి స్తున్న అధికారులను అభినందించారు. ఇప్పటికే కర్రిగుట్టలు మాఢ్ ఏరియాలలో మావోల ఉనికి లేకుండా చేసిన భద్రతా బలగాలు ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియాలోని దట్టమైన అటవి ప్రాంతంలోకి మావోయిస్టు అగ్రనేతలు తలదాచుకున్నట్లు నిఘా వర్గాల సమాచారం మేరకు ఆపరేషన్ నేషనల్ పార్క్‌ను ప్రారంబించాయి. గడిచిన మూడురోజుల వ్యవధిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ బాస్కర్ తోపాటు ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. అగ్రనేతలు అందరూ ఆ ప్రాంతంలో ఉన్నారన్న సమాచారం మేరకు విశృత సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

**హిడ్మా తాజా చిత్రం వెలుగులోకి**

కేంద్ర చత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వాల మోస్టు వాంటెడ్ నాయకుడు మాడ్వి హిడ్మా ఆలియాస్ సంతోష్ తాజా చిత్రం వెలుగులోకి వచ్చింది. ఇప్పటి వరకు హిడ్మా 25 సంవత్సరాల క్రితం ఫొటో నే ఇన్నాళ్లు అందుబాటులో ఉంది. ఆపరేషన్ అంతిమ దశకు చేరుకుంటున్న క్రమంలో హిడ్మా 51 ఏళ్ల నాటికి చిత్రం బహిర్గతం కావడం తీవ్ర చర్చీయనాంశం అయ్యింది. అయితే తాజా చిత్రమా లేక గతంలో తీసిందా అన్న అనుమానాలు ఉన్నాయి. ఇన్నాళ్లు భద్రతా బలగాల దగ్గర లేన హిడ్మా ఫొటో ఇప్పుడు బహిర్గతం కావడంలో ఆయన కనుసన్నల్లో నడిచే పిఎల్ జి ఏ బలగాలు లొంగిపొయిన క్రమంలో పోలీసు అధికారుల చెంతకు చేరినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఇక మస్క్ కొత్తపార్టీ!

## అధ్యక్షునితో వార్ సీరియస్

## అన్ని కాంట్రాక్టులు, రాయితీలు రద్దు చేస్తామన్న ట్రంప్

**వాషింగ్టన్, జూన్ 7:** రిపబ్లికన్ నేత అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఆయన అనుంగు మిత్రుడుగా మెలిగిన టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌లమధ్య ఇపుడు పచ్చగడ్డివేస్తే భగ్గుమంటోంది. ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతున్నారు. ట్రంప్ చేపట్టిన సుంకాల కార్యాచరణలో కొన్నింటిని తీవ్రంగా వ్యతిరేకించిన మస్క్, తాజాగా రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన రిపబ్లికన్ ట్యాక్స్‌ను కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా కూడా ట్రంప్ తన మొండిపట్టుదలను వీడకుండా వీటిని అమలుచేసేందుకుఉద్యుక్తులు అవుతున్నారు. పైగా మస్క్‌ను తీవ్రంగా విభేదించిన అధ్యక్షుడు ఏకంగా టెస్లా అధినేతకు ప్రభుత్వపరంగా ఇచ్చినరాయితీలు, సుంకాల మినహాయింపుతోపాటు స్పేస్‌ఎక్స్ ప్రాజెక్టుకు ఇచ్చిన కాంట్రాక్టులను కూడా రద్దుచేస్తామని ప్రకటించడంతో నాసాకు స్పేస్‌ఎక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌సరఫరాచేసే కాంట్రాక్టునుంచి వైదొలుగుతున్నట్లు మస్క్ ప్రకటించారు. ఎన్నికల్లో తనవల్లనే ట్రంప్ గెలిచారని చెపుతున్న మస్క్ ఆయన గెలుపుకోసం 30 కోట్ల డాలర్లు ఖర్చుచేసినట్లు చెపుతున్నారు. ఇపుడు తాజాగా ఏకంగా ట్రంప్‌పై అభిశంసన తీర్మానంప్రవేశపెడితే తాను మద్దతిస్తానని ప్రకటించి మరో అడుగు ముందుకేసారు. అక్కడితో ఆగకుండా 'ది అమెరికా పార్టీ' పేరిట ప్రత్యేక సొంతపార్టీకూడా పెట్టేందుకు కసరత్తులు చేస్తున్నారు. ఇందుకుగాను తన సోషల్‌మీడియా 'ఎక్స్'లో నిర్వహించిన అభిప్రాయసేకరణలో తనకు 80శాతంమంది అమెరికా ప్రజలు మద్దతుపలికారని, అందువల్ల ఇపుడు అమెరికాలో కొత్తపార్టీ పెట్టే తరుణం వచ్చినట్లుగా కనిపిస్తోందంటూ మస్క్ తన ఎక్స్ హ్యాండిల్‌పై చేసిన వ్యాఖ్యలు ట్రంప్‌నకు కాకపుట్టిస్తున్నాయి. అక్కడితో ఆగకుండా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లైంగికవేధింపుల కేసుల్లో నిందితుడయిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సన్నిహితంగా కొనసాగారని, ఆయనకు సంబంధించిన దర్యాప్తు ఫైళ్లలో ట్రంప్ పేరుకూడా ఉందని ఆరోపించారు.



శనివారం పోలీసు విచారణకు హాజరైన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి

# రెండో రోజు పోలీస్ విచారణలో కాకాణి

**నెల్లూరు రూరల్, జూన్ 7, ప్రభాతవార్త:** అక్రమ మైనింగ్ కేసులో ఏ4గా నిందితుడుగా ఉన్న మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి 14 రోజుల రిమాండ్ అనంతరం పోలీస్ కస్టడీకి అప్పగించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టు పోలీస్ స్టేషన్లో విచారణ కొనసాగు తుంది. మొదటిరోజు రెండున్నర గంట పాటు జరిగిన విచారణలో డిఎస్‌పి శ్రీనివాసరావు 22 ప్రశ్నలు అడగగా వాటిలో 2 ప్రశ్నలకు మాత్రమే సమాధానం ఇచ్చినట్టు సమాచారం. వాటిలో ఒకటి పోలీసులు నోటీసులు ఇచ్చిన ఎందుకు తీసుకోలేదు అన్న ప్రశ్నకి సమాధానంగా గోవర్ధన్ రెడ్డి హైదరాబాదులో కుటుంబానికి సంబంధించిన శుభకార్యంలో ఉన్నట్లు జవాబు ఇచ్చారు. రెండవ ప్రశ్న అక్రమంగా మైనింగ్ తరలించిన విషయంలో మీకు సంబంధం ఉందా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం నాకు ఏమీ తెలియదు అని మాత్రమే సమాధానం ఇచ్చినట్లు సమాచారం. రెండవ రోజు ఉదయం 10 గంటలకు ఒంటిగంటకు భోజన విరామం తిరిగి రెండుకు మొదలైన పోలీసు విచారణలో ఎలాంటి సమాధానాలు చెప్పారన్న విషయం తెలియదు.

# 'శాతవాహన' కూల్చివేత ఉద్రిక్తం

>> ఇరువర్గాల మధ్య తీవ్ర వివాదానికి దారితీయండంతో స్థానిక పోలీసులు సర్దిచెప్పి శాంతింప చేశారు. ఇరు వర్గాల వివాదం కొలిక్కి రాకముందే, శుక్రవారం తెల్లారుజామున బోయపాటి శ్రీనివాస్ మద్దతు దారులుగా భావిస్తున్న కొందరు రహస్యంగా కళాశాలలో జేసీబీలు,ట్రాక్టర్లతో ప్రవేశించి తరగతి గదులను కూల్చివేశారు. ఆ సమయంలో కరెంటు సరఫరాను నిలిపివేసి, కాపాలదారుని తమ స్వాధీనంలోకి తీసుకొని కూల్చివేతలు కొనసాగించినట్లు మరో వర్గం ఆరోపిస్తుంది. ఉదయాని కల్లా సమాచారం బయటికి పొక్కడంతో సూర్యారావుపేట పోలీసులు హుటాహుటిన కళాశాల వద్దకు చేరుకొని జేసీబీ, ట్రాక్టర్లను స్వాధీన పర్చుకున్నారు. కూల్చివేతకు పాల్పడిన వారిని పోలీసు స్టేషన్‌కు తరలించి వాగ్మూలం నమోదు చేశారు. మరుసటి రోజు శనివారం నాటికి కళాశాల భవనాల కూల్చివేత ఉందంతం నగరమంతటా పాకి తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. సమాచారం అందుకున్న ఆ కళాశాల పూర్వ విద్యార్థులు, పలు విద్యార్థి సంఘాల నేతలు కళాశాలకు చేరుకొని పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. 55 ఏళ్లకు పైబడి చరిత్ర కల్గి ఉన్న విద్యాసంస్థను.. అర్థరాత్రి గుట్టుచప్పుడు కాకుండా కూల్చివేయడంపై సీపీఐ,సీపీఎం పార్టీలతో పాటు పూర్వ విద్యార్థి సంఘాలు తీవ్రస్థాయిలో ఖండించాయి. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ,నగర కార్యదర్శి వి.కోటేశ్వరరావు, సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు సీ.హెచ్.బాబూరావు,సీపీఎం కార్మిక నేత దోనెపూడి కాశీనాథ్, యువజన సంఘాల నేతలు విష్ణువర్ధన్,అరుణకుమార్‌లతో పాటు పలువురు విద్యార్థి యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున కళాశాలకు చేరుకొని నిరసన,ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి తమవంతు మద్దతు ప్రకటించారు. కోర్టు తీర్పుల సాకుగా రూ. 200 కోట్లు విలువ చేసే కళాశాల స్థలాన్ని యథేచ్ఛగా ఆక్రమించారని వామపక్ష పార్టీల నేతలు కె.రామకృష్ణ,సీ.హెచ్‌బాబూరావులు ఆరోపించారు. కళాశాల కొత్త,పాత కమిటీ వ్యవహార శైలిలో అనేక మతలబులు ఉన్నాయని,కళాశాల స్థలాన్ని కాపాడే విషయమంలో నిజాయితీ లోపించిందని ఆరోపించారు. ఈ విషయమై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కూల్చివేత ఆక్రమణల వ్యవహారమై వచ్చిన పలు ఫిర్యాదుల మేరకు సూర్యారావుపేట పోలీసులు అందుకు కారణమైన బోయపాటి శ్రీకృష్ణ, వంకాయలపాటి శ్రీనివాస్‌తో పాటు రమాసత్యనారాయణపై పలు కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కళాశాల పరిసరాల్లో శాంతి భద్రతల పరిస్థితి చేయి దాటకుండా ఉండేందుకు సంబంధిత పరిధి పోలీసులు కళాశాల వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. కళాశాల భవనాల కూల్చివేత విషయమై పోలీసుల దర్యాప్తు కొనసాగుతున్న దశలో.. కళాశాలకు సంబంధించి వాస్తవాలు, పూర్వపరాలు తేలితే కాని ఈ వివాదం ఓ కొలిక్కి వచ్చే అవకాశం కానరావడం లేదు.

## ఎపి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు

**విజయవాడ,జూన్7ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. మే 12 నుండి 20 వరకు ఈ పరీక్షలు జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1,35,826 మంది,రెండో ఏడాది పరీక్షలకు 97,963 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# విద్యుత్ బస్సులు!

>> కాగా, మిగిలినవన్నీ 12 మీటర్ల పొడవు ఉన్నవే కావడం గమనార్హం. 12 ఏళ్ల వరకు గానీ, 10 లక్షల కి.మీ. వరకు గానీ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ, గుత్తేదారు సంస్థ మధ్య ఒప్పందం జరిగింది. 12 మీటర్ల బస్సుకు కి.మీ.కు రూ.72.55 చొప్పన, అదే 9 మీటర్ల బస్సుకు కి.మీ.కు రూ.62.12 చొప్పున కేంద్రం బస్సులకు ధరలను నిర్ణయించింది. ఇందులో కి.మీ.కు రూ.24 చొప్పున కేంద్రం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన మొత్తాన్ని ఆర్టీసీ చెల్లించవలసి ఉంటుంది. గుత్తేదారు సంస్థ 2 నెలల తర్వాత నుంచి ఈ బస్సులను దశల వారీగా పలు నగరాల్లో ప్రవేశపెట్టనుంది.

# 10వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

>> విద్యార్థులకు వారి,వారి కోర్సులతో పాటు సాంకేతికత,నైపుణ్యతను మెరుగుపరు స్తామన్నారు. ప్రతి విద్యార్థిలో స్కిల్స్ ఉంటాయి. వాటికి కొద్దిగా మనం అండగా ఉంటే గొప్ప సృజనాత్మక ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. అమ రావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దాలనే తమ లక్ష్యం వెనుక స్పష్టమైన విజన్ ఉందన్నారు.ఏపీ ఏడాది పాలనపై ప్రజలనుంచి నేరుగా అభిప్రాయాలను కోరుతున్నామన్నారు. ఇందుకు మంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తుందన్నారు. ప్రభుత్వ విధానాలపై సంతృపత లేని వారిని పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. మళ్ళీ ప్రజాభిప్రాయం తీసుకునే సరికి వారు మెచ్చుకునే దిశలో ప్రభుత్వం విధాన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 08-06-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి ఉ.7.18
స్వాతి మ.12.40
వర్జ్యం సా.6.56-8.43
దు.సా.4.51-5.43
శుభసమయం : ఉ.8.30-9.15
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** పారిశ్రామిక, సాంకేతిక, కళారంగాల వారికి యోగదాయకమైన కాలం.

**వృషభం :** శాస్త్ర సాంకేతిక విషయంలో ఆసక్తి చూపుతారు. ఆర్థికంగా బలం చేకూరుతుంది.

**మిథునం:** ఆరోగ్యం మెరుగు పడుతుంది. మానసిక ప్రశాంతత పొందుతారు.

**కర్కాటకం:** సంఘంలో గౌరవం పొందుతారు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధికమించి ముందుకు సాగుతారు.

**సింహం:** కాంట్రాక్టులు చేపట్టే వీలుంది. ప్రముఖులనుండి ముఖ్య సమాచారం అందుతుంది.

**కన్య :** ఉద్యోగులు ఊహించని ప్రమోషన్లు పొందుతారు. సమీప బంధువులను కలిసి ఉల్లాసంగా గడుపుతారు.

**తుల :** ఇంటా బయటా ప్రోత్సాహం పొందుతారు. రాజకీయ రంగాలవారికి పదవియోగం.

**వృశ్చికం:** ఉద్యోగాలలో ఇంక్రిమెంట్లు పొందుతారు. రెండు, మూడు విధాలుగా ఆర్థిక లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఉద్యోగులకు బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**మకరం:** రుణాలు తీరి ఊరట చెందుతారు. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**కుంభం:** పనుల్లో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. విద్యార్థులు యత్నాలలో ఆటంకాలు ఎదురై సన్నిహితుల సాయం అందుకొంటారు.

**మీనం :** ఇంటా బయటా ప్రోత్సాహం పొందుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుతుంది. వాహనసౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



# తిరుమల లడ్డూ పేరుతో ఆన్‌లైన్ వ్యాపారం

### - నాలుగుసంస్థలకు టిటిడి నోటీసులు - 2009లోనే టిటిడి లడ్డూ పేటెంట్

**తిరుమల,జూన్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలశ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతే పవిత్రత ఉన్న లడ్డూప్రసాదాన్ని దేశంలో మరెవరూ తయారుచేయకుండా 2009సంవత్సరంలోనే టిటిడి పేటెంట్(హక్కు)ను పొందింది. అయితే ఇటీవల కొందరు ప్రైవేట్ వ్యాపారులు, స్వీట్లు తయారీ సంస్థలు ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో ఈ కామర్స్ లో తిరుమలలడ్డూపేరుతో అనధికారికంగా వినియోగించుకుంటున్న అంశాన్ని టిటిడిగుర్తించింది. వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. ఫ్లిప్‌కార్ట్ ఈ కామర్స్‌సంస్థ సహా మరో నాలుగుసంస్థలు ట్రాన్సా క్ట్‌ఫుడ్స్, ఇండియా స్వీట్స్‌హౌస్ వంటిసంస్థలకు టిటిడి నోటీసులు పంపింది. ఆన్‌లైన్‌లో లడ్డూఫోటోలను తొలగించకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని టిటిడి పేర్కొంది. తిరుమల లడ్డూబ్రాండ్‌కు సంబంధించిన ఆన్‌లైన్ వాడుకపై కఠిన చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. అయితే కొన్నిగంటల్లోనే ఫ్లిప్‌కార్ట్ వెంటనే స్పందించి లడ్డూప్రసాదం పేరును తొలగించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తిరుమల శ్రీవారి భక్తులు అత్యంత పవిత్రంగా లడ్డూప్రసాదాన్ని భావిస్తారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జిఐ) హక్కులను ఉల్లంఘిస్తూ స్వామి లడ్డుపేరుతో తమ ఉత్పత్తులను విక్రయిస్తున్న ,ప్రచారం చేసినా నేరంగా పరిగణించింది. ఈ లడ్డూప్రసాదాలపై టిటిడి అధికారులు అప్రమత్త మయ్యారు. టిటిడి ఇఒ శ్యామలరావు ఆదేశాలతో టిటిడి న్యాయవిభాగం అధికారులు ఢిల్లీకి చెందిన సహదేవ లా ఛాంబర్స్‌ద్వారా నోటీసులు జారీ చేయడంతో వెలుగుచూసింది.

# ప్రార్థనాలయాన్ని స్వర్గధామం చేస్తా..

## ఎమ్మెల్యే వెంకటసుధీర్‌రెడ్డి



ఈద్‌గాహ్ వద్ద నమాజు సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి, జూన్7 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలోని పలు చోట్ల శనివారం బక్రీద్ పండగ సందర్భంగా ఈదుల్ అజ్‌హా ప్రార్థనల్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో ముఫ్తినయిం సాహెబ్ ఈదుల్ అజహా ప్రార్థనలను,ప్రాధాన్యతను వివరించారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరయ్యారు. రాబోవు రోజుల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈద్‌గాహ్ వద్ద ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసామని రాబోవు రోజుల్లో ఈ ప్రాంతంలో చక్కటి పార్కుతో పాటు నిర్మాణంలో ఉన్న మసీదును పూర్తి చేసుకుందామని మైనారిటి ముస్లింలకు అవసరమైన సామాజిక అవసరాలను తనకు నివేదిక అందిస్తే అన్ని పూర్తి చేసుకుందామని సుధీర్‌రెడ్డి వివరించారు. మహానీయులు,ప్రవక్తల త్యాగనిరతి భావి తరాలకు మార్గ దర్శకం కావాలన్నదే అల్లాహ్ సందేశం అని ఈదుల్ ఆజ్‌హా ప్రార్థనల్లో మత గురువులు వివరించారు. ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో ముఫ్తీనయిం సాహెబ్ ప్రవక్తల సత్యసంధతను వివరిస్తూ అల్లాహ్ ఆదేశాల్ని అమలు చేయటం ఒకటైతే కలలో వచ్చిన సందేశాన్ని తూచ తప్పక భావితరాల హృదయాల్లో చిరస్థాయిగా నిలవటమే కాకుండా మార్గదర్శకమయ్యా న్నారు. ఇబ్రహీం ఖలీలుల్లా సొల్లె అలా సొల్లం. ముఖ్యంగా బక్రీద్ అంటే 'ఖుర్బాని' అని అర్థంగా వివరించారు. స్తోమత ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వని వారి జీవితం నిరర్థకమన్నారు. 'దైవాజ్ఞతో కన్నబిడ్డను బలిదానం ఇవ్వటానికి కూడా వెనుకాడని మహానీయుని జ్ఞాపకార్థం జరుపుకునే పండగే బక్రీద్ అని శ్రీఈదుల్ అజ్‌హా సందర్భంగా మత గురువులు బోధించారు. అలాంటి మహానీయుల సంతతి నేడు ఎలా ఉందో మనం ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఇస్లాం పుట్టినప్పటి నుంచి ఎందరో ప్రవక్తలు జన్మించారని వారిలో చివరి ప్రవక్త మహామ్మద్ సొల్లె అలా సొల్లం అని వివరించారు. ఆయన కుటుంబీకులు ఇబ్రహీం ఖలీలుల్లా, ఇస్మాయిల్ జబీఉల్లాలు తండ్రి కొడుకులని వివరించారు. ఇబ్రహీం ఖలీలుల్లాకు వృద్ధాప్యంలో ఇస్మాయిల్ జబీఉల్లా జన్మించా రన్నారు. ఇబ్రహీం ఖలీలుల్లా జీవితాంతం అల్లాహ్ ఎన్నో దైవభక్తి పరీక్షలు నిర్వహించి భావి తరాలకు మార్గదర్శకం చేశారన్నారు. ఆయన ఇస్లాం మత వ్యాప్తికి విగ్రహారాధనను వ్యతిరేకించినందుకు అగ్గిపరీక్షను ఎదుర్కొన్నారని తరువాత దైవాజ్ఞను ఆచరించటానికి తన భార్యా బిడ్డల్ని మంచినీరు సైతం లేని కారడవుల్లో వదలిపెట్టిన ఆయన మరో పరీక్షలో కన్నబిడ్డను బలిదానం ఇవ్వటానికి సిద్ధపడ్డారని వివరించారు. అంటే ఏదైనా దైవాజ్ఞతోనే జరుగుతుందన్నది వాస్తవమన్నారు. అలాంటి బలిదానాల సంతతి నేడు ఏం చేస్తుందో ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకో వాలన్నారు. ఆర్థిక స్థోమత కల్గిన వారు 'హజ్' చేయాలని అలాగే ఖుర్బానీ ఇవ్వాలని దివ్యఖుర్ ఆన్ సూచిస్తుందని అయితే ఎందరు ఆచరి స్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు.

# అమరావతిలో వరద సెన్సార్లు ఏర్పాటుకు సిఆర్‌డిఎ కసరత్తు

## విపత్తుల ముందస్తు హెచ్చరికను అనుసరించి ప్రణాళిక

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో వరద నిర్వహణకు అవసరమైన ప్రణాళికను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. గతంలో ఈ ప్రాంతం కొండవీటివాగు ముంపునకు గురయిన పరిస్థితుల నేపథ్యంలో వరద నివారణకు నూతన ప్రణాళిక కోసం అధ్యయనం చేయనున్నారు. కొండవీటివాగు, కృష్ణానది వరదల నుండి ఇబ్బంది లేకుండా చూడటంతోపాటు ఇతర విపత్తుల నిర్వహణ చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించేందుకు కార్యాచరణకు సిఆర్‌డిఎ సిద్ధమైంది. అమరావతి పరిధిలో గత 100 సంవత్సరాల్లో వచ్చిన వర్షపాతం (24 గంటలు) వరదలను ప్రామాణికంగా తీసుకుని కొత్త ప్రతిపాదనలు రూపొందించనున్నారు. ఇప్పటి వరకూ వరద ముంపు లేదని చెబుతూ వచ్చిన ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పి)లో నిరంతరం ముంపునకు గురవుతున్న ప్రాంతాల్లో వరద ప్రమాద హెచ్చరిక సెన్సార్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని పేర్కొంది. దీనికోసం కృష్ణానది జలాల భౌగోళిక స్వరూపం మార్పుపైనా అధ్యయనం చేయనున్నారు. కొండవీటివాగు ముంపునూ, పాలవాగు ప్రవాహాన్ని ఉదహరించారు. 2050 నాటికి 35 లక్షల మంది జనాభా ఇక్కడకు చేరతారనే అంచనాకు తగిన విధంగా విపత్తు నిర్వహణ ప్లాను రూపొందించనున్నారు. ముఖ్యంగా కృష్ణానది కరకట్టలతోపాటు నూతనంగా నిర్మించబోయే కాలువలు, జలాశయాల వెంట కూడా సెన్సార్లు బిగించనున్నారు. అమరావతి నగరం భూకంప జోన్ 3 (ప్రమాద తీవ్రత తక్కువగా ఉండే ప్రాంతం)లో ఉండటంతో దానికి తగిన విధంగా రక్షణ చర్యలు తీసుకోనున్నారు. వీటన్నిటి నిర్వహణ కోసం డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ యూనిట్ (డిఆర్ఎంయు)ను ఏర్పాటు చేయనున్నారు. వరదలను అంచనా వేయడంతోపాటు నిర్వహణ వ్యవస్థలను బలోపేతం వంటి పనులను డిఆర్ఎంయు చేయనుంది.



గతంలో కొండవీటి వాగు ముంపుకు గురైన రాజధాని ప్రాంతం(ఫైల్)

దీంతోపాటు వరదలు లేదా మరే ప్రకృతి విపత్తులు, అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రమాద తీవ్రత తగ్గింపునకు అవసరమైన నివారణ చర్యల కోసం ముందస్తు ప్రమాద హెచ్చరికల వ్యవస్థ (డిజాస్టర్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్ - డిఇడబ్ల్యుఎస్) ఏర్పాటు చేయనున్నారు. వీటితోపాటు అమరావతిలో ఉష్ణోగ్రత నిర్వహణ, నిర్మిస్తున్న భవనాల నిర్మాణంలో అవలంబించాల్సిన వ్యూహాలను తయారు చేయనున్నారు.



# భక్తజన సంద్రంగా కాణిపాకం ఆలయం

### - కిక్కిరిసిన ఆలయ మాడవీధులు

**కాణిపాకం, జూన్ 7 ప్రభాతవార్త:** సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి అలయ దర్శనార్థం అశేషంగా తరలివచ్చిన భక్తులతో శనివారం కాణిపాకం ఆలయం భక్త జనసంద్రంగా మారింది. గత కొద్ది రోజులుగా వేసవి సెలవుల కారణంగా ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ కొనసాగుతోంది. ఈనేపథ్యంలో శని, ఆదివారాలు,వరుస సెలవు రోజులు,వారంతపు రోజులు కావడంతో పాటు విద్యాసంస్థలు,పాఠశాలలకు వేసవి సెలవులు మరో రెండు మూడు రోజుల్లో ముగుస్తుండడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం భక్తులు వివిధ ప్రాంతాల నుండి పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో పోటెత్తింది. శని, ఆదివారాల్లో ఆలయంలో రద్దీ కొనసాగుతోంది. రద్దీ కారణంగా ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు.అలాగే ఆలయ మాడ వీధులు, పరిసరాలన్ని కిక్కిరిసిపోయాయి. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో సుమారు నాలుగు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. దీనితో భక్తులకు త్వరితగతిన స్వామిదర్శనం కల్పించేందుకు

## క్యాన్సర్‌తో పోరాడుతున్న ముద్రగడ పద్మనాభం!

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం క్యాన్సర్‌తో బాధపడుతున్నారా ! అనే అంశం రాజకీయంగా చర్చంశంగా మారింది. 'నాన్న ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో పోరాడుతున్నారు.ఆయన క్యాన్సర్‌తో ఇబ్బంది పడుతున్నారు.నా సోదరుడు గిరి ఆయనకు ఉద్దేశ్యపూర్వకంగా సరియైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.' అని పద్మనాభం కుమార్తె బి.క్రాంతి ఎక్స్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి వద్దకు తనను తీసుకెళ్ళేందుకు వైకాంగ్రెస్ పా మాజీ ఎంఎల్‌ఏ ఒకరు ప్రయత్నిస్తే సోదరుడు గిరి,అతని మామ అడ్డుకున్నారని ఆరోపించారు. తన తండ్రి ఆరోగ్య సమాచారం గురించి దగ్గరి బంధువులు,ఆయన ప్రధాన అనుచరులకు సైతం తెలియడం లేదన్నారు.ఈ ట్వీట్ విస్తృతంగా ట్రెండ్ అవుతుంది. అయితే పద్మనాథం ఆరోగ్యపరిస్థితిపైగాని, క్రాంతి ట్వీట్‌పై ముద్రగడ స్పందించలేదు.

# 20న అన్నదాతా సుఖీభవ - పిఎం కిసాన్!

**విజయవాడ జూన్ 7ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో అన్నదాతా సుఖీభవ -పీఎం కిసాన్ పథకంఅమలుకు రంగం సిద్ధమైంది. ఈ పథకానికి సంబంధించి 45.71 లక్షల రైతు కుటుంబాల అర్హులుగా గుర్తించారు. వీరికి ఏడాదికి రూ.20 వేల చొప్పున మూడు విడతల్లో లబ్ధి చేకూరనుంది.పీఎం కిసాన్ కింద ఈ నెల 20న ఒక్కో రైతు కుటుంబానికి రూ.2 వేల చొప్పున విడుదల చేసే అవకాశం ఉందని రాష్ట్రానికి సమాచారం అందింది. అదేరోజు రాష్ట్రప్రభుత్వం కూడా రూ.5 వేల చొప్పున జమ చేయనుంది. అంటే తొలి విడతలో రైతులకు రూ.7వేలు అందుతాయి. నిధుల విడుదల తేదీలో కేంద్రం మార్పు చేస్తే రాష్ట్రం కూడా అందుకు అనుగుణంగానే ఇస్తుంది. రెండోవిడతగా అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు కేంద్రం రూ.2 వేలు మూడో విడతగా వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్రం రూ.4 వేలు, కేంద్రం రూ.2 వేలు కలిపి రూ.6 వేలు పంపిణీచేస్తాయి. కమతాల వారీగా చూస్తే రాష్ట్రంలో 93 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రజాప్రతినిధులు ఆదాయ పన్ను చెల్లించేవారు, వ్యవసాయేతర అవసరాలకు భూములను వినియోగించేవారు తదితర విభాగాల వారిని మినహాయించారు. మొత్తం 79 లక్షల మంది రైతులు అన్నదాతా సుఖీభవ పరిధిలోకి వస్తారని రైతు సేవాకేంద్రాల పరిశీలనలో తేలింది. కుటుంబ యూనిట్‌గా ఈపథకాన్ని అమలు చేయనున్నారు. ఆరెంచల వడపోత తరువాత 45.71 లక్షల కుటుంబాలను అన్నదాతా సుఖీభవకు అర్హులుగా తేల్చారు. ఈకేవైసీ పూర్తిచేసిన రైతుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ కానున్నాయి. అటవీ భూముల పట్టాలు పొందిన రైతులకు కూడా సాయం అందజేస్తారు. కౌలు రైతులకు కూడా అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. వీరికి కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. పంటకాలం మొదలయ్యాక వారిని గుర్తించి జాబితాలు తయారు చేస్తారు. తరువాత వారికి అన్నదాతా సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు చొప్పున ఇవ్వనుంది.

# అనుమతులు లేని ప్రాజెక్టుకు టెండర్లా..

## పోలవరం, బనకచర్ల.. విఫల ప్రయోగం

### పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం ఏది?: రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి



**విజయవాడ, జూన్ 7,ప్రభాతవార్త బ్యూరో:** సాగునీటి ప్రాజెక్టుల విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం స్వార్థ పూరితంగా వ్యవహరిస్తుం దని, కమిషన్ల కోసం టెండర్ల పేరుతో కక్కుర్తి విధానాలు అవలంభిస్తుందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్.ఎన్ తులసిరెడ్డి శనివారం మీడియా సమావేశంలో విరుచుకుపడ్డారు. శ్రీశైలం ప్లంజ్ పూల్ మరమ్మత్తులకు రు.300 కోట్లు విడుదల చేయని కారణంగా శ్రీశైలం డ్యాం ప్రమాదపు అంచుల్లో వుందన్నారు. రెండేళ్ల కాలపరిమితో రు 15,000 కోట్లు ఖర్చు పెడితే పెండింగ్ లో ఉన్న వెలిగొండ, తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీ నీవా, అన్నమయ్య, ఫించా, ఝురికోన లాంటి ప్రాజెక్టులన్నీ పూర్తి అయి రాష్ట్రం సస్య శ్యామలం మయ్యేదన్నారు.నిధులు లేమి ప్రాజెక్టులకు శాపంగా మారిందని, ఆ కారణంగా అనేకం పూర్తి కాలేదని, మరికొన్ని నత్తనడకన సాగుతున్నాయన్నారు. తాజాగా పోలవరం,బనకచర్ల ప్రాజెక్టు కోసం..రు 81900 కోట్లతో టెండర్లు పిలవాలని చంద్రబాబు ప్రభుత్వం తహతహ లాడడం విడ్డూరమన్నారు.

ఈప్రాజెక్టుల్లో10 లిఫ్టులు,3 టన్నెల్లు ఉంటాయని, ఒక్కో టన్నెల్ పొడవు38.01 కిలోమీటర్లుగాఉండి..వీటి పూర్తికి 4000 మెగా వాట్ల విద్యుత్ అవసరం ఉంటుందనే అంచనాలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

ఈ ప్రాజెక్టుల నిమిత్తం 47,900 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇందులో 17000 ఎకరాలు అటవీ భూమి మూడు దశల్లో చేపట్టేందుకు ప్రభుత్వం యోచిస్తుందన్నారు.

# సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్



**జగ్గయ్యపేట, జూన్ 7, ప్రభాతవార్త :** ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన మాజీమంత్రి, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురామ్ శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబానాయుడును మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వెలగపూడి సచివాలయంలో కలుసుకున్న రఘురామ్ తనకు ఈ విధంగా అవకాశం కల్పించినందుకు ధన్యవాదములు తెలుపుతూ పుష్పగుచ్ఛం, దుశ్వాలువతో చంద్రబాబును సత్కరించి తన విధేయతను ప్రదర్శించారు.

## విజయవాడ,పున్నమితోటలో తిరుచ్చి ఉత్సవం

విజయవాడ.జూన్ 7,ప్రభాతవార్తవిజయవాడ,పున్నమితోట లోని టిటిడి దేవస్థానంలో విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 15 సంవత్సరాలు పూర్తి అయ్యి 16వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊరేగింపు జరిపారు.కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మల్లికార్జునరావు, లలితా రమాదేవి,ఆలయ అర్చకులు మురళి, శశి,ఆనంద్,భక్తులు వేణు,విజయకుమార్,న్యాయవాదులు పడవల ఏడుకొండలు, ప్రసాద్, నారాయణరావు, లోకేశ్వరరావు,రాజు, సుశీల,శాంతి,తులసి,రాజశ్రీ,శివశ్రీలతో పాటు ఆలయ సిబ్బంది ఉన్నారు.

# విజయవాడ శాతవాహన కాలేజీ కబ్జాకోరులను అరెస్ట్ చేయాలి : సిపిఎం



విజయవాడ శాతవాహన కాలేజీ కూల్చివేతకు నిరసనగా ఆందోళన చేస్తున్న సిపిఎం

**విజయవాడ,జూన్7,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ శాతవాహన కాలేజీ కబ్జాకోరులను అరెస్ట్ చేయాలని, కాలేజీనీ ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని నడపాలని సిపిఎం డిమాండ్ చేసింది. విజయవాడలోని శాతవాహన కళాశాలను కూల్చివేసిన ఘటనకు నిరసనగా .. శనివారం సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన, ధర్నా కార్యక్రమం జరిగింది. మహిళలు, విద్యార్థులు, యువత ఈ ధర్నాలో పాల్గొని శాతవాహన కళాశాలను, భూములను కాపాడాలని పెద్ద ఎత్తున నినాదించారు. అర్ధరాత్రి సమయంలో బుల్డోజర్‌తో కళాశాలను కూల్చివేశారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్ళిన నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. లోపలికి ప్రవేశం లేదని వాదించారు. సిపిఎం నాయ కులకు, పోలీసులకు వాగ్వాదం, తోపులాట జరిగాయి. గేటు ఎక్కి, ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన బ్యానర్‌లు చింపివేసి ఆందోళన చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గేటు వద్దనే ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్ మాట్లాడుతూ.. అర్ధరాత్రి శాత వాహన కళాశాలను కూల్చివేయ డం దుర్మార్గమన్నారు. విజయ వాడలో గతంలో ఎన్నడూ బుల్డో జర్ సంస్కృతి లేదని చెప్పారు. కబ్జాలకు గురవుతున్న శాతవాహన కళాశాలను, భూములను ప్రభు త్వం రక్షించాలని డిమాండ్ చేశారు. కళాశాలను ప్రభుత్వమే స్వాధీనపరచుకుని ప్రభుత్వ కళాశాలగా నడపాలని కోరారు. రాష్ట్రం నడిబడ్డున ముఖ్యమంత్రితో సహా రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ కార్యా లయాలున్న విజయవాడ నగరంలో అర్ధరాత్రి బుల్డోజరులు వచ్చి కాలేజి భవనాలను కుప్ప కూల్చేయడం విజయవాడ చరిత్రలో ఏనాడు చూడలేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దాదాపుగా 55 యేళ్ళ చరిత్ర కలిగిన శాతవాహన కాలేజి, వేలాది మంది విద్యను అభ్యసించిన ఈ కాలేజిని ప్రభుత్వ అండతో కబ్జాదారులు కోర్టు తీర్పుల పేరుతో అడ్డగోలుగా కబ్జా చేస్తుంటే ప్రభుత్వం కళ్ళు మూసుకుని కూర్చుందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పెద్దల అండతోనే కబ్జాకోరులు ఈ విధంగా రెచ్చిపోయారని నిప్పులుచెరిగారు. 200 కోట్ల రూపాయల విలువైన ఈ కళాశాల ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని చెప్పారు. మొదట తెలుగుదేశం పార్టీ ఎం.ఎల్.సి రాజేంద్రప్రసాద్ మీద ఆరోపణ వచ్చిందని, ప్రభుత్వ యంత్రాంగం కళ్ళు మూసుకుని కూర్చుందని.. ఇప్పుడు మరొకరు అర్ధరాత్రి కాలేజిని కూల్చివేశారని అన్నారు. కళాశాలను కూల్చివేస్తే విద్యార్థుల భవిష్యత్ ఏమిటి ? అని ప్రశ్నించారు. ఇందులో పనిచేసే అధ్యాపకుల భవిష్యత్ ఏంటి ? అని అడిగారు. విజయవాడలో ఇకపై ఏ విద్యాసంస్థను, ఏ ప్రభుత్వ స్థలాన్ని కాపాడే పరిస్థితి ఈ ప్రభుత్వానికి లేకుండా పోయిందని.. వీరే కోర్టులలో కేసులు వేస్తున్నారు, వీరే ఫిర్యాదులు చేస్తున్నారు, అందరూ కుమ్మకైపోయారని అన్నారు. దీనిలో అధికార పార్టీ ఎం.ఎల్.సి భాగస్వామ్యులయ్యారనీ, తెరవెనుక ఎంతమంది ఉన్నారో తెలియదు అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ చీమచిటుక్కుమన్నా సోషల్ మీడియాలో స్పందిస్తారు అంటున్నారు.. ఇప్పటి వరకు ఎందుకు ఈ విషయమై స్పందించలేదు ఇక్కడికి ఎందుకు రాలేదు.. అర్ధరాత్రి పూట కాలేజి భవనాలు కూల్చివేయాలని సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చిందా ? అర్ధరాత్రి నుండి తెల్లవారే వరకు ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి, యంత్రాం గానికి కనపడటం లేదా ? కళ్ళు మూసుకుని ఉన్నారా ? అని ప్రశ్నించారు. ఈ కాలేజి మాత్రమే కాదు ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ కళాశాల భూములను కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు.

# రేపటి నుంచి పిజి సెట్ పరీక్షలు

### - రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలు
### - మీడియాతో విసి, సెట్ ఛైర్మన్ అప్పారావు

**తిరుపతి విద్య జూన్ 7 ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17 యూవర్సిటీలలో పలు పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఏపీ పీజీసెట్2025 పరీక్షలు సోమవారం నుం ప్రారంభం కానున్నట్లు వీసీ, పీజీసెట్ ఛైర్మన్ ప్రొఫెసర్ అప్పారావు తెలిపారు. శనివారం ఎస్వీయూలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఈ ఏడాది ఏపీ పీజీ సెట్ ను ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.పీజీ సెట్ 2025ను రాష్ట్ర వ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.31 సబ్జెక్టులలో పీజీ ప్రవేశాల కోసం జరగున్న ఈ సెట్లో 25,688మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.అత్యధికంగా 67శాతం మంది ఉత్తరాంధ్ర నుం ధరఖాస్తు చేసుకోవడం విశేషమన్నారు.దాదాపు గత ఏడాది కంటే 6వేల దరఖాస్తులు తగ్గాయన్నారు.ఈనెల 12వరకు జరగనున్న పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.కాగా డీఎస్సీ పరీక్ష నేపథ్యంలో 9వ తేదీన జరగనున్న ఫిజికల్ ఎడ్యుకేషన్ విద్యార్థులకు 10వతేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు తెలియజేశారు.పీజీసెట్ ఫలితాలను ఈనెల 25న విడుదల చేయనున్నట్లు తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం కన్నుమూత

### - సంతాపం తెలిపిన సిఎం చంద్రబాబు.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, హోం మినిస్టర్ అనిత - నేడు గాజువాకలో అంత్యక్రియలు



**గాజువాక, జూన్ 7, ప్రభాతవార్త** విశాఖ2 మాజీ ఎమ్మెల్యే, కార్మికనేత పల్లా సింహాచలం (93) అనారోగ్యంతో కన్నుమూశారు. ప్రస్తుత ఏపీ టీడీపీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి అయిన పల్లా సింహాచలం గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. టీడీపీలో విషాదఛాయలు.. పల్లాసింహాచలం మృతితో టీడీపీలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబం శోకసముద్రంలో మునిగింది. విషయం తెలుసుకున్న రాజకీయ నేతలు, అభిమానులు, సన్నిహితులు సంతాపం ప్రకటిస్తున్నారు. పల్లా సింహాచలం రాజకీయ ప్రస్థానం.. హిందూస్తాన్ షిప్యార్డ్ సంస్థలో కార్మికుడుగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ఆయన కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి పార్టీలో వివిధ హెదాల్లో పని చేసారు. 1983లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనససభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి స్వతంత్ర అభ్యర్థి వాసుదేవరావుపై స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు.

తరువాత తెలుగుదేశం పార్టీలో 1989లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో పెందుర్తి శాసనసభ నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి గుడివాడ గురునాథరావు చేతిలో 19,903 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పల్లా సింహాచలం 1994లో శాసనససభ ఎన్నికలలో విశాఖపట్నం 2 జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి వై మరియదాస్ పై 21,773 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 1999లో జరిగిన ఎన్నికలలో ఆయన పోటీ చేయలేదు, తిరిగి 2004లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనససభ ఎన్నికలలో విశాఖపట్నం2 శాసనసభ నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి సారిపల్లి రంగరాజు చేతిలో 51010 ఓట్ల తేడాతో ఓడిపోయారు. విశాఖ 2 ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన విశాఖ రాజకీయ చరిత్రలో ఒక సువర్ణధ్యాన్ని లిఖించారు. ప్రముఖ నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు. కార్మిక నేతగా ఎనలేని సేవలు.. గాజువాక హైస్కూల్ రోడ్డులో కుటుంబంతో నివాసముండే ఆయన హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో కార్మికుడుగా విధులు నిర్వహించడంతోపాటు కార్మిక నాయకులుగా సేవలను అందించారు.

ఆశ నిరాశల మధ్య ఖరీఫ్ (వానాకాలం సాగు) సీజను ప్రారంభమైంది. నైరుతి రుతుపవనాల ఆగమనంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఖరీఫ్ సీజనుపై రైతులు దృష్టిసారించారు. దేశంలోని మొత్తం వర్షపాతంలో రుతుపవనాలవాటా 80శాతం, ఖరీఫ్ పంటల విత్తనాలు మొదటి వర్షంపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. సహజంగా అనూహ్యత కారణంగా రుతుపవనాల రాక ఆలస్యం, తక్కువ వర్షం లేదా వరదలుకూడా సంభవించవచ్చు. అయితే దీనికి భిన్నంగాఈ సారి ముందస్తుగానే రుతుపవనాలు ప్రవేశించాయి. ఇక ప్రాంతాలు, పంట వారీగా ఖరీఫ్ సీజను వ్యవధి మారుతుంటుంది. ఈ సీజను జూన్‌లో ప్రారంభమై అక్టోబరు నెలతో ముగుస్తుండగా, దేశంలోని వివిధరాష్ట్రాల్లో రుతుపవనాల రాకను బట్టి పంటలను విత్తుతారు. మరోపక్క దేశానికి అన్నంపెట్టే రైతుల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయి. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రైతులను, వ్యవసాయాన్ని పావుగా ఉపయోగించుకుంటున్నాయి. ఒకచేత్తో రైతులకు ఇచ్చినట్లేఇచ్చి మరో చేత్తో తిరిగి వాటికంటే మించి లాగుకుంటున్నాయి. అతివృష్టి,అనావృష్టి,వరదలు వంటి పకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, పంటల బీమాను రాష్ట్రాలు అమలు చేయక పోవడం, కేంద్రం ప్రకటించే మద్దతుధరలు గిట్టుబాటు కాకపోవడం,రాష్ట్రాల్లో పంటల కొనుగోళ్లలో అక్రమాలు, దోపిడీ విధానాలు, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయక పోవడం, పెట్టుబడులకు తగినంత రుణాలను బ్యాంకులు మంజూరు చేయకపోవడం వంటి కారణాలతో రైతులు అప్పులఊబిలో కూరుకుపోతున్నారు. వాటిని తీర్చేపరిస్థితి లేకపోగా, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలుసైతం ఆదుకోకపోవడంతో గత్యంతరం లేక పలువురు రైతులు ముఖ్యంగా కౌలు రైతులు ఆత్మహత్యలను నమ్ముకుంటున్నారు. పంటల బీమా కేంద్రం అమలు చేస్తున్నా కొన్ని రాష్ట్రాలు వాటి అమలు చేస్తుండగా, తెలంగాణ, ఆంధ్రాలో ఏదీ అమలు కావడం లేదు.

# ఆశ నిరాశల్లో ఖరీఫ్

**సిహెచ్.వి.వి.రఘుబాబు**

ఎన్నో కష్టాలు, మరెన్నో నష్టాలు ఎదుర్కొంటున్న అన్నదాతలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుత వానాకాలం (ఖరీఫ్) సీజనులో తెలంగాణ వ్యాప్తంగా 1.34 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం 4 లక్షల ఎకరాలకుపైగా పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు కలిపి 10లక్షల ఎకరాల వరకు ఉండనుంది. అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరిని సాగు 60నుంచి 70 శాతానికి పైగా ఉండొచ్చని అంచనా. పత్తి 50లక్షల ఎకరాలతో రెండో స్థానం ఉండనుంది. ఈ వానాకాలంలో 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని పేర్కొంది. ఇందులో ఇప్పటికే 75లక్షల ఎకరాలకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచింది. 45 వేల క్వింటాళ్ల పత్తి విత్తనాలకు ప్రయివేటు కంపెనీలు 1.34లక్షల క్వింటాళ్ల బిటీ విత్తనాలను సిద్ధంగా ఉంచాయి. మొక్కజొన్న ఆరులక్షల ఎకరాలకు 48వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయనితేల్చింది. ఇవి కాకుండా కందులు, పెసలు, మినుములు, జొన్నలు, వేరుశనగ, ఆముదం, నువ్వులు తదితర పంటల విత్తన ప్రణాళికను సిద్ధం చేసింది. ఆంధ్రాలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 77.87 లక్షల ఎకరాలు కాగా, ఈ సీజనులో 86.47 లక్షల ఎకరాల్లో సాగుచేయాలని వ్యవసాయ శాఖ నిర్దేశించింది. ఇందులో 38.87 లక్షల ఎకరాల్లో వరి, 14.30 లక్షల ఎకరాల్లో వేరుశెనగ, 14.10 లక్షల ఎకరాల్లో పత్తి, 9.35లక్షల ఎకరాల్లోనఅపరాలు సాగు చేయనుంది. ఇందుకుగాను 6.32 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని లెక్కకట్టింది. ఇక రెండు రాష్ట్రాల్లోనూ సాగు వ్యయం ఏటికేడాది పెరుగుతోంది. గత ప్రభుత్వం పీఎం కిసాన్ యోజన, రైతు బంధు వంటి వాటిని అమలు చేస్తూ పెట్టుబడి నిమిత్తం రైతులకు కేంద్రం, తెలంగాణ రాష్ట్రం ఆర్థిక సాయం చేస్తున్నాయి. అయినా ఇవన్నీ ఏమూలకీ సరిపోవడం లేదు. ప్రస్తుత ఏపి సర్కార్ గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్సార్ రైతు నేస్తం తదితర పథకాల కన్నా అదనంగా ఇస్తామని ఎన్నికల్లో ప్రకటించినా, ఇంత వరకూ వేటినీ అమలు చేయలేదు. కాగా రెండు రాష్ట్రాల్లో ఏటా సాగు వ్యయం పెరుగుతోంది. సగటున మూడేళ్లలో 40 శాతంమేర సాగు వ్యయం పెరిగింది. మద్దతు ధర మాత్రం 13.50 శాతం లోపే పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. అలాగే వ్యవసాయ పరికరాల ధరలు 20 నుండి 100 శాతం పెరగడంతో సాగు చేయడం అన్నదాతలకు భారంగా



పరిణమించింది. సాగులో కూలీల కొరత కూడా పెద్ద సమస్యగా తయారవుతోంది. దీంతో సాగుకు యంత్రాల వినియోగం పెరుగుతుండటంతో కిరాయి రేట్లను భారీగా పెంచేస్తున్నారు. బోర్ల మీద ఆధారపడి సాగు చేస్తున్నా భూగర్భజలాలు పడిపోవడంతో సాగునీరు పూర్తిస్థాయిలో అందే పరిస్థితి మెట్ట ప్రాంతంలో లేదు. సాగుకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని రెండు రాష్ట్రాలు చెబుతున్నా, అనాధికారిక కోతలు పెడుతున్నాయి. ఇక కేంద్రం ప్రకటిస్తున్న మద్దతు ధరలతో పెట్టుబడి కూడా రానిదుస్థితి నెలకొంది. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా, మద్దతు ధరలు మాత్రం ఆమేరకు పెరగడం లేదు. కేంద్ర ధరల నిర్ణయక కమిటీ తక్కువ పెట్టుబడి అయ్యే రాష్ట్రాలను పరిగణలోకి తీసుకుని మొక్కుబడిగా మద్దతు ధరలను పెంచుతోంది. ఇది గిట్టుబాటుకాని నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు దానికి అదనంగా మరికొంత మొత్తాన్ని ప్రకటిస్తున్నాయి. ఇలా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు మద్దతు ధరలకు అదనంగా క్వింటాకు రూ.300 నుండి రూ.400 వరకూభరిస్తూ రైతులకు నష్టం లేకుండా సహాయం చేస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రాలో అలాంటి అదనపు ఆర్థిక సాయాన్ని మాత్రం చేయడం లేదు. అయితే తెలంగాణలో ఒక్క సన్న రకం ధాన్యానికి మాత్రమే క్వింటాకు రూ. 500 మేర ప్రోత్సాహకంఇస్తోంది. మరోపక్క పెట్టుబడులకు సరిపడా బ్యాంకులు రుణాలుగా ఇవ్వడం లేదు. స్కేల్ ఆఫ్‌ఫైనాన్స్ నిబంధనను అడ్డం పెట్టుకుని రుణాల్లో భారీకోతపెడుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కేవలం 50 శాతం మంది రైతులకే బ్యాంకులు అరకొరకగా రుణ సౌకర్యాన్ని కల్పిస్తుండగా, మిగిలిన 50 శాతం మంది రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. 20నుండి 35శాతం చొప్పున అధిక వడ్డీలకు రైతులకు ప్రైవేటు వ్యాపారులే దిక్కవుతున్నారు. దీంతో పంటలు దెబ్బతిన్న రైతులు అధిక వడ్డీలతో పెరిగి పోయిన ప్రైవేటు అప్పులను తీర్చలేకపోతున్నారు. దీనికి తగిన ట్లుగా పంటల భీమా పథకం అమలు చేయకపోవడం రైతుల పాలిట శాపంగా పరిణమించింది. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల్లో నష్టపోయిన పంటలకు బీమాపరిహారం రైతులకు అందడం లేదు. కోర్టుల జోక్యంతో రెండు ప్రభుత్వాలు రైతులు ఆత్మహత్యలు చేసుకునేందుకు కారణాలు, వాటికి పరిష్కార మార్గాలను సేకరించినా అవి మూలపడ్డాయి. రైతుల ఆత్మహత్యలు గుర్తించే విధానాన్ని సులభతరం చేసేలా మార్గదర్శకాలను రూపొందించడంతోపాటు, బాధిత కుటుంబాలకు సహాయ చర్యల నిమిత్తం ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంలో కచ్చితమైన కాలపరిమితి విధిస్తూ 421, 173 జివోలను సవరిస్తేనే రైతులకు ఆదాయ భద్రత కలుగుతుంది. సకాలంలో తగినంత రుణ సౌకర్యం కల్పించి, కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నివారించి లాభసాటి ధరకు ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లయితే రైతులకు మేలు జరుగుతుంది. విస్తరణ వ్యవస్థను ఏర్పాటు చేసి,ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట పరిహారం, బీమా సౌకర్యం విధిగా అందించాల్సి ఉంది. వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించడం తప్పనిసరి చేయాలి. వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంపుతోపాటు, వాటి ఖర్చులు పారదర్శకంగా, జవాబుదారితనంతో ఉండాల్సిన అవసరం ఉంది. ప్రతీ గ్రామంలోనూ విస్తరణ వ్యవస్థను పటిష్టం చేయడం, మెట్ట ప్రాంతాలకు అవసరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సి ఉంది. ఆరుతడి పంటల దిగుబడులను పెంచడం, ఉత్పత్తి ఖర్చులు తగ్గించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకు రుణాల నుంచి బీమా పథకాలను వేరు చేసి, బీమాను అన్ని పంట లకు విస్తరింప చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. సన్న, చిన్నకారు, పేద రైతుల బీమా ప్రీమియంను ప్రభుత్వాలే చెల్లించాలి. కౌలు రైతులతో సహా సాగుదారులందరికీ రుణ సౌకర్యాన్ని ఒక హక్కుగా కల్పించాలి. అలాగే రుణ మాఫీని ఒకే దఫా అమలు చేసి, కొత్త రుణాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. విత్తన విధానాన్ని, నియంత్రణ వ్యస్థను, సదుపాయాలను కల్పించేలా చట్టాలు తేవాలి. వ్యవసాయ విధానాన్ని ప్రకటించడం ద్వారా మేలు జరిగేందుకు రెండు ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా కరవు మాన్యువల్‌లో సమగ్ర మార్పులు చేసే దిశగా ప్రభుత్వాలు సిద్ధం కావాలి. కరవు మండలాలను నిర్ధారించేందుకు ప్రక్రియను పునర్నిర్వహించి, వ్యవసాయేతర అవసరాలకు వ్యవసాయ భూములను మార్చకుండా ఆపాల్సి ఉంది. రెండు రాష్ట్రాల స్థాయిల్లో రైతు కమిషన్లు, మిషన్ రైతు మిత్రలను ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతుల జీవితాల్లో వెలుగు నింపినట్లవుతుంది. ●

---


కర్ణాటక

ఎవరి పనులతో వారు ఉరుకులు పరుగుల మీద తిరుగుతూ అది 'మరో ప్రపంచం' అనిపించే బెంగళూరు మహా నగరం గత బుధవారం (4,జూన్ ) ఒక్కసారిగా కన్నీటి ధారల్లో కుమిలిపోయింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు (ఆర్సీబి) పద్దెనిమిదేళ్ల కల ఫలించి ఐపిఎల్ టైటిల్ గెలుచుకు వచ్చిందనే సంతోషం, విజయోత్సాహం కొన్ని గంటలలోనే అందరిలో ఆవిరైపోయింది. విజయోత్సవం విషాదాంతమై క్రికెట్ అభిమానులకే గాక దేశ ప్రజలందరికి కూడా ఒక పీడకలగా మిగిలిపోయింది. మంగళవారం ఆర్సీబి జట్టు ఐపిఎల్ విజేతగా నిలిచిన తర్వాత ఆ రాత్రి చాలా పొద్దుపోయేవరకు అహ్మదాబాద్‌లో వేడుకల్లో మునిగి తేలింది. అనంతరం బుధవారం ప్రత్యేక విమానంలో బెంగళూరు వచ్చింది. రాగానే నేరుగా విధానసౌధ (అసెంబ్లీ) వద్ద ప్రభుత్వ పెద్దలందరి సమక్షంలో అతి వైభవంగా సన్మాన కార్యక్రమం. గవర్నర్ తవర్ చంద్ గెహ్లాట్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ సహాఅతిరథ, మహా రథులందరు కోహ్లీ బృందాన్ని'నభూతో నభవిష్యతి' అన్న చందంగా సన్మానించేందుకు సిద్ధమయ్యారు. అక్కడ పూర్తయిన తర్వాత చిన్న స్వామి స్టేడియంలో జట్టు అభినందన వేడుక జరపడానికి కర్ణాటక క్రికెట్ సమాఖ్య సన్నాహాలు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ సంరంభం మొదలైన కొద్ది సేపటికే క్రికెట్ అభిమానుల ప్రాణాలు గాలిలో కలిసే సరికి ఆ ప్రాంతంలో ఎటుచూసినా హాహాకారాలే వినిపించాయి. కొద్ది సేపటిలోనే అద్భుతమైన వేడుక అనంత విషాదంలోకి జారిపోయింది. దీనికి బాధ్యులెవరు? 11మంది ప్రాణాలు హరించడానికి కారణమైన అసలు దోషులెవరు? అన్నదే చిక్కుముడి వీడని ప్రశ్న. 'నీది తప్పంటే నీది తప్ప'ని ఆరోపణలు చేసుకోవడం మామూలే. ఘటన అత్యంత విషాదకరమైనది కనుక, ప్రభుత్వం నేరుగా పాల్గొన్న వేడుక అనంతరంజరిగిన ఘటనలు గనుక చాలా వేగంగానే అంతా కదిలారు. కొందరు పోలీసు ఉన్నతాధికారులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారు. ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు. బాధితులకు భారీగానే పరిహారాన్ని ప్రకటించారు. అన్నీ

# విజయ 'విలాపం'!

**ఎ.వి.వి ప్రసాద్**

వెంట వెంటనే జరిగిపోయాయి కూడా. కానీతమ కన్నబిడ్డలను కోల్పోయి విషాద సాగరంలో మునిగిపోయిన ఆ కుటుంబాలకు అవి ఎంత ఊరటనివ్వగలుగుతాయి? విజయ గర్వంతో వచ్చిన తమ 'హీరో'లను చూడాలనే తపనతో వేలుకాదు.. లక్షల మంది అభిమానులు ఆరోజు చిన్నస్వామి స్టేడియం వద్దకు ఒక ప్రవాహంలా తరలి వచ్చారు. నిజానికి అది చాలా చిన్న స్టేడియం. కోహ్లీ జట్టు విజయ బావుటా ఎగుర వేస్తుంటే అభిమానులు ఎలా ఉరుకుతారో అంచనా వేయ లేని విషయం కాదు. 35 వేలసామర్థ్యం ఉన్న స్టేడియం వైపు నాలుగైదు లక్షల మంది క్రికెట్ అభిమానులు దూసుకొచ్చారు. వారిని నిలువరించడం పోలీసులకు ఎంతమాత్రం సాధ్యం కాలేదన్న విషయం కూడా ఒప్పుకోవలసిందే. పోలీసులే కాదు, ఆ ఉత్తుంగ తరంగానికి ఎవరూ అడ్డుకట్ట వేయలేరు. వేస్తే అదిమరిన్ని అవాంఛనీయ పరిస్థితులను సృష్టించవచ్చు. గేట్లు మూసివేస్తే వాటిని పగులగొట్టి లోపలికి దూకారు. విధానసౌధకు అతి సమీపంలో, ఒకటిన్నర కి.మీ దూరంలోనే చిన్నస్వామి స్టేడియం ఉంది. విధానసౌధ వద్ద తొలుత జరిగిన సన్మాన కార్యక్రమానికి వివిఐపిలు పెద్దసంఖ్యలో రావడంతో దానికి తగిన పటిష్టమైన బందోబస్తు బాగానే ఏర్పాటు చేశారు. అందువల్ల అక్కడికి చేరుకోలేకపోయినవారందరు కూడా స్టేడియం వైపుపరుగులు పెట్టారు. మర్నాడే ఈ వేడుకలు వద్దనీ, పైగా రెండూ ఒకేసారి వద్దనీ పోలీసు యంత్రాంగం గట్టిగానే చెప్పిందట. కానీ 'పెద్దలు' వినాలి కదా! ఒకరికొకరు పోటీలు పడి కోహ్లీ జట్టును సన్మానించారు. అక్కడ ఈ వేడుకలు జరుగుతూండగానే



తొక్కిసలాట

స్టేడియం వద్ద తొక్కిసలాట మొదలైందనే వార్తలు వినవచ్చాయి. 'తొక్కిసలాటలు మామూలే. మీరు కానివ్వండంటూ ఓ పెద్ద రామయ్య సన్మానాలు ఆపొద్దన్నారనే వార్తలు కూడా వినిపించాయి. కొద్ది సేపటిలోనే స్టేడియంవద్ద తొక్కిసలాట ఉధృతం కావడంతో వరుసగా 11మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరో 50 మంది పైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిపరిస్థితికూడా ఆసుపత్రుల్లో ఆందోళనకరంగానే ఉంది. కనీసం రెండు వేడుకలు ఒక విశాలమైన ప్రదేశంలో ఒకేసారి జరిపినా ఇంతటి విషాదం ఏర్పడక పోయి ఉండేదనిపిస్తుంది. పోలీసు కమిషనర్ దయానంద్, మరి కొందరు అధికారులను సస్పెండ్ చేయడం, కొందరు ఉన్నతాధికారులపై వేటు వేయడం కంటితుడుపు చర్య అనేచెప్పాలి. స్టేడియం వద్ద తొక్కిసలాట జరుగుతోందనే సమాచారం తెలిసినా విధానసౌధ వద్ద సన్మానాలు కొనసాగించడమే ఆశ్చర్యం కలిగించేవిషయం. ఆ ఆలోచన ఎవరిదైనా కావచ్చు.. కొన్నిప్రాణాలు గాలిలో కలిసిపోయాయి కదా! అతిపెద్దవిజయం సాధించి కోహ్లీ బృందం వస్తే వారికి అభిమానులు ఎలా బ్రహ్మరథం పడతారో అంచనా వేయలేక పోవడం, వేసినా నిర్లక్ష్యంతో వ్యవహరించడం అధికారులవైపు నుంచి కనిపించే వైఫల్యమే. పోలీసులు, ఇంటెలిజెన్స్ హెచ్చరికలను రాజకీయ నాయకులు ఖాతరు చేయకపోవడం మరింత పెద్దవైఫల్యం. ముఖ్యంగా ఆర్సీబీనిర్వాహకులు ఎంతో మెలకువతో వ్యవహరించవలసిన సందర్భంలో వారి వైఫల్యం కూడా స్పష్టంగానే కనిపిస్తోంది. పది లక్షల పరిహారం పోయిన ప్రాణాన్ని తేలేదు కదా! ఏం జరిగినా ఎంతో కొంత పరిహారం చెల్లిస్తే చాలనే ఉదాసీన వైఖరి ఇలా ముదిరిపోతే అది ఎన్ని దురదృష్టకర ఘటనలకైనా దారితీస్తుందనిపిస్తుంది. 30 రోజుల్లో న్యాయ విచారణ ఏం తేల్చినా, మరో తొక్కిసలాట ఘటన జరగకూడదనుకొంటే ప్రధానంగా రాజకీయ నాయకుల వైఖరిలో మార్పు రావాలి. వేడుక ముఖ్యమే. ప్రజల ప్రాణాలు అంతకంటే ముఖ్యం కదా! ●

---

అమెరికా

ఒకప్పుడు అత్యంత ఆప్తమిత్రుడని పొగిడారు. ఆయన్ను ప్రభుత్వ సంస్థల్లో సామర్థ్యం పెంచేందుకుని కొత్త విభాగం సృష్టించి ఆ విభాగానికి ఛీఫ్‌ను చేసారు. రానురాను మిత్రబంధానికి బీటలు వారాయి. ట్రంప్‌కు నచ్చని ఏవిషయం అయినాసరే అంతు చూసేంతవరకూ వదలరన్నది తెలిసిందే. అదే విధంగా ఆయన అనుంగుమిత్రుడు టెస్లా, స్పేస్ ఎక్స్, స్టార్‌లింక్ అధినేత ఎలాన్‌మస్క్ కూడా అదే విధమైన వైఖరితో ఉంటారు. రిపబ్లికన్స్ తెచ్చిన ట్యాక్స్ విధానంతో ఇద్దరిమధ్య మైత్రీబంధం బీటలు వారింది. ఇప్పుడు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతున్నారు. మస్క్ పేరుచెపితేనే ట్రంప్ అసహనంతో ఉన్నారు. అతని గురించి ఆలోచించడం మానేసానని, అతడి మెదడు పనిచేయడం మానేసిందంటూ వ్యంగ్యోక్తులు సైతం విసురుగుతున్నారు. ఈపరిణామాల నేపథ్యంలో మస్క్ ఏకంగా ట్రంప్‌కు వ్యతిరేకంగా కొత్తపార్టీనే ఏర్పాటు చేసేందుకు ఉద్యుక్తులవుతున్నారు. అదే 'ది అమెరికా పార్టీ'. కేవలం అమెరికన్ల వారి భావాలతో నిండిఉన్న పార్టీని ఏర్పాటు చేసేందుకు శ్రమిస్తున్నాడంటే అమెరికా అధ్యక్షుడికి ఆయనకు ఎంతమేర అగాథం పెరిగిందో తెలుస్తోంది. తిరుగులేని వ్యాపారసామ్రాజ్యంతో ప్రపంచంలోనే నంబర్‌వన్ బిలియనీర్‌గా ఎదిగిన మస్క్ తనకు ప్రత్యర్థులు లేకుండా చేసుకోవడంలో ట్రంప్‌కంటే అందవేసినచేయి. తన సోషల్ మీడియా హ్యాండిల్‌ను బ్లాక్‌చేసారన్న కక్షతో ఏకంగా 'ట్విట్టర్' సంస్థనే కొనుగోలుచేసి తన పంతం నెగ్గించుకున్న బిలియనీర్ మస్క్అలాంటి టెస్లా ఎలాన్ మస్క్‌పేరు ప్రపంచంలో తెలియని వారు లేరు. గత అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌నకు వెన్నుదన్నుగా నిలిచి ఆయన గెలుపునకు అవిరళ కృషిచేసారు. సుమారు 30 కోట్ల డాలర్లు ట్రంప్ విజయం కోసమే ఖర్చుచేసారంటే డెమొక్రాట్లపై ఆయనకున్న వ్యతిరేకత ఏపాటితో తెలుస్తుంది. తీరా అధ్యక్షుడయ్యాక కూడా మస్క్ నాకు మంచి మిత్రుడని పొగుడుతూ వచ్చిన ట్రంప్ ఒక్కసారిగా విభేదిస్తూ వచ్చారు. ప్రభుత్వ వ్యయయ నియంత్రణకోసం కొత్తగా అమలుకు తెస్తున్న రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లు ఇద్దరి మైత్రికి బ్రేకులువేసింది. ఈబిల్లును మస్క్ తీవ్రంగావ్యతిరేకించారు. అప్పటివరకూ డోజ్‌లో వృధా

# మైత్రీ బంధానికి బ్రేక్

**గన్ని మోహన్**

విభాగాలన్నింటినీ మూసివేయాలన్న ప్రతిపాదనలు తెచ్చి దుబారాను తగ్గిస్తామని ప్రకటించిన మస్క్ ఈ ట్యాక్స్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా కూడా వెనక్కి తగ్గలేదు. మస్క్ వ్యతిరేకతను ట్రంప్ లెక్కచేయలేదు. ఎలాన్ సంస్థలకు ప్రభుత్వరాయితీలు, కాంట్రాక్టులను కూడా రద్దుచేస్తామని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో ప్రకటించారు. మస్క్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆయన మానుంచి చాలా సబ్సిడీలుపొందారు. పెద్దమొత్తంలో సొమ్ములు అందుకున్నారు. వీటిని పరిశీలించాలి. పారదర్శకంగానే జరిగిందా అన్నదితేలాలి. మస్క్ లేనంతమాత్రాన మాకేమీ నష్టం ఉండదు. ఎవరులేకపోయినా అమెరికాకుఎలాంటి నష్టం ఉండదు. ఒక్క నేను తప్ప ఎవ్వరుపోయినా ఎలాంటి నష్టం లేదంటూ ట్రంప్ మస్క్‌పై తనకున్న అక్కసు వెళ్లగక్కారు. దీనితో మస్క్ కోపం నషాళానికి అంటింది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్‌స్పేస్‌క్రాఫ్ట్ సేవలు నిలిపివేస్తామని ప్రకటించారు. అక్కడితే ఆగలేదు తన సొంత సోషల్‌మీడియా 'ఎక్స్'లో ట్రంప్‌పై ఆరోపణలతో ధ్వజమెత్తారు. చిన్నపిల్లలపై లైంగిక దాడులకేసులో నిందితుడయిన జెఫ్రీ ఎప్‌స్టీన్ వద్ద ఉన్న ప్రముఖుల జాబితాలోట్రంప్ పేరు కూడా ఉందని ఆరోపించారు. అయితే జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు విచారణకు రాకుండానే జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు. తన మద్దతు లేకుంటే అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్, రిపబ్లికన్‌పార్టీ రెండూ ఓడిపోయేవని మస్క్ ప్రకటించారు. ప్రతినిధుల సభలో డెమొక్రాట్లే పట్టు సాధించేవారని, సెనేట్‌లో రిపబ్లికన్లు 51-49 నిష్పత్తిలోనే ఉండేవారని ట్రంప్‌నకు గుర్తుచేసారు. మరో అడుగు ముందుకేసి అమెరికా అధ్యక్షుడిని అభిశంసించాలని



ఎలాన్ మస్క్

కూడా పిలుపునిచ్చారు. ఇద్దరిమధ్య ఇంతటి తీవ్ర స్థాయి అగాథాన్ని పెంచిన 'బ్యూటిఫుల్ బిల్' (వ్యయ నియంత్రణబిల్లు)అమలుచేసి తీరుతానని ట్రంప్ చెపుతుంటే మస్క్ మాత్రం తీవ్రంగావ్యతిరేకించారు. దీనివల్ల పన్నులభారం పెరుగుతుందని, ద్రవ్యోల్బణం కూడా పెరుగుతుందని, ఈ బిల్లుకు ఎవ్వరూ మద్దతు పలకవద్దని, మద్దతిస్తే అమెరికాను మరోసారి సంక్షోభంలోకి నెట్టివేసినట్లే అని తన ఎక్స్‌మీడియాలో పిలుపునిచ్చారు. అందువల్లనే డోజ్‌నుంచి వైదొలిగారు. ఇతర దేశాల్లో తన వ్యాపార సామ్రాజ్యం విస్తరించే వ్యూహాల్లో ఉన్నారు. రాయితీలు, కాంట్రాక్టులు రద్దుచేస్తామని ప్రకటించిన వెంటనే టెస్లా షేర్లు దారుణంగా పడిపోయాయి. సుమారు200 బిలియన్ డాలర్లవరకూ టెస్లాషేర్లు ఆవిరి అయ్యాయంటే ట్రంప్ మస్క్‌ల మధ్య అంతరాలు ఎంత పెరిగాయో తెలుస్తోంది. అందుకే చైనా, ఇతర యూరోప్ దేశాల్లో తనవ్యాపార విస్తరణపైఫోకస్ పెంచిన ఈ ఆప్తమిత్రుడు భవిష్యత్తులో కొత్తపార్టీ అంటూ పెడితే అటు డెమొక్రాట్లు,ఇటురిపబ్లికన్లు ఇద్దరికీ ఎంతో కొంత నష్టం తప్పదనే చెప్పాలి. తాను సోషల్ మీడియాలోచేసిన ప్రతిపాదనకే 80శాతం మంది అమెరికన్లు మద్దతు ఇచ్చారని, 80శాతం అమెరికన్లు కూడా తనకు మద్దతుపలికారంటూ సంచలన వ్యాఖ్యలుచేసారు. ఇద్దరిమధ్య భారీస్థాయిలో విభేదాలు రావడానికి డోజ్ వ్యవస్థ కీలకం కాగా తాజాగా తెచ్చిన వ్యయనియంత్రణ బిల్లుకూడా అనిచెప్పొచ్చు. మొత్తంగా చూస్తుంటే ట్రంప్ పదవీకాలం మొత్తం మస్క్ వేసే ఎత్తుగడలను ఎదుర్కొనేందుకు కొంత నిర్దిష్ట సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఇప్పటికే ట్రంప్ విధి విధానాలపై ప్రపంచదేశాల నుంచి తీవ్రనిరసన వ్యక్తం అవుతున్న క్రమంలో ప్రధాన మిత్రుడు వేరు కుంపటికి సిద్ధపడితే రానున్న కాలంలో ట్రంప్‌కే కాదు రిపబ్లికన్లకుసైతం భారీ స్థాయిలో నష్టం కలుగుతుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పుడు ప్రత్యర్థిగా మారుతున్నమస్క్‌వేసే ప్రణాళికలపైనే ట్రంప్ ఎక్కువ ఫోకస్ పెంచుతున్నారనడంలో ఎలాంటి సందేహంలేదు. ●

---

# జీవ కోటికి సముద్ర జలమే జీవనాధారం

**నేదునూరి కనకయ్య**

మానవుడు నివసించే భూగ్రహంపై 29 శాతం మాత్రమే భూమి ఉన్నది.71 శాతం సముద్రము నీరు వుంది. మిగిలినదంతా సముద్రపు నీటి ద్వారా ఆవరించబడి ఉంది. ఈ గ్రహంలో జీవులన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా సముద్రాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. కడలిని కాపాడుకోవడం అందరి బాధ్యత. జీవరాశికి రక్షణ ఆహార పంటలు పారిశ్రామిక అభివృద్ధికి అవసరమవు జలవనరులను సమకూర్చే సముద్రాలు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించి కడలిలో పడేస్తున్నారు. మనుషుల స్వార్థం పారిశ్రామిక వ్యర్థపదార్థాలు సముద్రంలో కలవడం వల్ల సముద్రం నీరు కాలుష్యమై సముద్రంలో ఉన్న జీవులు అంతరించిపోతున్నాయి. సాగర జలం బాగుంటేనే సకల జీవరాశులు బాగుంటాయన్న విషయాన్ని ప్రభుత్వాలు ప్రజలు విస్మరించడంపట్ల పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్రాలకు ఉన్న ప్రాముఖ్యత గుర్తించి మానవ వనరుల వికాసంలో సముద్ర వనరుల పాత్ర గురించి ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించడానికి ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూన్ 8న ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ప్లాస్టిక్‌వ్యర్థాలు 'డ్రైనేజీ' చెత్త పారిశ్రామిక వ్యర్థ పదార్థాలు సముద్రాలలో విచ్చల విడిగా పడేస్తున్నారు. అనేక దేశాలు పారిశ్రామిక వ్యర్థాలను నౌకలలో తరలించి సముద్రాల్లో పడేస్తున్నారు. వేల కొద్ది టన్నుల చెత్త సముద్ర గర్భంలో కలిసిపోయి కాలుష్య కారకాలు పెరిగిపోతున్నాయి.సముద్రాలలో పడేసిన ప్లాస్టిక్ భూమిలో కరగక ఈప్లాస్టిక్ కాలుష్యకారకంగా తయారై సముద్రంలో ఉన్న చేపలు ఇతర జీవరాసులు అంతరిస్తున్నాయి. నీటి కాలుష్యం వల్ల జీవజాతులు అంతరించిపోవడం వల్ల జీవావరణం పర్యావరణం దెబ్బతింటుంది. సముద్రాలను రక్షించే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు ఉదాసీనతను నిర్లక్ష్యాన్ని వహిస్తున్నాయి. ప్రభుత్వాల చర్యలు తుతు మంత్రంగా వుండడం గమనార్హం. సముద్ర రక్షణ దినోత్సవం రోజు ప్రభుత్వాలు సముద్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ సముద్ర దినోత్సవం పురస్కరించుకొని ఐక్యరాజ్యసమితి 45దేశాలకు చెందిన ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తుంది. బ్రెజిల్‌లోని రియో డిజనిరో నగరంలో 1992 ఐక్యరాజ్యసమితి సముద్రాలపై అవగాహన పెంచడానికి సదస్సును నిర్వహించింది. 2008లో తొలిసారిగా ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని నిర్వహించింది. 2025 ప్రపంచ సముద్ర దినోత్సవం థీమ్ 'మనసముద్రం మన బాధ్యత' మన అవకాశం. ఈఏడాది అంతర్జాతీయ సముద్ర దినోత్సవం థీమ్‌గా ఎంపిక చేశారు. ఇది 2025 సెప్టెంబర్ 25న జరిగే ప్రపంచ సముద్ర దినోత్సవ వేడుకలతో ముగుస్తుంది. ప్రభుత్వాలు పౌర సమాజం సముద్ర జలాల రక్షణను విస్మరిస్తునాయి.సముద్రపు నీరు కలుషితానికి గురిఅవుతుంది. చాలా దేశాల్లో వ్యర్థాలను సముద్రంలో కలుపుతున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో సముద్రం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచ వాణిజ్యంలో 80 శాతం సముద్రం ద్వారా రవాణా జరుగుతుంది. పర్యావరణానికి అతి తక్కువ హాని కలిగించే రవాణా విధానం సముద్రాలపై జరిగే షిప్పింగ్ గుర్తింపు పొందడం గమనార్హం.ప్రపంచంలోనే రోజువారి రొట్టె తయారు చేయడానికి అవసరమైన ధాన్యాన్ని ఓడ ద్వారా మాత్రమే రవాణా చేయగలం. షిప్పింగ్ సముద్ర అంతరిక్షంలో పనిచేస్తున్న అతి పెద్ద రంగం సముద్ర పర్యావరణ పరిరక్షణకు షిప్పింగ్ ఉపయోగపడుతుంది. సముద్ర వనరుల నిర్వహణలో షిప్పింగ్ కీలక పాత్ర వహిస్తుంది.లక్షలాదిమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సముద్రాలు గొప్ప ఆహారవనరు. సముద్రం అనేక జాతులకు నిలియంగా వెలిసింది. వాతావరణాన్ని నియంత్రిస్తుంది. ఉష్ణోగ్రతలను భూతాపాన్ని నియంత్రించే శక్తి సముద్రాలకు ఉన్నాయి. బీచ్‌లో వంటి నీటి వనరుల చుట్టు మన అజాగ్రత్త వల్ల కాలుష్యం పెరిగిపోతుంది. దీంతో సముద్రంలోని అనేక వేలజీవరాశులు మరణిస్తున్నాయి. ప్రకృతి విపత్తులు జరిగే అవకాశంఉంది. ప్రజలకు ఈ



విషయాలపై అవగాహన కల్పిస్తారు. సముద్రాల సుస్థిర అభివృద్ధి ద్వారానే ఆర్థిక వ్యవస్థలో సుస్థిరాభివృద్ధి సాధనకు కృషి చేసే విధంగా సదస్సులు చర్చలు సమావేశాలు ర్యాలీలు నిర్వహిస్తారు.సముద్రం కనీసం 50శాతంఆక్సిజన్ ఉత్పత్తి చేస్తుందని ఐక్యరాజ్యసమితి డాటా తెలుపుతుంది. మహా సముద్రాలు 30శాతంకంటే ఎక్కువ కార్బన్డయాక్సైడ్‌ను గ్రహిస్తాయని,ఇవి గ్లోబల్ వార్మింగ్ ప్రభావం తగ్గిస్థాయిని రుజువు చేసింది. చెత్త 'మురుగు' 'చమురు' లీకేజీ అవకాశం ఉంది. ఈవిషయాలపట్ల ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలి. ముందు జాగ్రత్తలు తీసుకునేట్లు చైతన్య పరచడం ప్రభుత్వాల బాధ్యత. సముద్రాలు ప్రపంచంలో కోట్లాది మందికి జీవనోపాధిని పౌష్టికాహారం అందిస్తూ జీవరాశుల మనుగడకు దోహద పడుతున్నాయి. ప్రపంచ పటంలో 3వంతులకు పైగా సముద్రాలు విస్తరించి ఉన్నాయి. అయినప్పటికీ కాలక్రమేణా అవి కాలుష్యంబారిన పడుతున్నాయి. మానవుడు సముద్ర జలాలను కలుషితం చేస్తూ సముద్ర జీవుల మనుగడకు ముప్పు ఏర్పడే విధంగా వ్యవహరిస్తున్నాడు.సామాజిక ఆర్థికవేత్తల ఆందోళన. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుంది. ప్లాస్టిక్ సంచులు ఇతర వస్తువులు పర్యావరణానికి హాని చేస్తున్నాయని అందరికీ తెలిసినా వాటి వినియోగాన్ని నియంత్రించడానికి సమగ్రమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోకపోవడం పౌరుల్లో ప్లాస్టిక్ వల్ల వచ్చే ప్రమాదాల గురించి అవగాహన లేకపోవడం ప్లాస్టిక్ వినియోగంలో ప్రపంచ మానవాళితాను కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుకునట్టుగా వ్యవహరిస్తున్నారని సామాజిక ఆర్థికశాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ శరీర నిర్మాణంలో ప్రోటీన్లు కీలకపాత్ర వహిస్తాయి. అలాంటి ప్రోటీన్లను అందజేసే సత్తా ఒక సముద్ర జీవులకే ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం సముద్రాలలో ఐదు ట్రిలియన్ మైక్రోప్లాస్టిక్ ఉన్నాయని వీటిని సముద్ర జీవులు( చేపల వంటివి) మింగడం వాటిని మనం ఆహారంగా తీసుకోవడంతో పలువురు క్యాన్సర్ల బారినపడుతున్నారని వైద్య ఆరోగ్యసర్వేలు తెలియజేస్తున్నాయి. 2025 సంవత్సరం నాటికి సముద్రాలలో ప్లాస్టిక్ చేపల నిష్పత్తి ఒకటి నిష్పత్తి 1:3గా ఉంటుందని అంచనాలు తెలుపుతున్నాయి. అనేక దేశాలు వ్యర్థ జలాలను సముద్రంలోకి విచక్షణ రహితంగా వదులుతున్నాయి. త్వరలో విశ్వవ్యాప్తంగా సముద్రంలో కలుస్తున్న డ్రైనేజీ వాటర్‌లో 70శాతం శుద్ధి చేయనందున సముద్ర జలాలు కలుషితమవుతున్నాయి. సముద్ర వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. దీనివల్ల ప్రతి ఏటా 13 మిలియన్ డాలర్ల నష్టం జరుగుతుంది. అని యు 'ఎన్ఇపి' అంచనా వేసింది. ప్లాస్టిక్ వ్యర్థాలను సముద్ర జలాల్లో పారవేస్తున్న దేశాల్లో భారత్, చైనా వాళ్లు ముందు వరసలో ఉండటం శోచనీయం. మన దేశంలో సాలీన ప్లాస్టిక్ వియోగం 15 మిలియన్ టన్నులు. ఇది 2050నాటికి 20 మిలియన్ల టన్నులు అవుతంది. 2050 నాటికి సముద్ర జలాల్లోని ప్లాస్టిక్ వస్తువులను తొలగించకపోతే సముద్రాల్లో ఉండే చేపల బరువు కన్నా ప్లాస్టిక్ వ్యర్థాల బరువు ఎక్కువ ఉంటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో పశ్చిమబెంగాల్లో రోడ్లనిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగిస్తున్నారు.వీటిపై మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది.మనకన్నా అభివృద్ధిలోఆర్థికంగా వెనకబడిన దేశాలైన బాంగ్లాదేశ్ రువాండా కీన్యాయలో ప్లాస్టిక్ బ్యాగుల తయారీ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాయి. ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. ఇకనైనా సముద్ర జలాల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలను వదలడం ఆపకపోతే చేపల కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువ ఉండేప్రమాదంఉంది.ప్లాస్టిక్ వినియోగం మీద నిషేధం విధించాలి. పర్యావరణహిత వస్తు వినియోగాన్ని ప్రోత్సహించాలి.పర్యావరణహితకరమైన వస్తువుల వినియోగాన్నిప్రోత్సహించాలి. ప్రభుత్వాలు ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అమలుచెయ్యాలి. ప్రకృతిపర్యావరణ రక్షణకు సముద్రాల రక్షణకు సమగ్రమైన చట్టాలు రూపొందించి అమలు చెయ్యాలి. కడలిని రక్షించుకోవాలి. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కడలిని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమోతుందిఅన్న వాస్తవాన్ని గ్రహించిసముద్ర జలాలను కాలుష్యం కాకుండా తక్షణ కార్యాచరణ ప్రణాళికలను అమలుచెయ్యాలి. పౌరసమాజం 'మహిళా' యువజన, సామాజిక సేవాసంస్థలు,సముద్ర జలాల రక్షణ వినియోగం ప్రయోజనాల మీద ప్రజలకు అవగాహన కలిగించాలి. ●

# వలసదారులే లక్ష్యంగా ఇమ్మిగ్రేషన్ దాడులు

## కార్మికనేత సహా 45 మంది అరెస్టు



**లాస్‌ఏంజెల్స్, జూన్ 7:** అమెరికాలో వలసదారులే లక్ష్యంగా ఫెడరల్ ఏజెంట్లు చేపట్టిన దాడులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాల్లో నిన్న రెండు హోం డిపో ప్రాంగణాలు సహా, ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెంట్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సోదాలకు వ్యతిరేకంగా వందలాది మంది ప్రజలు, వలసదారుల హక్కుల కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దీంతో అధికారులు, ప్రదర్శనకారుల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రముఖ కార్మిక సంఘ నాయకుడితో సహా 45 మందికి పైగా అరెస్టు అయ్యారు. వలసదారుల మానవతాహక్కుల కూటమి (సీహెచ్ఐఆర్ఎల్‌ఏ) ఆధ్వర్యంలో లాస్ ఏంజెలెస్ స్ట్రీట్‌లోని ఫెడరల్ భవనం సమీపంలో సుమారు 500 మంది ప్రదర్శనకారులు వలసదారులకు మద్దతుగా ప్లకార్డులు, జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో లాస్ ఏంజెలెస్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఈ నిరసనను చట్టవిరుద్ధమైన సమావేశంగా ప్రకటించి, వెంటనే ఖాళీ చేయాలని, లేకపోతే అరెస్టులు తప్పవని హెచ్చరించింది. రెండు హోం డిపోలు, ఒక ఫ్యాషన్ డిస్ట్రిక్ట్ సంస్థ, ఒక డోనట్ షాపుతో పాటు మొత్తం ఏడు వేర్వేరు ప్రాంతాల్లో ఎలాంటి వారెంట్లు లేకుండా కనీసం 45 మందిని అదుపులోకి తీసుకున్నారని సీహెచ్ఐఆర్ఎల్‌ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏంజెలికా సలాస్ ఆరోపించారు. మన రాజ్యాంగ హక్కులు, చట్టపరమైన ప్రక్రియ ఉల్లంఘనకు గురైతే, ఎవరి హక్కులైనా ఉల్లంఘించబడవచ్చని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మీరు వలసదారు కానందున సురక్షితంగా ఉన్నారని అనుకుంటే, మన దేశంలో జరుగుతున్నది అపూర్వమైనదని నేను మీకు చెప్పాలనుకుంటున్నానని ఆమె హెచ్చ రించారు. శాన్ డియాగోలోని ఓ రెస్టారెంట్‌లో జరిగిన ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఘటన తర్వాత ఈ నిరసనలు చెలరేగాయి. అలాగే, మిన్నియాపాలిస్‌లో ఫెడరల్ ఏజెంట్లు లాటినో కమ్యూనిటీలోకి ప్రవేశించినప్పుడు ఇలాగే నిరసనలు వెంటాడాయి. అయితే, తాము ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం కాకుండా, క్రిమినల్ దర్యాప్తునకు సంబంధించిన విషయమై వచ్చామని అధికారులు అప్పుడు స్పష్టం చేశారు. లాస్ ఏంజెలెస్‌లోని నిరసనల సమయంలో, కొందరు ఆందోళనకారులు ఫెడరల్ భవనంపై గ్రాఫిటీ వేశారని, దీనికి ప్రతిగా పోలీసులు పొగ బాంబులు ప్రయోగించారని లాస్ ఏంజెలెస్ టైమ్స్ నివేదించింది. సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ (ఎస్ఈఐయూ) కాలిఫోర్నియా ప్రెసిడెంట్ డేవిడ్ హ్యుయెర్టా అరెస్టుతో నిరసనలు మరింత తీవ్రరూపం దాల్చాయి. లాస్ ఏంజెలెస్ ఫెడరల్ భవనం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడి, ఇమ్మిగ్రేషన్ అధికారుల దాడులను ఖండిస్తూ, హ్యుయెర్టా విడుదలను డిమాండ్ చేశారు.

దాడులను రికార్డు చేస్తున్న సమయంలో హ్యుయెర్టా గాయపడ్డా రని, ఫెడరల్ ఏజెంట్ల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో ఆయనను అరెస్టు చేశారని కార్మిక సంఘం తెలిపింది. 58 ఏళ్ల హ్యుయెర్టాకు ఆసుపత్రిలో వైద్య చికిత్స అందించిన అనంతరం సెంట్రల్ ఎల్‌ఏలోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు తరలించారు. నాకు జరిగింది నా గురించి కాదు, ఇది చాలా పెద్ద విషయమని ఆసుపత్రి నుంచి హ్యుయెర్టా ఒక ప్రకటన విడుదలచేసారు. కష్టపడి పనిచేసే ప్రజలు, మన కుటుంబ సభ్యులు, మన సమాజ సభ్యులను నేరస్థులుగా పరిగణిస్తున్నారు. ఈ అన్యాయాన్ని మనం అందరం కలిసికట్టుగా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.



# ముర్షిదాబాద్ అల్లర్లపై ఛార్జిషీట్

## 13 మంది కీలక నిందితులపై అభియోగాలు

## 60 ఎఫ్ఐఆర్‌లు, 300 మంది అరెస్టు

**కోల్‌కత్తా, జూన్7:** బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన అల్లర్లకు సంబంధించి పోలీసులు 13 మందిపై ఛార్జిషీటు దాఖలుచేసారు. ముర్షిదాబాద్‌లోని జఫరాబాద్ హింసకు సంబంధించి ఒక తండ్రి కొడుకులు ఇద్దరూ మరణించారు. హరగోబిందోదాస్(74), చందన్‌దాస్(40)లు ఈ హింసలో చనిపోయారు. ధులియన్ సూతీ షంషేర్‌గంజ్ మతపరమైన హింసకు సంబంధించిన ఘర్షణల్లో వీరు చనిపోయారు. వక్ఫ్ సవరణ చట్టం 2025పై తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తూ ఈ ప్రదర్శనలు చేసారు. దీనితో ఆప్రాంతంలో కేంద్ర సాయుధ బలగాలను మోహరించి శాంతిభద్రతలను సమీక్షించారు. ఇందుకు సంబంధించి నేరం జరిగిన 55 రోజుల్లోనే తాము ఛార్జిషీటును దాఖలుచేసామని, ఈ నేరంలో 13 మంది వ్యక్తులప్రమేయం ఉందని తాము నిరూపించగలమని పోలీసులు తెలిపారు. ఈ హింస తర్వాత పోలీసులు సుమారు 300 మందికిపైగా అరెస్టులుచేసారు. అంతేకాకుండా 60కిపైగా ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేసారు. ముర్షిదాబాద్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో ఈకేసులు నమోదయ్యాయి. మృతుడు దాస్ నివసిస్తున్న బెట్‌బోనా గ్రామం ముష్కరులు టార్గెట్ చేసారు. దీనికితోడు దాస్ నివాసం టార్గెట్ అయింది. ప్రధాన ద్వారం బద్దలుకొట్టారు. చందన్‌దాస్, హరగోవిందోదాస్‌ను బయటికి ఈడ్చుకెళ్లి వారిపై గొడ్డలితో దాడులు చేసారు. వారు చని పోయేంత వరకూ వేచిచూసి అప్పుడు ముష్కరులు వెళ్లినట్లు తేలింది. ఆందోళనకారులు కొన్ని ఆస్తులను దగ్ధంచేస్తే మంటలు కొనసాగేందుకు వీలుగా ఆప్రాంతంలో నీటిసరఫరాలను కూడా బంద్ చేసినట్లు తేలింది.

స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు మెహబూబ్ ఆలమ్, ధూలియన్ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్‌ల డైరెక్షన్‌లోనే ఈ దాడులుజరిగినట్లు నిజనిర్ధారణ కమిటీ తేల్చింది. గతనెల 21వ తేదీ ఈ టీమ్ హైకోర్టుకు నివేదికి వచ్చింది. రాష్ట్రపోలీసులు అచేతనంగా వ్యవహరించారని, యూనిఫామ్ సిబ్బంది తక్షణమే స్పందించకపోవడం వల్లనే ఇద్దరి హత్య జరిగిందన్నారు. మొత్తం 113 ఇళ్లు దారుణంగా దెబ్బతిన్నాయని, బెట్‌బోనా గ్రామంలో దుండగులు రెచ్చిపోయి విధ్వంసం సృష్టించినట్లు కమిటీ నివేదిక ఇచ్చింది.

# మహారాష్ట్రలో 'ప్రజాస్వామ్య రిగ్గింగ్'

## మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిన బిజెపి

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపణలు

## తీవ్రంగా స్పందించిన బిజెపి



**న్యూఢిల్లీ, జూన్ 7:** మహారాష్ట్రలో బిజెపి నేతృత్వంలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కమలం పార్టీ మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు ఆ ఎన్నికలు ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. బీహార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం అవుతుందని విమర్శించారు. దీనిపై బిజెపి కౌంటర్ ఇచ్చింది. ఎన్నికల్లో అక్రమాలు ఎలా? అంటూ ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ప్రజాస్వామ్య రిగ్గింగ్‌కు 2024లో జరిగిన మహారాష్ట్ర ఎన్నికలు ఒక ఉదాహరణ. ఎన్నికల కమిషన్ నియామకం, నకిలీ ఓటర్ల నమోదు, పోలింగ్‌లో అవకతవకలు, ఆధారాలను దాయడం వంటి చరనయలకు పాల్పడ్డారు. బిజెపి ఎందుకు అలా ప్రవర్తించిందో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. రిగ్గింగ్ అనేది మ్యాచ్ ఫిక్సింగ్‌లాంటిది. మోసం చేసే పార్టీ ఆటలో గెలవొచ్చు. కానీ అలాంటి గెలుపు వ్యవస్థలను దెబ్బతీస్తుంది. ఎన్నికల ఫలితాలపై ప్రజల విశ్వాసాన్ని నాశనం చేస్తుంది. ప్రజలంతా ఆధారాలను గమనించి సమాధానాల కోసం డిమాండ్ చేయాలి. ఎందుకంటే మహారాష్ట్ర తర్వాత బీహార్ ఎన్నికలు ఉన్నాయి. ఆ తర్వాత బిజెపికి ఓటమి భయం ఎక్కడుంటుందో అక్కడ ఇవే పునరావృతం అవుతాయి. మ్యాచ్‌ఫిక్సింగ్ ఎన్నికలు ప్రజాస్వామ్యానికి విషం లాంటివి' అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవే అంశాలను ఆయన ఓ జాతీయ మీడియా కాలమ్‌లో ప్రస్తావించారు. ఈ ఆరోపణలపై బిజెపి తీవ్రంగా స్పందించింది. ఇసి చాలాసార్లు వివరంగా చెప్పినా రాహుల్‌గాంధీ మళ్లీ దేశంలోని వ్యవస్థలను బూచిగా చూపే పనిలో ఉన్నారని మండిపడింది. మహారాష్ట్ర శాసనసభకు 288 సీట్లు ఉన్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో బిజెపి, శివసేన, ఎన్‌సిపి కూటమి 235 సీట్లు గెలుచుకుంది. ఒక్క కమలం పార్టీకే 132 స్థానాలు దక్కాయి. మరోవైపు ఈ ఏడాది చివర్లో బీహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

# ఛాతెన్‌లో చిక్కుకుపోయిన 76మందిని ఆర్మీ ఎయిర్‌లిఫ్టింగ్




**గ్యాంగ్‌టక్, జూన్ 7:** సిక్కింలో సంభవించిన భారీ వరదలకుగాను ఛాతెన్ ప్రాంతంలో చిక్కుకుపోయిన సైనికుల్లో 76 మందిని హెలికాప్టర్ల సాయంతో రక్షించారు. కొండచరియలు విరిగి పడటం భారీ వర్షాల కారణంగా రహదారులన్నీ మూసుకుపోయాయి. రాకపోకలకు తావులేని తరుణంలో ఆర్మీ సిబ్బందిని రక్షించేందుకు రంగంలోని వైమానికదళ హెలికాప్టర్లు వచ్చాయి. ఈప్రాంతంలో ఇతరత్రా చిక్కుకుపోయిన యకుకులను కూడా తరలించామని ఆర్మీ సిబ్బంది చెప్పారు. ఎంఐ 17 హెలికాప్టర్లద్వారా మొత్తం ఈ తరలింపు కార్యక్రమం పూర్తిచేసామని ఛాతెన్‌నుంచి పాక్యాంగ్‌గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు వీరందరినీ తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలకు గురయిన ఈ ప్రాంతంలో మొత్తం సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యల్లో ఉన్నట్లు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ఉత్తర సిక్కింగ్ ప్రాంతం భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్నది. లాచెన్, లాచుంగ్, ఛుంగ్ థాంగ్ పట్టణాల్లో సుమారు 1600 మందికిపైగా యాత్రీకులు చిక్కుకుపోయారు. వారందరినీ రాష్ట్రప్రభుత్వం హెలికాప్టర్ల సాయంతో రక్షించింది. కాగా ఈ ప్రళయంలో ముగ్గురు ఆర్మీ సిబ్బంది చనిపోయారు. మరో నలుగురు గాయపడ్డారు. వీరుకాకుండా ఆరుగురు సైనికులు ఆచూకీ గల్లంతయింది. వీరి ఆచూకీకోసం ఇతర బృందాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి.

# అసోంలో విద్రోహ చర్యలకు పాల్పడుతున్న మరో ఇద్దరు అరెస్టు

**గువాహతి, జూన్ 7:** జాతివ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న అభియోగాలపై మతవిద్వేషాలను రెచగొడుతున్నారని మరో ఇద్దరిని అస్సాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనితో ఒక్క అసోంలోనే పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత దేశవ్యతిరేక వ్యాఖ్యలుచేసి అరెస్టు అయిన వారి సంఖ్య 90కి పెరిగింది. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ దేశవిద్రోహక చర్యలను సహించేదిలేదని, మతవిద్వేషాలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమని స్పష్టం చేసారు. శ్రీరాముడిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకు గాను ఒక వ్యక్తిని గోల్‌పారా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తిని మతవిద్వేషాలు రెచ్చగొట్టారని కామరూప్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారత్ వ్యతిరేక నిరసనలపై అస్సాం పోలీసులు ఉక్కుపాదం మోపారు. పాకిస్తాన్ అనుకూల చర్యలను సహించేదిలేదని ఇప్పటికే సీఎం హెచ్చరించారు.

## రాహుల్ కోసం ప్రత్యేక మరుగుదొడ్డి

# ఇలా నిర్మించి.. అలా తీసేశారు!




**పాట్నా, జూన్ 7:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ మౌంటెన్ మ్యాన్‌గా పేరుగాంచిన దశరథ్ మాంఝీ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన సందర్భంలో జరిగిన సంఘటన ఇపుడు వైరల్ అవుతోంది. దీనిపై సర్వత్రా విమర్శలు కూడా వెల్లువెత్తాయి. రాహుల్ గాంధీ, అధికారుల కోసం కేవలం రెండు గంటల్లో మాంఝీ ఇంటి బయట ఓ వీఐపీ మరుగుదొడ్డిని నిర్మించారు. ఆయన వెళ్లిపోగానే దాన్ని కూలగొట్టారు. రాహుల్ గాంధీ పర్యటనకు ముందు రాష్ట్ర ప్రభుత్వం చకచకా ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా దశరథ్ మాంఝీ మట్టి ఇంటి వెలుపల ఓ అత్యవసర వీఐపీ మరుగుదొడ్డిని నిర్మించారు. కేవలం రెండు గంటల్లోనే ఇది సిద్ధమైంది. అయితే, రాహుల్ గాంధీ ఆ గ్రామం నుంచి తిరిగి వెళ్లిన వెంటనే అధికారులు ఆ మరుగుదొడ్డిని తొలగించారు. చారిత్రక నేపథ్యం ఉన్న మాంఝీ కుటుంబానికి శాశ్వత మరుగుదొడ్డి సౌకర్యం కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం, నేతల పర్యటనల కోసం తాత్కాలిక హంగులు చేయడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తారు. దశరథ్ మాంఝీ మనవరాలు అన్షు కుమారి తమ కుటుంబం ఎదుర్కొంటున్న దుస్థితిని వివరించారు. 2015లో ప్రభుత్వం నిర్మించిన మరుగుదొడ్డిని రోడ్డు నిర్మాణం కోసం కూల్చివేశారని, అప్పటి నుంచి గత పదేళ్లుగా తమకు మరుగుదొడ్డి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పర్యటన సందర్భంగా మాంఝీ కుమారుడు భగీరథ్ మాంఝీ రెండు ప్రధాన డిమాండ్లను ఆయన ముందుంచారు. ప్రస్తుతం తాము నివసిస్తున్న మట్టి ఇంటి స్థానంలో పక్కా ఇల్లు నిర్మించాలని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బోధ్ గయ స్థానం నుంచి పోటీ చేసేందుకు అన్షు కుమారికి కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని వారు కోరారు. కాంగ్రెస్ కుటుంబ సభ్యులు చెప్పిన సమస్యలను రాహుల్ గాంధీ సావధానంగా విన్నారు. వారి విజ్ఞప్తులను పార్టీ పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. బీహార్‌లో దళిత వర్గాలతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పక్కా ప్రణాళికతోనే ఈ పర్యటన చేపట్టిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు కొండను తొలిచి రహదారి నిర్మించిన దశరథ్ మాంఝీ స్ఫూర్తిని, ఆయన ప్రతీకను రాజకీయంగా వాడుకునే ప్రయత్నంగా దీనిని చూస్తున్నారు.

# ట్రంప్‌తో వివాదం.. మస్క్‌కు రష్యా బంపర్ ఆఫర్!



**మాస్కో, జూన్ 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య బంధం బీటలు వారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మస్క్‌కు రష్యా బంపర్ ఆఫర్ ప్రకటించింది. తమ దేశంలో పొలిటికల్ అసైలమ్‌లో ఉండేందుకు మస్క్‌కు అవకాశం కల్పిస్తామని పేర్కొంది. రష్యాకు చెందిన స్టేట్ డూమా ఫెడరేషన్ కమిటీ ఛైర్మన్ దిమిత్రి నోవికోవ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మస్క్ పూర్తిగా భిన్నమైన ఆట ఆడతారని నేను అనుకుంటున్నా. ఆయనకు రాజకీయ శరణార్థిగా ఉండాల్సిన అవసరం లేదు. ఒకవేళ అలా చేయాలనుకుంటే రష్యా సహకరిస్తుంది' అని పేర్కొన్నారు. ఎడ్వర్డ్ స్నోడెన్ లాగానే మస్క్‌కు రష్యాలో రాజకీయ శరణార్థిగా అవకాశం కల్పిస్తారా అని అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. అమెరికాకు చెందిన స్నోడెన్‌ను రాజకీయ శరణార్థిగా పరిగణిస్తూ రష్యా ఆశ్రయం కల్పించింది. ఈ సందర్భంగా తర్వాత ఎన్నికల్లో డెమోక్రట్లు రావాలని మస్క్ కోరుకోవడం లేదని తాను అనుకుంటున్నానని దిమిత్రి తెలిపారు. కాగా.. ట్రంప్, మస్క్‌ల మధ్య నెలకొన్న వివాదంపై జోక్యంచేసుకునేందుకు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ నిరాకరించారు. ఇది యుఎస్ సమస్య అని, తమకు ఇందులో జోక్యం చేసుకొనే ఉద్దేశం లేదని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడే స్వయంగా ఈ సమస్యను పరిష్కరించుకుంటారని తాము భావిస్తున్నట్లు తెలిపారు.

మే నెలలో తీసుకొచ్చిన రిపబ్లికన్ ట్యాక్స్ బిల్లును మస్క్ వ్యతిరేకించడంతో ట్రంప్‌తో దూరం పెరిగింది. ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలో మస్క్ కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమంటూ ఎక్స్‌లో తన ఫాలోవర్లను ప్రశ్నించారు. ఇక, ట్రంప్‌నకు అంత్యంత సన్నిహితుడు, గతంలో శ్వేతసౌధం సలహాదారుడిగా పనిచేసిన స్టీవ్ బెనాన్ మస్క్‌ను ఓ అక్రమ వలసదారుగా పేర్కొన్నారు. వెంటనే ఆయనను దేశంనుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. స్పేస్‌ఎక్స్ సంస్థను సీజ్ చేయాలని అమెరికా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ట్రంప్-జిన్‌పింగ్ ఫోన్‌కాల్ వేళ..

# లండన్‌లో యుఎస్-చైనా వాణిజ్య చర్చలు



**వాషింగ్టన్, జూన్ 7:** ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా–చైనా తమ వాణిజ్య వివాదాలను తగ్గించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చైనా ప్రతినిధులు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సలహాదారుల మధ్య సోమవారం లండన్‌లో వాణిజ్య చర్చలు జరగనున్నాయి. తమ దేశం తరఫున ట్రెజరీ మంత్రి స్కాట్ బెసెంట్, వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమీసన్ గ్రీర్ పాల్గొంటారని ట్రంప్ వెల్లడించారు. అలాగే ఈ సమావేశం బాగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ట్రంప్ ఫోన్ కాల్‌లో మాట్లాడిన తర్వాత ఈ చర్చల ప్రకటన రావడం గమనార్హం.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెలలో చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనిని ప్రతీకారంగా చైనా కూడా అమెరికా దిగుమతులపై 125 శాతం సుంకాలు విధించింది. ఇలా అధిక టారిఫ్‌లు విధించుకోవడం అంటే ఈ దేశాలు ఒకదానికొకటి ఉత్పత్తులను బహిష్కరించుకోవడం కిందే లెక్క. ఆ పరిణామాలతో అమెరికా జిడిపిలో క్షీణత కనిపించింది. చైనా విషయానికొస్తే అమెరికాకు గత నెలలో ఎగుమతులు భారీగా తగ్గడంతో, ఆ దేశ తయారీ పరిశ్రమపై ప్రభావం పడింది. చైనా ఫ్యాక్టరీల కార్యకలాపాలు 16 నెలల క్షీణతకు చేరాయి. దాంతో ఇరు దేశాలూ వాణిజ్య యుద్ధంలో సంధికి వచ్చాయి.

వాణిజ్య వివాదాలను పరిష్కరించుకోవడానికి, మరిన్ని చర్చలు జరిపే నిమిత్తం టారిఫ్ యుద్ధానికి 90 రోజుల విరామం ఇస్తున్నట్లు ప్రకటించాయి. జెనీవాలో ఇరువర్గాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ప్రకటనలు వెలువడిన సంగతి తెలిసిందే. 'చైనాతో మంచి భేటీ జరిగింది. చాలా విషయాలు చర్చకు వచ్చాయి. కొన్నింటిపై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదిరింది. రెండు దేశాలకు ప్రయోజనకర నిర్ణయాలు తీసుకోవాలనే మేం కోరుకుంటున్నాం. మంచి పురోగతి లభించింది' అని ఆయన రాసుకొచ్చారు. ఈ నేపథ్యంలో లండన్‌లో మరోసారి చర్చలు జరగనున్నాయి. ఈ విషయాన్ని ట్రంప్ ట్రూత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

# చార్టర్డ్ విమానం జాప్యంతో రోగికి ప్రాణదానం

## మహారాష్ట్ర డిప్యూటీ సిఎం ఏక్‌నాథ్‌షిండే మానవతా దృక్పథం



**జలగాంవ్,జూన్ 7:** మహారాష్ట్ర డిప్యూటి ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే ప్రయాణించాల్సిన ఛార్టర్ విమానం ఆలస్యంగా బయలుదేరింది. తన పని వేళలు ముగిసాయని, తొమ్మిది గంటల షిఫ్ట్‌కు సంబంధించి 8.45 గంటలు పూర్తయినందున ఉన్నతాధికారుల అనుమతులు అవసరం ఉంటుందని పైలట్ స్పష్టం చేయడంతో విమానం బయలుదేరడంలో జాప్యం జరిగింది. చివరకు అన్ని అనుమతులు క్లియరెన్సులు రావడంతో రాత్రి 9.45 గంటలకు జలగాంవ్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది. అయితే పైలట్ ఆలశ్యం చేయడంవల్ల ఒక కిడ్నీరోగికి జీవన దానం చేసినట్లయింది. షిండే కార్యాలయానికి ఒక అత్యవసర సందేశం రావడం, కిడ్నీ రోగిని అత్యవసరంగా ముంబయికి తరలించాల్సి ఉందని, శీతల్‌బొరాడే అనే మహిళ కిడ్నీ వైఫల్యంతో చికిత్సకోసం ఆమె వెళ్లాల్సిన విమానం మిస్ అయిందని ఆమె ముంబయి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి అందింది. సమాచారం అందుకున్న వెంటనే షిండే స్పందించి తనతో వస్తున్న ఇద్దరు పార్టీ కార్యకర్తల సీట్లను వారికిచ్చారు. దీనితో రోగి శీతల్ బొరాడేతోపాటు ఆమెభర్తను తన విమానంలోనే ముంబయికి తీసుకువచ్చారు. అంతేకాకుండా ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఆసుపత్రికి తరలించేందుకు వీలుగా అత్యవసర అంబులెన్స్‌ను ఎయిర్‌పోర్టులో సిద్ధంచేయడంతో శీతల్ వెనువెంటనే ఆసుపత్రికి చేరవడం వల్ల ఆమెకు ప్రాణదానం చేసినట్లయింది. రాష్ట్ర జలవనరుల మంత్రి గిరిష్ మహాజన్‌నుంచి ఈ సందేశం షిండే కార్యాలయానికి వచ్చింది. ఆ సమాచారం వెంటనే పాస్‌ఆన్ చేయడంతో రోగికి షిండే ప్రాణదానం చేసారని, ఆజంట డిప్యూటిసిఎంను దేవుడిగా అభివర్ణించారు. నిజానికి విమానం బయలుదేరడంలో జరిగిన జాప్యం ఒక రోగి జీవితాన్ని కాపాడిందని, షిండే ప్రదర్శించిన మానవతా దృక్పథం నేటితరం నేతలకు ఆదర్శనీయమని నీటిసరఫరా, పారిశుధ్యనిర్వహణశాఖమంత్రి గులాబ్‌రావ్‌పాటిల్ అన్నారు.




## చార్‌ధామ్ యాత్రకువెళ్లే హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

# పైలట్‌కు స్వల్పగాయాలు, యాత్రికులు సురక్షితం

**రుద్రప్రయాగ్, జూన్ 7:** కేదార్‌నాథ్‌కు వెళుతున్న హెలికాప్టర్ సాంకేతిక లోపం కారణంగా అత్యవసర ల్యాండింగ్ జరిగింది. రుద్రప్రయాగ్ జిల్లాలోని హైవేపైనే లాండ్ అయింది ఉత్తరాఖండ్‌లోని సిర్సి హెలిపాడ్‌నుంచి టేకాఫ్ తీసుకున్న హెలికాప్టర్ కేదార్‌నాథ్‌కువెళ్లాల్సి ఉండగా సాంకేతిక సమస్య తలెత్తడంలో వెంటనే ఎమర్జెన్సీ లాండింగ్‌చేసారు. దీనితో రోడ్డుపైనే ఉన్న ఖాళీ స్టేషనరీ లారీకి హెలికాప్టర్ వెనుక భాగం తగిలి కొంతమేర దెబ్బతిన్నది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురితోపాటు పైలట్‌కూడా సేఫ్‌గానే ఉన్నారు. ఇటీవలికాలంలో చార్‌ధామ్ రూట్‌లో హెలికాప్టర్ ట్రిప్‌లలో జరుగుతున్న ప్రమాదాల్లో తాజాగా జరిగింది. ఎడబ్ల్యు119 కెస్ట్రేల్ ఏవియేషన్‌సంస్థ 12.52 గంటలకు రుద్రప్రయాగ్‌జిల్లాలోని బదాసు ప్రాంతంలో ఉన్న హెలిపాడ్‌నుంచి ప్రారంభం అయింది. పైకి లేచిన వెంటనే సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్ వెంటనే అత్యవసర లాండింగ్‌చేయడంతో హైవేపై ఆగి ఉన్న స్టేషనరీ కార్‌కు తగిలి కొంత భాగం దెబ్బతిన్నది. ఐదుగురుప్రయాణీకులు సురక్షితమే కానీ పైలట్‌కు మాత్రం స్వల్పగాయాలయ్యాయి. పైలట్‌కు ఎంతో అనుభవం ఉందని డిజిసిఏ ప్రకటించింది. అందువల్లనే సురక్షితంగా హైవేపైనే ల్యాండ్ కాగలిగిందని వెల్లడించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం హెలిపాడ్‌నుంచి టేకాఫ్ కాగానే పైలట్‌కు నియంత్రణ స్టక్ అయినట్లు అనుమానించారు. దీనితో వెంటనే బలంగా ల్యాండింగ్ చేసేందుకు నిర్ణయించి హెలిపాడ్‌కు సమీపంలోనే ఉన్న రోడ్డుపై ల్యాండింగ్‌చేసారని డిజిసిఏ వివరణ ఇచ్చింది. పైలట్‌కు స్వల్పగాయాలయాల్యాయి. అలాగే వెన్నునొప్పి కూడా ఉండటంతో వెంటనే ఆసుపత్రికి తరలించినట్లు డిజిసిఏ చెప్పింది. ఎయిర్‌సేఫ్టీ డైరెక్టరేట్ టీమ్ ప్రమాదం అధ్యయనం కోసం సంఘటన ప్రాంతానికి వెళ్లింది. గతంలో కూడా కేస్ట్రెల్ ఏవియేషన్ హెలి కాప్టర్ ప్రమాదం జరిగి ఉత్తరాఖండ్ సివిల్‌ఏవియేషన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఫైనాన్స్ కంట్రోలర్ అమిత్ సైని మృతికి కారణం అయింది. ఆ సంఘటనతో సంస్థ కార్యకలాపాలను డిజిసిఏ సస్పెండ్ చేసింది. బాధితుల్లో టిడిపి అనంతపూర్ ఎంపి జి లక్ష్మీనారాయణ సోదరి ఎం వేదవతి కూడా ఉన్నారు.

# సంబంధం లేకపోయినా..నైతిక బాధ్యతతో వైదొలగుతున్నాం

## కెఎస్‌సిఏ కార్యదర్శి, కోశాధికారి రాజీనామా



**బెంగళూరు, జూన్ 7:** కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. శంకర్, కోశాధికారి ఇఎస్ జైరామ్‌లు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్సీబీ ఐపిఎల్ విక్టరీ పేరేడ్‌లో జరిగిన తొక్కిసలాటలో 11 మంది చనిపోయి 50 మందికిపైగా గాయాలపాలయిన సంఘ టనకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. వీరిద్దరు ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదలచేసారు. కెస్ఎస్‌సిఏ అధ్యక్షుడికి తాము లిఖితపూర్వక రాజీనామాలను రెండురోజుల ముందే అందచేసినట్లు తెలిపారు. గడచిన రెండు రోజులుగా అనుకోని సంఘటనలు జరిగాయని, అనూహ్యంగా జరిగిన సంఘటనలు కెఎస్‌సిఏ ప్రతిష్టను దెబ్బతీసినట్లు భావిస్తున్నామన్నారు. అందువల్లనే నైతిక బాధ్యతగా తమ పదవులకు రాజీనామాలుచేయాల్సివచ్చిందని ప్రకటించారు. కర్ణాటకక్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్‌భట్ ,కార్యదర్శి శంకర్, కోశాధికారి జయరామ్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేస్తూ గేట్ మేనేజ్‌మెంట్, జనబాహుళ్యాన్ని నియంత్రించే బాధ్యత కెఎస్‌సిఏది కాదని, ఆర్సీబీ ఐపిఎల్ వేడుకల నిర్వహణకు విధాన్‌సౌధ వద్దనిర్వహణకు అనుమతులు కోరామని చెప్పారు. విధానసౌధ వద్ద సన్మాన కార్యక్రమం ఎలాంటి సంఘటనలు లేకుండా ముగిసిందని చిన్నస్వామి స్టేడియం బయట మాత్రం భారీ ఎత్తున ఫ్యాన్స్ రావడంవల్లనే తొక్కిసలాట జరిగిందని అన్నారు. ఆర్సీబీ సోషల్‌మీడియా ఆహ్వానంతోనే లక్షలాదిగా అభిమానులు తరలివచ్చినట్లు కెఎస్‌సిఏ వెల్లడించింది. అలాగే ముందుగా అనుకున్నట్లు విక్టరీ పేరేడ్‌ను రద్దుచేసామని, అయితే స్టేడియంలోపల కార్యక్రమం మాత్రం సజావుగానే ముగిసిందని,తొక్కిసలాట స్టేడియం బయట మాత్రమే జరిగిందని వారు హైకోర్టుకు ఇచ్చిన పిటిషన్‌లో వెల్లడించారు.

# మోడీ పాలన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

## కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ



**భీమవరం జూన్ 7 (ప్రభాతవార్త) :** 2047 నాటికి భారత్‌ను పూర్తిస్థాయి వికసిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రధాని మోదీ పాలన సాగుతోందని, 11 ఏళ్ళ మోదీ పాలనలో సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి చేసిన కృషి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం భీమవరం లోని కేవిస్ ఫంక్షన్ హాల్ లో పశ్చిమగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షురాలు శ్రీమతి శ్రీదేవి అధ్యక్షతన 11 సంవత్సరాల మోదీ సుపరిపాలన, సేవ, వికసిత్ భారత్, యోగా దినోత్సవం %d% బలిదాన్ దివాస్ , ఎమర్జెన్సీ కార్యక్రమాలపై జరిగిన జిల్లా కార్యశాలలో ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొని మాట్లాడారు 2014లో ప్రారంభమైన ప్రధాని మోదీ పరిపాలన వల్ల అన్ని రంగాల్లో ప్రపంచ దేశాలకు దీటుగా ఎదిగిందని, ప్రపంచంలోనే నాలుగవ ఆర్థిక శక్తిగా భారత్ ను నిలిపిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని అన్నారు.స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయని అన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 9 నుండి 11 సంవత్సరాలు మోదీ పాలన లో సాధించిన విజయాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల వద్దకు తీసుకు వెళ్లటంలో కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ఈనెల 9 నుండి 20 తేదీ వరకు పార్టీ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలోను మండలంలోను కార్యక్రమాలు నిర్వహించాలని బిజెపి నాయకులకు కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈనెల 13 14 15 తేదీల్లో వికసిత్ భారత్ సంకల్ప సభ ప్రతి మండలంల్లో నిర్వహించాలని, 16 17 18 తేదీల్లో నగరాల్లో వీధుల్లో రచ్చబండ వద్ద గ్రామపంచాయతీ కేంద్రాల్లో కూడా సమావేశాలు నిర్వహించాలని అన్నారు. కేంద్రంలోనూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలకు తీసుకువెళ్లవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షులు నార్ని తాతాజీ, మాజీ మున్సిపల్ చైర్మన్ ముళ్ళపూడి రేణుక,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కలిదిండి వినోద్ వర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, మచిలీపట్నం ఇంచార్జ్ కపర్ది, భీమవరం నియోజవర్గ కన్వీనర్ కాగిత సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# శ్రీబండిముత్యాలమ్మను దర్శించుకున్న అసిస్టెంట్ కమిషనర్



**మొగల్తూరు జూన్ 7(ప్రభాతవార్త) :**ముత్యాలపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములను పురస్కరించుకొని, శనివారం ప్రొహిబిషనల్ ఎక్సైజ్, అసిస్టెంట్ కమిషనర్, ఎల్.వి ప్రభు కుమార్ (ఏలూరు) అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శేష వస్త్రాన్ని సమర్పించి సత్కరించారు, వారితో పాటుగా నరసాపురం ప్రొబిషనల్ ఎక్సైజ్, సి ఐ ఎస్ ,రాంబాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# డ్రగ్స్ వాడకం నిషేధంపై ప్రభుత్వం విస్తృత స్థాయి ప్రచారం



**ఏలూరు,ప్రభాతవార్త :**మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దటమే లక్ష్యమని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏలూరు ఆశ్రమం మెడికల్ కళాశాల క్రికెట్ మైదానంలో రెండు రోజులు పాటు జరుగుతున్న ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ క్రీడాకారులను ప్రోత్సహించారు. తొలుత పోటీలో పాల్గొంటున్న ఆరు జట్ల క్రీడాకారులను కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ పరిచయం చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించడంతో పాటు మాదక ద్రవ్యాల అమ్మకం , రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని 1972, 14446 టోల్ ఫ్రీ నెంబర్లకు అందించాలన్నారు.యువత మాధకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాడం జరుగుతుందన్నారు. ఎస్పీ కె.పి ఎస్.ఎస్.కిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను వివిధ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా చైతన్య పరచాలన్నారు.గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా పై ప్రత్యేక నిఘా పెట్టామని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠినమైన శిక్షలు పడేలా కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా



మీడియా,రెవెన్యూ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించగా,టాస్ గెలిచి రెవెన్యూ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల,వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి. రామ్ కుమార్,డి ఎస్ డి వో బి.శ్రీనివాసరావు,సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్,ఎన్జీవో నాయకులు చోడగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# చటాకాయ్ సర్పంచ్ ఘంటసాల శేషారావు మృతి

**కైకలూరు జూన్ 7 (ప్రభాతవార్త) :** మండలంలోని చటాకాయ గ్రామ సర్పంచ్ ఘంటసాల శేషారావు శనివారం ఆకస్మిక మృతి చెందారు. సర్పంచ్ శేషారావు మృతితో మండల ప్రజలు, గ్రామ ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెండు పర్యాయాలు సర్పంచ్ గా చేసి గ్రామాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. సర్పంచ్ మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే యేసు రాజు,వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులు వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

# వినూత్న రీతిలో సాగిన ఎమ్మెల్యే రోషన్ కుమార్ పల్లెనిద్ర

**జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త:** చింతలపూడి మండలం నాగిరెడ్డి గూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన పల్లెనిద్ర కార్యక్రమం ఈసారి వినూత్న రీతిలో జరిగింది. గంటల తరబడి స్పీచ్లు ఇచ్చే కార్యక్రమం కాకుండా ప్రజలకు అర్థమయ్యే రీతిలో నాటు సారా కాయకుండా, అలాగే మద్యానికి బానిస అయ్యి, ఆ కుటుంబం పెద్దను కోల్పోతే ఆ కుటుంబం ఏ విధంగా రోడ్డున పడుతుందో ఆ కుటుంబం వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందనేది ఎమ్మెల్యే ఆలోచన మేరకు శ్రీ మహాలక్ష్మి కళాబృందం వారిచే మార్పు అనే లఘు నాటిక ద్వారా వినూత్న రీతిలో సంస్కృతిక నాటికల ద్వారా కళ్ళకు కట్టినట్లు చూపించారు, ఈ మార్పు అనే డ్రామాలో ఎక్సైజ్ సీఐ అశోక్ కూడా ఆయన వంతుగా చిన్న రోల్లో నటించి మంచి సందేశం ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలిపారు. శాసనసభ్యులు చదువుకుంటున్న పిల్లలందరిని వేదికపై రప్పించి వారితో ముచ్చటించడం ద్వారా



చిన్నారులు ఎంతగానో సంబరపడ్డారు. గ్రామంలో ఒక నిరుపేద ఇంట్లో ఎమ్మెల్యే రోషన్ కుమార్వ పల్లె నిద్ర చేయడం ద్వారా ఈ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో చింతలపూడి పట్టణ మండల కూటమినాయకులు కార్యకర్తలు అభిమానులు యువత ముఖ్యంగా మహిళలు పాల్గొన్నారు.

# ఏలూరులో ఈనెల 9వ తేదీన 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం

**ఏలూరు,ప్రభాతవార్త :** ఏలూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో 10వ తరగతి, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానించి, నగదు పురస్కారం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం నిర్వహణపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో 10వ తరగతి, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన వారిని 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం ద్వారా సన్మానించడం జరుగుతుందని, కార్యక్రమం ఈనెల 9వ తేదీ ఉదయం 9. 30 నిలకు ఏలూరులోని సర్ సి.ఆర్.రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్, జిల్లా మంత్రులు కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. కార్యక్రమ నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ డిఈఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో 83. 33 శాతం అంతకు మించి మార్కులు సాధించిన వారిలో మండలం నుండి 6గురు చొప్పున 163 మంది విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని, అదేవిధంగా జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థిని, విద్యార్థులకు సర్టిఫికెట్, 20 వేల రూపాయల నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్షా అభియాన్ ఏపి సి పంకజ్ కుమార్, విద్యా శాఖ ఏడి ఎం. వెంకటప్పయ్య, ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, జిల్లా సహకార అధికారి ఏ . శ్రీనివాస్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, డిఎస్ఓ శివరామమూర్తి, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ త్రినాధ్ బాబు,మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడి రవికుమార్, డిఎస్ డి ఓ శ్రీనివాసరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

# ముత్యాలమ్మను దర్శించుకున్న ఇంటిలిజెన్స్ డి.ఎస్.పి

మొగల్తూరు **జూన్ 7(ప్రభాతవార్త)** శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములను పురస్కరించుకుని, శనివారం మధ్యాహ్నం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఇంటిలిజెన్స్ డి.ఎస్.పి, మేక సుధాకర్–కనకదుర్గ, వారి కుమార్తె నాగదుర్గ మౌనిక, అల్లుడు సత్యసాయి అయ్యప్ప, వారి వియ్యంకుడు, కాళీపట్నం వాస్తవ్యులు, కంబాల శ్రీనివాస్–మావుళ్ళమ్మ, దంపతులతో కలిపి శ్రీ బండి ముత్యాలమ్మవారిని దర్శించుకున్నారు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ , ఉత్సవ కమిటీ సభ్యులు, ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్లు, డీఎస్పీ కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో



స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, శేష వస్త్రాలతో సత్కరించి లడ్డు ప్రసాదములు అందజేశారు, వారితో పాటుగా కుక్కల రవి, స్వామి, శ్రీను, బాలాజీ తదితరులు పాల్గొన్నారు

# ఇరుకు వంతెనకు మోక్షం కల్పించండి మహాప్రభో

# - నాలుగు గ్రామాల ప్రజలు నరకయాతన



**ప్రభాతవార్త, చాట్రాయి :** మంకొల్లు చీపురుగూడెం మధ్యలో తమ్మిలేరు లింక్ ఛానల్ పై నిర్మాణం చేసిన ఇరుకు వంతెన నాలుగు గ్రామాల ప్రజలను నరకయాతనకు గురిచేస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు రాకపోకలకు ఆటంకంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు వంతెన వెడల్పు చేయాలని ఎన్నో మార్లు ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చిన ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు అధికారంలోకి రాగానే వంతెనను వెడల్పు చేస్తామని హామీ ఇవ్వడం మర్చిపోవడం పరిపాటిగా మారింది. కేవలం ఎడ్ల బండ్లు ట్రాక్టర్లు మాత్రమే ఈ రోడ్డుమీద ప్రయాణం చేసే పరిస్థితి ఉంది. నిత్యం మంగపేట, మర్రిబంధం, గౌరీ నగర్, చీపురుగూడెం వాసులు ఎక్కువగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఇరుకు వంతెన వల్ల ఆర్టీసీ బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో సుమారు 6 కిలోమీటర్లు నడిచి వంతెన దాటి మంకొల్లు వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాలు వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో వ్యవసాయ ఉత్పత్తులు రవాణా కూడా ఇబ్బందిగా మారింది. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్లే మా గ్రామంలో వెనుకబడి ఉన్నాయని దీనికి పాలకులే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల నుండి ఉంటున్న వెడల్పు కోసం పోరాటం చేస్తున్నామని పట్టించుకునే నాధుడే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నూజివీడు ఎమ్మెల్యేగా విజయం సాధించిన కొలుసు పార్థసారథి మంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజలలో వంతెన వెడల్పు జరుగుతుందనే ఆశ మొదలైంది. అయితే స్థానిక నాయకులు వంతెన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా మంత్రి స్పందించి వంతెన వెడల్పుకు చేసేందుకు పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు వంతెన వెడల్పు చేసేందుకు అవకాశం లేదని మంత్రికి చెప్పటంతో కొత్త వంతెన నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాలు జారీ చేసి ఆరు మాసాలు పూర్తయినప్పటికీ వంతెన నిర్మాణం ఎంతవరకు వచ్చిందో ఎవరికీ తెలియని పరిస్థితి ఏర్పడింది. మంత్రి పార్థసారథి దీనిపై ప్రత్యేక దృష్టి సారించి వంతెన నిర్మాణానికి శ్రద్ధ చూపాలని పలువురు కోరుతున్నారు.

**మంత్రి దృష్టిలో ఉంది : లక్ష్మణరావు**

చీపురుగూడెం మరియు శివారు గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే పూర్తి చేస్తారని చీపురుగూడెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఇబ్బందుల నుండి విముక్తి ఎప్పుడో : జగదీష్**

నాలుగు దశాబ్దాలుగా పడుతున్న ఇబ్బందుల నుండి విముక్తి ఎప్పుడు వస్తుందో అనే ఎదురుచూస్తున్నామని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మందలపు జగదీష్ అన్నారు.

# శ్రీ మత్స్య నారాయణస్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహణ

**మొగల్తూరు జూన్ 7 (ప్రభాతవార్త)** పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి కనకదుర్గ బీచ్ లో వెలసి ఉన్న శ్రీ మత్స్య నారాయణ స్వామి వారి ఆలయం నందు శనివారం ఉదయం పేరుపాలెం వాస్తవ్యులు కొప్పడి నరసింహారాజు (జోగిరాజు) మూలావతి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం ఆలయ ఆవరణలో భారీ అఖండ అన్న సమారాధన నిర్వహించారు, ఈ అన్న సమారాధనకు పలు గ్రామాల నుండి భక్తులు తరలివచ్చి అన్న సమారాధన స్వీకరించారు, కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యములు కలుగకుండా దగ్గరుండి చూసుకున్నారు

# ఈడూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో సదస్యం.

**అత్తిలి - జూన్ 7 ( ప్రభాత వార్త ):** అత్తిలి మండలం ఈడూరు గ్రామంలో గల వరాల వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణోత్సవాలు సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ , మేలుకొలుపు , తోమాల సేవ ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైఖానస పండితులచే వేదపారాయణం నిర్వహించారు. అల్లూరి సత్యనారాయణరాజు , మీనాక్షి దంపతులు పండితులను సత్కరించారు. ధర్మవరపు శంకరరావు , వెంకట రమణ దంపతులు వస్త్రాలు సమర్పించారు. మంతెన సీతారామరాజు దంపతులు సమర్పించిన సింహ వాహనంపై సింహ వాహన సేవా కార్యక్రమం నిర్వహించారు. దండు శ్రీనివాసరాజు



దంపతుల సహకారంతో వెంకటేశ్వర సంబరాన్ని నిర్వహించారు. శనివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ వారు అన్న సమారాధన చేసారు.



# కటిక నేలపై గురకలు వినరా......

ఫోటో ప్రభాతవార్త..నరసాపురం

# విజ్ఞానం పంచిన గ్రంధాలయ వేసవి శిబిరం

## డాక్టర్ చినిమిల్లికి ఘన సత్కారం

## లైబ్రేరియన్ దంపతుల కృషికి అభినందన









**నరసాపురం.... ప్రభాత వార్త :** స్థానిక శాఖ గ్రంథాలయంలో రోజులు పాటు జరిగిన విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు దాదాపు 40 అంశాలపై రిసోర్స్ పర్సన్స్ ఎంతో శ్రద్ధగా అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ కే జి ఎస్ ఎల్ కుమారి ఆమె భర్త సూర్యం బాబు ఇరువురు కుమారులు సైతం ఈ శిబిరాన్ని జయప్రదం చేయడంలో విశేష కృషి చేశారు. ముగింపు సందర్భంగా వారందరినీ నిర్వాహకులు సత్కరించారు. వైన్ కళాశాలకు విద్యాపరంగా విశేష సేవలు అందించిన డాక్టర్ చిరుమిల్లి సత్యనారాయణ ముగింపు కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ కనకారావు పూర్వ సైంటిస్ట్ రంగనీడి సుబ్బారావు చక్రవధాన్ల రెడ్డప్ప దవీజీ ఎం సుధీర్ మోహన్ ఎస్ రాజ్యలక్ష్మి కౌన్సిలర్ అరుణ ఆత్మూరి రమ న్యాయవాది ఎర్రంశెట్టి ఫణి మ్యాథ్స్ టీచర్ శ్రీనివాస్ బాబు శ్రీ ఎంఈఓ పుష్పరాజ్యం భట్టిప్రోలు సత్యనారాయణ ఓఎన్జిసి కాంట్రాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్స్ సత్కరించారు. పాల్గొన్న విద్యార్థులందరికీ రెండు మూడు బహుమతులు రావడం విశేషం.

# ఏఐటీయూసీ మండల మహాసభను విజయవంతం చేయండి

**వేలేరుపాడు, జూన్ 7, ప్రభాత వార్త :** వేలేరుపాడు మండలం బుర్రతోగు గ్రామంలో శనివారం కరటం సీతామహాలక్ష్మి అధ్యక్షతన ఏఐటీయూసీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ మండల కార్యదర్శి కారం దారయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జూన్8 వ తేది ఆదివారం ఉదయం పది గంటలకు కన్నాయిగుట్ట గ్రామంలో ఏఐటీయూసీ మండల మహాసభ నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభకు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు పాల్గొంటున్నారు అని కావున ఈ మహాసభకు అంగన్వాడి, ఆశ, మిడ్ డే మిల్స్,కారు డ్రైవర్లు అధిక సంఖ్యలో హాజరై ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ



సమావేశంలో ఏఐటియుసి అంగన్వాడి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కౌలూరి సైదా,ఏఐటీయూసీ అంగన్వాడి మండల కార్యదర్శి చందా రమాదేవి,సరియం విమల ,కారటం పాపమ్మ తదితరులు పాల్గొన్నారు

డీసీసీబీ ఛైర్మన్ గా నరసాపురం తొలిసారిగా విచ్చేసిన రాష్ట్ర జనసేన కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, చిన్న కు నర్సాపురం నియోజకవర్గ ప్రజలు స్వాగతం పలికారు. బొకేలు పూలదండలతో ముంచేత్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయకర్ తో పాటు నాయకులు రామరాజు కొత్తపల్లి సుబ్బారాయుడు బండారు మా ధవనాయుడు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.
ప్రభాతవార్త నరసాపురం



# గోవింద నామ స్మరణతో మారుమోగిన గోకుల తిరుమల పారిజాత గిరి



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం పట్టణంలోని గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం లో శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు వేకుజము నుండి బారులు తీరి స్వామి వారిని దర్శించుకున్నారు. పలు పూజ కార్యక్రమాలు జరిగాయి. ప్రతి శనివారం దాతల సహకారంతో ఉచిత అన్న ప్రసాద వితరణ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈరోజు ఉచిత అన్న ప్రసాద వితరణ దాతలుగా బుట్టాయిగూడెం మండలం సూరప వారి గూడెం వాస్తవ్యులు పరిమి మురళీకృష్ణ,జ్యోతి కుటుంబ సభ్యులు, మల్లుకుంట వాస్తవ్యులు నర దేవి నరసింహారావు కుటుంబ సభ్యులు అన్నదాతలుగా వ్యవహరించారు. దాతలను ఆలయ అర్చకులు నల్లూరి ఋషికేష్ చార్యులు, కుమార్ చార్యులు, రాఘవాచార్యులు ఆలయ మర్యాదలతో సన్మానించారని ఆలయ కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు, రెడ్డి రంగ ప్రసాద్,వాసవి సాయి నగేష్,తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిగూడెంలో బక్రీద్ వేడుకలు



జంగారెడ్డిగూడెం,ప్రభాత వార్త: జంగారెడ్డిగూడెం పట్టణంలో శనివారం ముస్లిం సోదరులు బక్రీదు పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక ఈద్ గా మైదానంలో బిలాల్ మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ యాకూబ్ ఆధ్వర్యంలో జరిగిన ప్రార్థనలలో ముస్లిం మత గురువు షేక్ నజీర్ నమాజు చదివించారు. ఈ కార్యక్రమంలో బిలాల్ మసీదు కమిటీ ప్రెసిడెంట్ షేక్ యాకూబ్, షేక్ బాజీ (టిప్ టాప్ బాజీ) షేక్ ముస్తఫా,షేక్ అక్బర్,ఎస్ కె మస్తాన్,సయ్యద్ అన్వర్,అల్లావుద్దీన్, ఆరీఫ్,పఠాన్, పర్వేస్,షేక్ అమర్,ఎండి రఫీ , సయ్యద్, అమీరుద్దీన్,షేక్ సలీం, ఏఎస్ఐ దాదా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెంలో ఎస్ ఐ జబీర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ఏలూరు జిల్లాలో తహసీల్దార్లు బదిలీలు

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: ఏలూరు జిల్లాలో జనరల్ ట్రాన్స్ఫర్ సందర్భంగా ఐదుగురు తహసీల్దార్లు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి శనివారం బదిలీ చేశారు. కొయ్యలగూడెం తహసీల్దార్ కె.చెల్లన్న దొరను ఏలూరు కలెక్టరేట్ లోని కోఆర్డినేషన్ సెక్షన్ కు సూపరిడెంటెంట్ గా బదిలీ చేశారు. ఏలూరు అర్బన్ స్పెషల్ తహసీల్దార్ (ఏఓఎల్ఆర్) జి విజయకుమార్ రాజును ఏలూరు రూరల్ తహసీల్దార్ గా నియమించారు. ఏలూరు కలెక్టరేట్ సూపరింటెండెంట్ పి రవికుమార్ ను స్పెషల్ తహసీల్దార్ (ఏ ఒ ఎల్ ఆర్) ఏలూరుకు మరియు సూపరింటెండెంట్,మెజిస్ట్రేరియల్ సెక్షన్ కు బదిలీ చేశారు. ఎండి నజీర్ ముల్లాషా సూపరింటెండెంట్ ల్యాండ్ మ్యాటర్స్ సెక్షన్ కలెక్టరేట్ ఏర్పాటులో డిప్యూటేషన్ పనిచేస్తున్న వీరిని లింగపాలెం తహసీల్దార్ గా జీవి శేషగిరి తాహసీల్దార్ ఏలూరు అర్బన్ ను సూపరింటెండెంట్ ల్యాండ్ మ్యాటార్స్ సెక్షన్ కలెక్టరేట్ ఏలూరుకు బదిలీ చేశారు.

# చిన్నారుల కిడ్డీబ్యాంక్ డబ్బులతో మజ్జిగ చలివేంద్రం

జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెంలో అశ్వారావుపేట రోడ్లో ఉన్న యన్.టి.ఆర్ సర్కిల్ నందు శనివారం ముగ్గురు చిన్నారులు కలిసి బాటసారులకు చల్లని మజ్జిగ అందజేసారు. పట్టణానికి చెందిన తాటికొండ సాయిబాబు లక్ష్మీకాంతం దంపతుల మనువలు మనవరాండ్లు రష్మిత, కార్తికేయ, గీతాన్ష్ లు వేసవి సెలవులకు నాయనమ్మ,తాతయ్యల ఇళ్ళకు వచ్చారు. సహజంగానే సేవాభావం కలిగిన తాతయ్య సాయిబాబుకు తమ కిడ్డీబ్యాంక్ డబ్బులను చూపించి మేము కూడా సేవా కార్యక్రమాలు చేస్తాము అని కోరారు. అశ్వారావుపేట రోడ్లో సుబ్రహ్మణ్యేశ్వర అన్నప్రసాద వితరణ కమిటీ చేసే సేవా కార్యక్రమాలు గురించి విన్న సాయిబాబు అక్కడ కమిటీవారిని సంప్రదించారు. సుమారుగా పదివేల రూపాయల ఖర్చుతో కూడిన విషయం అందులోనూ సహకరించే వ్యక్తులు కావలసిరావటంతో అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షులు గండికోట బాబి కమిటీ సభ్యులు అందరినీ సమన్వయ పరిచారు, ఐదువేల మంది బాటసారులకు చల్లటి మజ్జిగ అందించారు. చిన్నారులైన రష్మిత, కార్తికేయ, గీతాన్ష్ లను పలువురు అభినందించారు. చిన్నవయస్సు నుండే సమాజహితం అలవరిచిన తాటికొండ సాయిబాబు, లక్ష్మీకాంతం దంపతులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గండికోట బాబి, మాడా ప్రవీణ్, చిట్లూరి వేంకటేశ్వరరావు, నాగు, రోహిణి, మణిబాబు, వంశీ, పవన్,రవీంద్ర రెడ్డి, భవానీ ప్రసాద్ , నాగసూరి వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్లు సమర్థవంతంగా పనిచేయాలి



భీమవరం జూన్ 6 ప్రభాతవార్త : ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు నూతన పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు భీమవరం నియోజకవర్గ ఇంచార్జ్ తోట సీతారామలక్ష్మీ,పశ్చిమగోదావరి జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజులు శుక్రవారం విజయవాడలోని బూరుగుపల్లి శేషారావు, గన్ని వీరాంజనేయులు లను వారి కార్యాలయాలలో స్వయంగా కలిసి పుష్పగుచ్చలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో కుటమి అభ్యర్థుల సర్దుబాటులో తమ సీట్లను త్యాగం చేసిన బూరుగుపల్లి శేషారావు, గన్ని వీరాంజనేయులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ బాధ్యతయుతమైన పదవులను కేటాయించడం అభినందనీయమన్నారు. కార్పొరేషన్ చైర్మన్లు సమర్థవంతంగా పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

## ఒక్కరోజు కాకుండా మన ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజు యోగ చేయాలి

భీమవరం జూన్ 7 ప్రభాతవార్త : ఒక్కరోజు కాకుండా మన ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజు యోగ చేయాలని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, కుక్కల బాల అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం యోగపై అవగాహన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిపూర్ణ ఆరోగ్యానికి యోగ ఒక్కటే సాధనమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలరోజులపాటు యోగాపై శిక్షణ అందిస్తూ యోగాంధ్ర కార్యక్రమాలను చేపడుతుందని, 9న భీమవరం లో అల్లూరి స్మృతి వనం వద్ద ర్యాలీ యోగాసనాలు జరుగుతాయని, ఈనెల 21న భీమవరంలో జరిగే యోగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలనీ కోరారు.

# శ్రీమద్ది ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త: గుర్వాయిగూడెం గ్రామంలో శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయము వద్ద ప్రతి శనివారం నిర్వహించు అభిషేక సేవ సందర్భముగా ఆలయ ముఖమండపంపై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం నిర్వహించారు. ఈరోజు శలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం వద్ద పలువురు భక్తులు దాహార్తి తీర్చుకొన్నారు. మద్యాహ్నం వరకు దేవస్థానమునకు వివిధ సేవల, విరాళాల ద్వారా రూ. 1,62,643లు సమకూరినది. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. శ్రీస్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా తగిన ఏర్పాట్లు గావించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి. చందన తెలిపారు.



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్ ఆప్కబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు నియమితులైన సందర్భంగా, ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ గౌరవప్రదంగా ఆయన కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభాతవార్త నరసాపురం**

# విష్ణు కుమార్ రెడ్డికి గ్లోబల్ పీస్ ఇంటర్నేషనల్ అవార్డు


పెనుమంట్ర, జూన్-07, ప్రభాతవార్త: మండలంలోని వనంపల్లి గ్రామానికి చెందిన సత్తి విష్ణు కుమార్ రెడ్డి కి ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ 9 సంవత్సరాల వార్షికోత్సవం సందర్భంగా గ్లోబల్ పీస్ ఇంటర్నేషనల్ అవార్డును ఇంటర్నేషనల్ మనం ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ కె చక్రవర్తి సోషల్ మీడియా ద్వారా పంపించారు. విష్ణు కుమార్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఆయన తనయ హర్షితా రెడ్డికి ఈ అవార్డుల ను (మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ) ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి మదర్ థెరీస్సా హెల్పింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డా. సాక రాజు ఎంపిక చేసి ఈ అవార్డులను అందించారు.

# చచ్చేంత నిర్లక్ష్యం...,

## విద్యుత్ స్టార్టర్ బాక్స్ తో పిల్లలు చెలగాటం,



జీలుగుమిల్లి, జూన్-05, ప్రభాతవార్త: మండలంలోని వేలేరుపాడు మండలం వీలిన గ్రామమైన బుర్రెడ్డిగూడెం కాలనీ బోరుకు ఉన్న స్టార్టర్ బాక్స్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. కాలనీ గిరిజనులకు ట్యాంకు లేకపోవడంతో బోరు దగ్గరే ఉన్న పెద్ద తొట్టెలో నీళ్లు పట్టుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు. నీళ్ల అవసరమైనప్పుడల్లా పిల్లలు పుల్లలతో బోరు ఆన్ చేయడం, ఆఫ్ చేయడం చేస్తున్నారు. పైగా స్తంభ నుండి స్టార్టర్ బాక్స్ కు వచ్చే సర్వీస్ వైరు రెండు చోట్ల ప్లాస్టర్ వేయకుండా ముడి వేసి వదిలేసారు. తరచూ నీళ్ల అవసరం కోసం, కాలనీవాసులు, పిల్లలు కూడా స్టార్టర్ బాక్స్ వద్దకు వెళ్లి మోటార్ ఆన్, ఆఫ్ చేస్తున్నారు. రానున్నది వర్షాకాలం విద్యుత్ షాక్ వల్ల జరగరానిది ఏదైనా జరిగితే ప్రాణాలు పోయే పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించ గలరు.



# పాక ను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు



భీమవరం జూన్ 6 ప్రభాతవార్త :మేధావుల సభకు దశాబ్దాల కలల అనుభవం కలిగిన వ్యక్తి పాక సత్యనారాయణ వెళ్ళడం మన భీమవరం జిల్లాకే గర్వకారణమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కొత్త శ్రీనివాస్ అన్నారు. రాజ్యసభ సభ్యునిగా పాక సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేసిన భీమవరం వచ్చిన సందర్భంగా మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాల సేవలకు ఫలితం దక్కిందని, రాజకీయ మేధావికి సరైన పదవి లభించిందన్నారు. ఇటువంటి పదవికి ఆయనే అర్హుడని భారతీయ జనతా పార్టీ గుర్తించిందని, మేదావుల సభ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎంపిక చేసిందని, ఈ పదవికి ఆయనే సరైనోడని ఆయన అభిమానులే కాదు అన్ని రాజకీయ పక్షాలు, మేధావుల వర్గాలు కూడా నొక్కి వక్కాణిస్తున్నాయని అన్నారు. రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ మీ ఆదరణ ఆప్యాయత ఎప్పటికీ మరవలేనని అన్నారు. కార్యక్రమం లో కారుమూరి సత్యనారాయణ, చవ్వ భామ కృష్ణ మూర్తి, కురిశెట్టి కాశి, బొద్దు వాసు, కోట్ల నాని, పులవర్తి రామకృష్ణ, బంగారు రాము, కనగర్ల కిషోర్, తటవర్తి బధరి, సభ్యులు పాలుగొన్నారు అనంతరం సత్యనారాయణను సత్కరించారు.

# జిల్లా, నియోజకవర్గాల అభివృద్ధిపై కార్యాచరణ

## ప్రణాళికలు వెంటనే సమర్పించండి

**ఏలూరు, ప్రభాతవార్త:** ఏలూరు జిల్లాను రాష్ట్రస్థాయిలో అభివృద్ధిపథంలో నిలిపేవిధంగా ఏలూరు జిల్లా మరియు నియోజకవర్గాల వారీగా అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధిపై కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా వృద్ధి రేటు లక్ష్యంగా జిలాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాలలోను మరియు జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామికాభివృద్ధి, తదితర రంగాలలో సుస్థిరాభివృద్ధికి నిర్దేశించిన లక్ష్యాలతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి సమర్పించాలన్నారు. జిల్లాలో విస్తృతంగా లభిస్తున్న వనరులు, ఆహార, ఉద్యానవన రంగాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు అనుకూల పరిస్థితులు, తదితర అంశాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. జిల్లా, నియోజకవర్గాల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులకు సమర్పించవలసి ఉన్నందున ప్రణాళికలను వెంటనే రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, జిల్లా సహకార అధికారి ఏ . శ్రీనివాస్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, డిఎస్ఓ శివరామమూర్తి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాథ్ బాబు,మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడి రవికుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

# మావుళ్ళమ్మను దర్శించుకున్న సినీ నటి అనన్య



భీమవరం జూన్ 7 ప్రభాతవార్త :భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారిని సినీనటి అనన్య నాగెళ్ల దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనం ప్రసాదాలు అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆధ్వర్యంలోకార్యక్రమం జరిగింది.


# లక్ష మల్లె పువ్వులతో శారదమాతకు అలంకరణ



భీమవరం జూన్ 7 ప్రభాతవార్త :భీమవరం రెస్ట్ హౌస్ రోడ్ లో వేంచేసి యున్న శంకరమఠం శారదాపీఠంలోని శారదమాత అమ్మవారికి లక్ష మల్లె పువ్వుల పూజ నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, భ్రమరాంబ దంపతులచే ఆలయ అర్చకులు ఘంటసాల దీక్షిత్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను అభిషేకాలను నిర్వహించారు. అనంతరం లక్ష మల్లెలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో మహిళ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# 40సంవత్సరాలుగా పార్టీకి సేవ చేశా అన్యాయం చేశారు

చాట్రాయి, జూన్ 7,ప్రభాతవార్త : గత 40 సంవత్సరాలుగా పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీ కష్టకాలంలో తోడుగా ఉంటూ వస్తున్న నాకు అన్యాయం చేసారని అరుగొలనుపేట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఇజ్జిగాని చెన్నారావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు పదవి కోసం అందరూ సమిష్టిగా గ్రామ కార్యకర్తలు నాయకులు అందరూ కలిసి ఎన్నుకున్నప్పటికీ మండలంలోని ఒక సీనియర్ నాయకుడు తనపై మంత్రి పార్ధసారధి కి తప్పుడు సమాచారం ఇచ్చి అధ్యక్ష పదవి రాకుండా చేశారని ఆయన ఆరోపించారు. గతంలో రెండుసార్లు



గ్రామ పార్టీ అధ్యక్ష పదవి చేసినటువంటి వ్యక్తికి మరల ఇవ్వాలని చెప్పి అధిష్టానానికి తప్పుడు రిపోర్టు చెప్పి గ్రామ పార్టీ కార్యకర్తలు, గ్రామ పార్టీ సీనియర్ నాయకులు అందరూ కలిసి ఎన్నుకున్నటువంటి తనను కాదని మళ్లీ అదే వ్యక్తికి పార్టీ పదవి కట్టబెట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో పార్టీ కుటుంబ సభ్యులలోనే వివాదాలొచ్చిన సమయంలో కూడా పార్టీకి నష్టం జరుపుకుండాం సమస్యను పరిష్కారం చేయటంలో తాను కీలకపాత్ర వహించానని ఈ విషయం గ్రామంలో అందరికీ తెలుసు అని చెప్పారు. పార్టీ కార్యకర్తల కుటుంబాలను సొంత కుటుంబంగా భావించి వివాదాలు వస్తే పార్టీలు మారతారని భావించి వారి సమస్యలను పరిష్కరించి ఒకతాటిపై నడిపానని అని చెప్పారు. ఈ విధంగా పార్టీ కోసం రాత్రి పగలు కష్టపడిన రోజులు ఎన్నో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం పార్టీలో జరిగిన అన్యాయానికి బాధపడుతున్నానని మా కుటుంబ సభ్యులు మరియు అనుచరులతో సమావేశం జరపి ఒక నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఆ నిర్ణయాన్ని అందరూ గౌరవిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా మంత్రి కొలుసు పార్థసారథి ఒకసారి విశ్లేషించుకొని వేరే గ్రామాల్లో ఇలా జరగకుండా పార్టీకి పార్టీ భవిష్యత్తుకి ఉపయోగపడేటట్లు జాగ్రత్త తీసుకోవాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు.

# వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపనలు

## -మేడేపల్లి,రామవరం పంచాయతీలలో తీరనున్న నీటి కష్టాలు



వేలేరుపాడు, జూన్ 7, ప్రభాత వార్త : మేడేపల్లి,రామవరం పంచాయతీలలో అల్లూరునగర్,ఇప్పలగుంపు,మల్లారం, చెరువుగొల్ల గూడెం,తెలపల్లి గ్రామాలలో సుమారు కోటి రూపాయలతో గిరిజనుల తాగునీటి సమస్యను పరిష్కరించడానికి వాటర్ ట్యాంకులకు ఎంపీడీవో శ్రీహరి రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్ జనసేన మండల అధ్యక్షులు గణేషుల ఆదినారాయణ మేడేపల్లి సర్పంచ్ రాంబాబు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గుజ్జ.రామలక్ష్మి,ఎంపీపీ వాళ్ళ లక్ష్మీదేవి, ఆర్డబ్ల్యూస్ ఏఈ జగదీష్, బిజెపి మండల అధ్యక్షులు ఓలేటి బాలకృష్ణ, సిరికొండ రామారావు, బుడుపుటి సురేష్, దేవిరెడ్డి సుధాకర్, కొవ్వాల.క్రాంతి కుమార్, సారె బాబ్జి, యాళ్ల.శంకరం, ఎండి నాయీమ్ కూటమి నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# వేలేరుపాడు నూతన ఎస్సైగా నవీన్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



వేలేరుపాడు, జూన్ 7,ప్రభాత వార్త :వేలేరుపాడు మండలంలోని ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావు బదిలీపై వెళ్లగా నూతన ఎస్సైగా శనివారం పి నవీన్ కుమార్ బాధ్యతలను స్వీకరించారు. నూతన ఎస్సై పి నవీన్ కుమార్ జీలుగుమిల్లి పిఎస్ లో ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించి వేలేరుపాడు మండలానికి బదిలీపై రావడం జరిగింది. మండలంలోని ప్రజలకు ఎటువంటి సమస్యలున్న ధైర్యంగా పోలీస్ స్టేషన్ కు రావచ్చు అని వచ్చినవారికి న్యాయం జరుగుతుంది అని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠిన వైఖరి ఉంటుందని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పి నవీన్ కుమార్ కు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు.

# బల్లిపాడు లో వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాలు .

అత్తిలి - జూన్ 7 ( ప్రభాత వార్త ): అత్తిలి మండలం బల్లిపాడు గ్రామములో గల మదన గోపాలస్వామి వారి ఆలయంలో ఉపాలయముగా ఉన్న వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవములు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భములో రాత్రి .7 గంటల కు గరుడ వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణము జరుగుతుంది. ఈ ఉత్సవాలు ఈ నెల 11 వరకు జరుగుతాయి. భక్తులు ఈ ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లింగంపల్లి లోకనాధ శ్రీనివాసరావు తెలిపారు.

# జంతువధకి వ్యతిరేకంగా ర్యాలీ.



అత్తిలి - జూన్ 7 ( ప్రభాత వార్త ): బక్రీద్ సందర్భంగా ఆవులు , దూడలు , ఒంటెలను వధించటం నిషేదించినందున జంతు వ ధ కు వ్యతిరేకంగా అత్తిలి లో ర్యాలీ ని నిర్వహించారు. అత్తిలి ఎంపిడిఓ కార్యాలయం నుండి బస్సు స్టాండ్ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. అత్తిలి ఎంపిపి మక్కా సూర్యారావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గోవధ నిషేధ చట్టం , జంతు సంరక్షణ చట్టం ప్రకారం చుడి పశువులను , 3 నెలలు కంటే తక్కువ వయస్సు ఉన్న దూడలను వధించరాదన్నారు. పశువులను రవాణా చేసేటప్పుడు అధికారి ధ్రువీకరణ తప్పని సరన్నారు ప్రత్యేకంగా లైసెన్సు పొందిన వాహనాలలో రవాణా చేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు జంతు వ ధ జరగకుండా పర్యవేక్షించాలన్నారు . ర్యాలీ లో మండల టీడీపీ అధ్యక్షుడు అనాల ఆదినారాయణ రావు, మాజీ ఎంపిపి కేతా సత్యనారాయణ ,జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్ కుమార్ , కొరిపల్లి హరి తదితరులు పాల్గొన్నారు .

# యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలి

ఏలూరు, **ప్రభాతవార్త:**జిల్లాలో యోగాను ప్రజలకు మరింత చేరువ చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో శనివారం జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు అందించే యోగ మరింత మంది ప్రజలు సద్వినియోగం చేసుకునేలా పెద్దఎత్తున ప్రజలు యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 9వ తేదీ ఉదయం 7 గంటలకు ఏలూరులో సి ఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుండి ఇన్డోర్ స్టేడియం వరకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా ఈనెల 10వ తేదీన జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి గుడి వద్ద, 18వ తేదీన జీలకర్రగూడెంలోని గుంటుపల్లి గుహల వద్ద యోగాభ్యాసన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా ఈనెల 13 వతేదీన ఏలూరులోని సర్ సి.ఆర్.రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్స్ లో జిల్లా స్థాయిలో యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు హాజరవుతారని, ఈ కార్యక్రమాలలో ప్రజలు పెద్దఎత్తున బాగస్వాములయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, కార్యక్రమాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్, ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, జిల్లా సహకార అధికారి ఏ . శ్రీనివాస్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎస్సి కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి, వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, డిఎస్ఓ శివరామమూర్తి, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాథ్ బాబు,మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడి రవికుమార్, డిఎస్ డి ఓ శ్రీనివాసరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

# 'కుబేర' నాగార్జున డబ్బింగ్ పూర్తి

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న, హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియా మూవీ శేఖర్ కమ్ముల కుబేర. అద్భుతమైన తారా గణంతో కుబేర ఇండియన్ సినిమాలో గేమ్‌ఛేంజర్‌గా నిలవబోతోంది. కుబేర మూవీ జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా కింగ్ నాగార్జున కుబేరకు తన డబ్బింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా డబ్బింగ్ స్టూడియోలో నాగార్జున, శేఖర్ కమ్ముల, నిర్మాత పుష్కర్ రామోహన్ కలసి మాట్లాడుతున్న ఫోటోలని మేకర్స్ షేర్ చేశారు. ఇప్పటికే విడుదలైన కుబేర ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. పోయిరా మామ, ట్రాన్స్ ఆఫ్ కుబేర చార్ట్ బస్టర్ రెస్పాన్స్ తో మ్యూజిక్ చార్ట్స్ లో టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. ప్రమోషనల్ కంటెంట్‌తో కుబేర మీద ఉన్న హైప్ నెక్స్ట్ లెవెల్‌కి చేరుకుంది. క్యారెక్టర్ బేస్డ్ నరేటివ్స్ తో అదరగొట్టే శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని నెవర్ బిఫోర్‌గా తీర్చి దిద్దారు, ఇది ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. కుబేర తెలుగు, తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



# 'మై లవ్' వీడియో సాంగ్ గ్రాండ్ లాంచ్

ప్రతిష్టాత్మక మెగా సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో కిషోర్ తేజా, సాత్విక లీడ్ రోల్స్‌లో నటించిన మై లవ్ ఆల్బమ్ సాంగ్ గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. ఎస్‌కెటి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో వాకాడ అప్పా రావు నిర్మించిన ఈ ఆల్బమ్ ప్రేక్షకుల మనసులను హత్తుకునే భావోద్వేగంతో కూడిన సంగీతం, రిఫ్రెషింగ్ విజువల్స్‌తో అదిరిపోయింది. ఈ సాంగ్‌కి సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించగా, క్రాంతి ఆచార్య మనసుని కదిలించే సంగీతాన్ని అందించారు. కపిల్ కపిలన్ అద్భుతంగా ఆలపించిన ఈ పాట మ్యూజికల్ లవర్స్‌ని మెస్మరైజ్ చేసింది. కిషోర్ తేజా, సాత్విక కెమిస్ట్రీ లవ్లీగా వుంది. రామ్ రెడ్డి పన్నాలా కాన్సెప్ట్, డైరెక్షన్ హార్ట్ టచ్చింగ్‌గా వుంది. జయపాల్ రెడ్డి నిమ్మల సినిమాటోగ్రఫీ విజువల్స్ ట్రీట్ ని అందించాయి. ఈ సాంగ్ ఇన్‌స్టంట్‌గా వైరల్ అయ్యింది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో కిషోర్ తేజ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మా డైరెక్టర్ రామ్ రెడ్డి ఈ పాట కోసం సినిమా స్థాయిలో కష్ట పడ్డారు. చాలా అద్భుతంగా చేశారు. మా డీవోపీ జయపాల్ రెడ్డి చాలా హార్డ్ వర్క్ చేసి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. మేమంతా ఒక టీంగా ఈ సాంగ్‌ని చేయడం జరిగింది. అందుకే ఇంత అద్భుతంగా వచ్చింది. ఈ పాట తెలుగు తమిళ్ హిందీ మూడు భాషల్లో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. క్రాంతి చాలా అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. పాట చూసి ఎలా ఉందోఆడియన్స్ డిసైడ్ చేయాలి. మా టీంకి మీడియా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. మా నిర్మాత వాకాడ అప్పారావు చాలా సపోర్ట్ చేశారు. వారి సపోర్ట్‌తోనే సాంగ్ ఇంత అద్భుతంగా వచ్చింది. చాలా మంచి సాంగ్ ఇది. ఆడియన్స్ అందరూ చూసి లైక్ షేర్ సబ్స్క్రైబ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు. యాక్టర్ రమణ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. కిషోర్‌ని వెండితెరపై మీద హీరోగా చూడాలనిపిస్తుంది. ఆయన అవకాశం ఇస్తే ఆయన హీరోగా నేను విలన్‌గా చేస్తాను. ఇది సాంగ్ లాగా లేదు. ఒక సినిమా లాగా ఉంది. కథంతా ఈ సాంగ్‌లో చూపించారు. మ్యూజిక్ కెమెరా ఎడిటింగ్ అన్ని అద్భుతంగా ఉన్నాయి. పాటని హిట్ చేసి టీమ్ అందర్నీ ఎంకరేజ్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు డైరెక్టర్ తరుణ్ భాస్కర్



మదర్ గీత మాట్లాడుతూ, అందరికి నమస్కారం. పాట చాలా మెలోడీస్‌గా ఉంది. అద్భుతమైన ఎమోషన్ ఉంది. సాత్విక కిషోర్ వండర్ఫుల్ పర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ పాట వినండి. వింటూనే ఉంటారు అన్నారు. దివి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. కాన్సెప్ట్ చాలా బ్యూటిఫుల్‌గా ఉంది. సాత్విక తేజ చాలా బ్యూటి ఫుల్‌గా ఉన్నారు. తప్పకుండా అందరూ సాంగ్ వినండి అన్నారు. సాత్విక మాట్లాడుతూ, అందరికి నమస్కారం. స్క్రీన్ మీద నన్ను నేను చూసుకోవడం ఫస్ట్ టైం. మా టీంకి థాంక్యూ అన్నారు.

# నేడు 'డకాయిట్' క్రూషియల్ షెడ్యూల్ షురూ

అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో అదిరిపోయింది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమా ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా అడివి శేష్ డకాయిట్ కోసం డబ్బింగ్ టెస్ట్ పూర్తి చేశారు. దీనికి సంబధించిన ఫోటోని షోషల్ మీడియాలో షేర్ చేశారు. అలాగే టీం జూన్ 8 నుంచి క్రూషియల్ షూటింగ్ షెడ్యూల్‌ని ప్రారభించనున్నారు. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలని చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మాతగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం ఈ క్రిస్మస్, డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ విడుదల కానుంది. ఈ హాలిడే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోందని చెప్పడం ఎలాంటి సందేహం లేదు. శేష్‌కు ఇది తొలి హాలిడే రిలీజ్ కావడం విశేషం.





మెహ్రీన్ నయా లుక్

# 'బిగ్‌బాస్' ఫేమ్ శుభశ్రీ నిశ్చితార్థం

ప్రముఖ నిర్మాత అజయ్ మైసూర్, నటి, బిగ్ బాస్ 7 ఫేమ్ శుభశ్రీ నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖల నటులు సాయికుమార్, యువ హీరో సోహైల్, బిగ్ బాస్ షో కంటెస్టెంట్స్‌తో పాటు పలువురు సెలబ్రిటీలు పాల్గొని ఈ నూతన జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంగేజ్ మెంట్, మెహందీ, సంగీత్, రిసెప్షన్ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో అజయ్ మైసూర్, శుభశ్రీ కలిసి చేసిన మెజెస్టీ ఇన్ లవ్ సాంగ్‌ను లాంచ్ చేశారు. సాయి కుమార్ వాయిస్‌తో ఈ పాట ప్రారంభం కావడం ఆకర్షణగా నిలిచింది. మెజెస్టీ ఇన్ లవ్ సాంగ్‌ను సిద్ధార్థ్ వాట్కిన్స్ స్వరపర్చి సింగర్ సాహితీ చాగంటితో కలిసి



పాడారు. ఈ పాట రూపకల్పన సమయంలోనే వీరి మనసులు కలిసి ప్రేమించుకున్నారు. వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టాలని నిశ్చయించుకు న్నారు. జూలైలో అజయ్ మైసూర్, శుభశ్రీ వివాహం ఆస్ట్రేలియాలో జరగ నుంది. ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో సాయి కుమార్ మాట్లాడుతూ, అజయ్ మైసూర్ నాకు మంచి మిత్రులు. మా ఇంటికి వచ్చి వారి ఎంగేజ్ మెంట్ కోసం ఆహ్వానించారు. ఈజంట చిరకాలం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా అని శుభాకాంక్షలు అందజేశారు. హీరో సోహైల్, బిగ్ బాస్ కంటెస్టెంట్స్ ఫ్రెండ్స్, ఇతర సెలబ్రిటీలు ఈ ఎంగేజ్ మెంట్ వేడుకల్లో సందడి చేశారు. మెజెస్టీ ఇన్ లవ్ సాంగ్‌కు పనిచేసిన టీమ్ కూడా ఈ వేడుకల్లో పాల్గొని పాట పాడి వీక్షకులను అలరించారు. ప్రొడ్యూసర్ అజయ్ మైసూర్ అజయ్ మైసూర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై అమ్మరాజ్యంలో కడప బిడ్డలు, టెన్త్ క్లాస్‌డైరీస్ వంటి చిత్రాలతో పాటు పలుషార్ట్‌ఫిలింస్, 50కిపైగా మ్యూజిక్ అల్బమ్స్‌లో నటించారు.

# 'ఘాటి' కోసం అనుష్క సెంటిమెంట్ బ్రేక్ చేస్తుందా..

టాలీవుడ్ స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఘాటి ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేస్తుండటంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగాయి. ఇక ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ అంచనాలను రెట్టింపు చేశాయి. అయితే, ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను కూడా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. జూలై 11న ఘాటి చిత్రాన్ని గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. అయితే, ఈ సినిమా ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవెల్‌లో చేసి సినిమాపై మరింత బజ్ తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మరి ఈ సినిమా కోసం అనుష్క తన సెంటిమెంట్ బ్రేక్ చేస్తుందా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తన గత చిత్రాలకు అనుష్క ప్రమోషన్స్‌లో పాల్గొనలేదు. ఆమె ఒకట్రెండు ఇంటర్వ్యూలకు మాత్రమే పరిమితం అయ్యేది. మరి ఇప్పుడు ఘాటి చిత్రం ఆమెతో పాటు దర్శకుడు క్రిష్‌కు కూడా చాలా కీలకం. మరిఇలాంటిసినిమాను జనంలోకి తీసుకెళ్లేందుకు ఈ జేజమ్మ బయటకు వచ్చి ప్రమోషన్స్‌లో పాల్గొంటుందా లేదా అనేది చూడాలి.



# 'శంబాల' టీజర్ లాంచ్

యంగ్ అండ్ వెర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ వంటి వారు నటిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ శంబాల నుంచి వచ్చిన పోస్టర్‌లు, పాత్రల్ని రివీల్ చేస్తున్న తీరు అందరిలోనూ ఆసక్తిని పెంచేసిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గానే శంబాల మేకింగ్ వీడియోని కూడా రిలీజ్ చేసి అంచనాలు పెంచేశారు. ఇక తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ విశ్వంలో అంతు పట్టని రహస్యాలెన్నో ఉన్నాయి.. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు మూఢ నమ్మకం అంటుంది.. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పదనం అంటుంది. పంచ భూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు.. దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం.. ఇప్పుడు ఈ రక్కసి క్రీడను ఆపాలంట్టే.. అంటూ వచ్చిన వాయిస్ ఓవర్.. చూపించిన డైలాగ్స్‌తో సినిమా రేంజ్ ఏంటో అందరికీ అర్థం అవుతోంది. ఇందులో ప్రవీణ్ కే బంగారి అందించిన విజువల్స్, శ్రీచరణ్ పాకాల ఇచ్చిన బీజీఎం అన్నీ కూడా నెక్స్ట్ లెవెల్లో ఉన్నాయి. పాన్ ఇండియన్ మూవీకి సరిపడా సబ్జెక్ట్, కంటెంట్ ఉందని ఈ టీజర్ చెప్పకనే చెప్పేస్తోంది. ఇక ఇందులో అంత రిక్షం నుంచి ఏదో ఒక అతీంద్రయ శక్తి ఉన్న ఉల్క, రాయి లాంటిది ఓ గ్రామంలో పడటం.. దాని ప్రభావంతో ఊర్లోని జనాలు చనిపోవడం, వింతగా ప్రవర్తించడం జరుగుతుంటుంది. దాన్ని ఛేదించేందుకు హీరో రావడం.. ఓ ఊరితో పోరాటం చేయడం వంటి ఆసక్తికరమైన అంశాలతో శంబాలను తెరకెక్కిస్తున్నారని టీజర్ చూస్తే అర్థం అవుతోంది. ఇక ఈ టీజర్‌తో మూవీ మీద ఒక్కసారిగా అంచనాలు పెంచేశారు. ప్రస్తుతం ఈమూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.



# పాన్ ఇండియా చిత్రంలో బాలీవుడ్ క్వీన్ దీపికా

ఇండియన్ సినీ ఇండస్ట్రీలో సంతోషంలో మునిగిపోయే బ్లాక్ బస్టర్ ప్రకటన వచ్చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో దిగ్గజ సంస్థ కళానిధి మారన్‌కు చెందిన సన్ పిక్చర్స్ కాంబోలో పాన్ ఇండియా భారీ ఎంటర్‌టైనర్ రూపొందుతోన్న సంగతి తెలిసిందే. అనౌన్స్‌మెంట్ నుంచే సినిమాపై ఆకాశాన్నంటేలా అంచనాలు ఏర్పడ్డాయి. దీన్ని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లేలా బాలీవుడ్ గ్లామరస్ క్వీన్ దీపికా పదుకొనె కూడా ఈ టీమ్‌తో జాయిన్ కావటం విశేషం. పాన్ ఇండియా లెవల్లో బిగ్గెస్ట్ బడ్జెట్ విజువల్ వండర్ మూవీగా తెరకెక్కబోతున్న ఈ చిత్రం అద్భుతమైన తారాగణంతో ప్రభంజనం సృష్టించబోతోంది. ఈ భారీ కాంబోను తెలియజేసేలా విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ వీడియో అభిమానులను, ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. డైరెక్టర్ అట్లీతో దీపికా పదుకొనె మాట్లాడే సన్నివేశాలతో ప్రారంభమైన ఈ వీడియో ఆమె శక్తివంతమైన పాత్రలోకి మారుతున్న విధానాన్ని చూపించిన తీరు అందరిలో ఉత్కంఠతను రేపుతోంది. హెడ్‌గేర్‌ను ధరించి ఆమె ఫుల్ కాస్ట్యూమ్స్‌తో సెట్లోకి అడుగు పెడుతూ యుద్ధానికి సిద్ధమైంది. మరోసారి క్వీన్ విజయం సాధించనుందనేది దీంతో స్పష్టమవుతోంది. ఈ చిత్రం కోసం ఇండియన్ సినీ ఇండస్ట్రీని శాసించే నాలుగు శక్తులు ఒక చోటకు చేరుతున్నాయి. వారెవరో కాదు.. ఒకరేమో పుష్పచిత్రంతో నేషనల్ అవార్డ్ గెలుచుకున్న అల్లుఅర్జున్, జవాన్, తెరి, బిగిల్, మెర్సల్ వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించిన సెనసేషనల్ డైరెక్టర్ అట్లీ, ఇండియన్ మీడియాలో ఎంతో శక్తివంతమైన సన్ నెట్ వర్క్‌తో పాటు ఇండి యన్ సినిమాల్లో పవర్ ఫుల్, వెర్స టైల్ స్టార్స్‌లో ఒకరైన దీపికా పదుకొనె కథా నాయికగా జాయిన్ కావటం అనేది సినిమా స్కేల్, ప్రతిష్ట మరో ఎత్తుకు చేరుకుంది.



# 'జోరుగా హుషారుగా షికారు పోదమ' ప్రేక్షకులకు వినోదం పంచే

క్రేజీ యువ కథా నాయకుడు సంతోష్ శోభన్, అందాల భామ, ఫల్గుణి ఖన్నా జంటగా జి.సుభాష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన చిత్రం జోరుగా హుషారుగా షికారు పోదమ. తొలికాపీతో సహా అన్ని కార్యక్రమాలనుపూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైందని త్రిపుర క్రియేషన్స్ అధినేత చిత్రం, వరల్డ్ నెగటివ్ హక్కుదారుడు మురళీకృష్ణ వంకాయలపాటి తెలిపారు. ఇంకా మాట్లాడుతూ, ఇది మధురమైన రొమాంటిక్ కామెడీగా సాగుతుంది. ఇంకా చెప్పాలంటే... లైట్ హార్టెడ్ ట్రావెల్ మ్యూజికల్ లవ్ స్టోరీ. చూస్తున్నంత సేపు హాయిగా నవ్వుకుంటుంది. ఇండియా మొత్తం చుట్టి వచ్చినట్టుగా ఉంటుంది.. సంతోష్ శోభన్‌కు కెరీర్ పరంగా మరింత మంచి పేరు తెచ్చిపెడుతుంది. కనువిందు చేసే సినిమాటోగ్రఫీ, వీనులవిందైన సంగీతం చిత్రానికి ఓ ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలోనే చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: నాగవంశీ, సినిమాటోగ్రఫీ: సాయి సంతోష్.



# పేపర్ కప్పులతో కోట్ల ఆదాయం!



ఇంట్లో కూర్చుని ఫుడ్ ఆర్డర్లు పెట్టేవారి సంఖ్య రోజుకీ పెరుగుతోంది. మరో పక్క క్లౌడ్కిచెన్ల ఏర్పాటుతో ఆహారరంగంలో ఉపాధి పొందుతోన్న మహిళల శాతమూ ఎక్కువైంది. అయితే, ఇద్దరికీ ప్రధాన సమస్య ప్యాకింగే. ప్లాస్టిక్ వేడివేడి పదార్థాలు హానికరమని ఆహారం, పదార్థాలు ఒలికిపోవడం, కారడం వంటివాటితో ఇబ్బంది తయారీదారులకూ ఎదురవుతోంది. వీటన్నింటికీ సుస్థిర ప్రత్యామ్నాయాలు చూపిస్తోంది. బెంగళూరుకి చెందిన ధన్వితా సత్యానంద్. అదేంటో తెలుసుకుందామా!

ధన్వితది కర్ణాటక. చదువు పూర్తయ్యాక ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో కొన్నాళ్లు పనిచేశారామె. కానీ, స్వయం శక్తితో ఎదగాలన్న కోరికతో వ్యాపార రంగంలోకి అడుగు పెట్టాలనుకున్నారు. అగ్రెన్జ్ పేరుతో హోటల్ రెస్టారంట్ సప్లై ఇండస్ట్రీలో సంస్థను కలిగి ఉంది. పెట్టిన కొన్నాళ్లు బాగానే ఉంది. ఈలోగా కోవిడ్19 లాక్‌డౌన్‌తో వ్యాపారం ఆగిపోయింది. దాంతో కొంత నిరాశ పడ్డారు. కానీ, సమయంలో ఎదురైన అనుభవాలు, సమస్యలు పర్యావరణంపై అవగాహన పెంచుతాయి. దాంతో మరో ఆలోచన చేయాలనుకున్నారు. భర్త, అన్నల సాయంతో 'ఏకోజ్ బయోవేర్' పేరుతో ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా స్పిల్ ప్రూఫ్, హీట్ సేఫ్‌లతో పాటు 98 శాతం బయోడిగ్రేడబుల్ రెస్టారంట్ ప్యాకేజింగ్ తయారీ మొదలు పెట్టారు.

**అత్యధిక స్థాయి వద్ద...** ఫుడ్ గ్రేడ్ పేపర్ బౌల్స్, కప్పులు, పెట్టెలు, పేపర్‌కప్పులు, పిజాబాక్స్‌లు, సలాడ్ బౌల్స్, సూప్ బౌల్స్, వంటివెన్నో తయారుచేశారు. మూతలు... ఇలా అన్నీ ఐటీసీ పేపర్‌తో చేసినవే వేడివేడి రసం, సాంబార్, గ్రేవీలన్నీ వీటిల్లో ప్యాకింగ్ చేయొచ్చు. ఇవి వేడిని తట్టుకోగలవు. అంతేకాదు, ఇవన్నీ వాటర్ ప్రూఫ్ కావడం వల్ల ఈ ప్యాకింగ్ చేయిచ్చు. అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద ఫార్మింగ్ యంత్రాలను ఉపయోగించి వీటిని చేస్తారు. 50 నుంచి 1000 ఎంఎల్ వరకూ వివిధ పరిమాణాల్లో ఇవి లభిస్తాయి. ఇప్పటివరకూ ఎకోజ్ సుమారు 4.5 కోట్లకు పైగా యూనిట్లను ఉత్పత్తి చేసింది. వీరి ఖాతాదారుల్లో ఎంటిఆర్, లులుహైపర్ మార్కెట్లు, మాగ్నోలియా బేకరీ, మిలానో ఐస్‌క్రీమ్స్, రిట్జ్-కార్ల్టన్ వంటి ప్రముఖ బ్రాండ్లెన్నో ఉన్నాయి తాజాగా సస్టెయినబుల్ ప్యాకేజింగ్ డిమాండ్ అధికంగా ఉన్న యుకె మార్కెట్‌లోకీ ప్రవేశించింది. భారత్‌తో పాటు యుఎఇ, యూరప్, న్యూజిల్యాండ్, నార్త్ అమెరికాలోని ఫుడ్ బ్రాండ్‌లకు సరఫరా చేస్తుంది. పదికోట్లకు పైగానే ఆదాయం అందుకుంటోంది. □

# ఆమె 'వరల్డ్' ఫేమస్ డిజైనర్



ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన 108 మంది అమ్మాయిలు. తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ మన వస్త్రధారణలో ఎంత చక్కగా మెరిసిపోయారో! ఇంతమందికి డిజైన్ చేయడం ఆషామాషీ కాదు. కానీ ఎవరి కనుసన్నల్లో ఇవన్నీ రూపొందించారని తెలుసా? అర్చనా కొచ్చర్. ఆ ప్రయాణాన్ని పంచుకున్నారిలా...

ఫ్యాషన్ అనగానే కొత్తగా చూస్తాం కానీ... ఇది భారతదేశంలో ఎప్పట్నుంచో ఆచరణలో ఉంది. ఒకప్పుడు అమ్మలే డిజైనర్లు. పిల్లలకోసం వాళ్లే ప్రత్యేకంగా దుస్తులు కుట్టేవారు. వాటిని వేసుకుని పిల్లలు ఎంత ముద్దుగా కనిపించేవారో! ఇప్పుడు అంతర్జాలం అందుబాటులోకి వచ్చాక సమాచారం సేకరించడం ఇంకా సులువు అందుకే ఎవరైనా ఫ్యాషన్ అనుకరించొచ్చు అని చెబుతా. ఈ రంగంలో నాది 30 ఏళ్ల అనుభవం. నేనూ ఎన్నో విషయాలు నేర్చుకుంటూనే ముందుకు సాగాను.

షారూక్ ఖాన్, కరీనా కపూర్, మలైకా అరోరా... ఇలా ఎంతోమంది బాలీవుడ్ నటీనటులకు దుస్తులు డిజైన్ చేశాను. అంతర్జాతీయ ఫ్యాషన్ వీక్‌ల్లో ప్రయోగా లెన్నో చేసి... ఫేమస్ అయ్యా. అంతమాత్రాన ఇది ఒక విభాగానికో, వర్గానికో పరిమితం కాదు. మన శరీరానికి నప్పే, అందాన్ని పెంచే దుస్తులను ఎంచుకోగలిగితే చాలు. దాని పెద్ద మొత్తం ఖర్చు చేయాల్సిన పని లేదు. వ్యక్తులు కష్టమనిపిస్తే మన శరీరతత్వాన్ని పోలిన సెలెబ్రిటీలను అనుకరిస్తేసరి. వాళ్లకి ఎలాగూ తమ ఆహారంపై పనిచేసే బృందాలు ఉంటాయి. మీరు వాళ్లని గమనించూ టైలర్ దగ్గర కుట్టించు కోండి. ఖర్చు ఎక్కువ అవదు. మనకి నప్పుతుందా అనేది ప్రధానంగా చూసుకోవడమే ప్రధానమిక్కడ.

**అటు ఆఫ్రికా.. ఇటు చైనా ....** నా ఇన్నేళ్లమే మిస్ వరల్డ్ పోటీలకు పనిచేసే అవకాశం ఇచ్చింది. ఇక్కడ పోటీదారులకు వేషధారణ లను దృష్టిలో పెట్టుకొని కలర్ ప్యాలెట్లకు ఎంపిక చేశాం. పోటీవాదుల శరీరాకృతి ఆధారంగా 2004 పైగా మునులను రూపొందించాం. అదీ నెల రోజుల్లోనే అయిన వాళ్లు ఏడడుగుల వరకు పొడవుంటే నేపాల్, చైనా వాళ్లు ఆడడుగు లుంటారు. ఇలా అనేక రకాల వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని డిజైన్ చేశాం. ఇది 643 మంది ఆర్టిజన్స్ 34 మంది టైలర్లు, ఏడుగురు మాస్టర్లు 58 మంది సహాయకుల శ్రమ.

**ఇక్కత్.. నారాయణ పేట...**

తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన ఈ దుస్తుల కోసం.. పోచంపల్లి సహా ఎన్నో ప్రాంతాలు తిరిగాం, స్థానిక నేతన్నలు, చేతి వృత్తుల వారితో కలిసి డిజైర్లను రూపొందించాం.

2025 ట్రెండ్ రిపోర్టు... లిక్విడ్ గోల్డ్‌కి ప్రస్తుతం ఆదరణ ఎక్కువగా ఉంది. దాన్ని దృష్టిలో పెట్టుకుని అగ్గిపెట్టెలో పట్టే లిక్విడ్ గోల్డ్ ఫ్యాబ్రిక్‌ను వినియోగించుకుంటాం.

కానీ తెలంగాణలో ఎప్పట్నుంచో ఇలాంటి చీరలు ప్రసిద్ధి చెందడం విశేషం. దీనితోపాటు డబుల్ ఇక్కత్, గొల్లబామ నారాయణపేట చీరలు, బ్రొకేడ్‌లు బంగారంతో నేసిన మల్బరీ సిల్క్ చీరలతో తెలంగాణ చరిత్ర, సంప్రదాయం ప్రతిబింబించే డిజైన్లను రూపొం దించాం. క్లిష్టమైన ఆరీ వర్క్స్. జర్దోని ఎంబ్రాయిడరీలతోపాటు ముత్యాలు, భారతీయ ఆభరణాల గొప్పతనాన్ని పచ్చలు, కెంపులు, బంగారం వంటి ఆభరణాల బోస్లతో రాచరికాన్ని సూచించే రంగులను చేర్చాం. తద్వారా హైదరాబాద్ సంస్కృతిని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాం. సాధారణంగా పెళ్లిళ్ళు, వేడుకలు వంటి ప్రత్యేక సందర్భాలలోనే బంగారాన్ని ఎక్కువగా వేసుకుంటాం. కానీ బంగారాన్ని దుస్తుల్లో డిజైన్ చేసి ధరించడం ఇక్కడి ప్రత్యేకత, వీటికి బాలీవుడ్ ఎంబ్రాయిడరీ లెహెంగా డిజైన్‌లో జత చేసి, లంగా ఓణీలుగా తీసుకొచ్చా. □

# చిన్నారుల స్నేహం ..



కొంతమంది పిల్లలు ఇంట్లో చలాకీగా ఉండి, స్కూల్లో, బయట ఎవ్వరితోనూ కలవకుండా ముభావంగా ఉంటారు. మీ చిన్నారుల్లో కూడా ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా? అయితే వారికి బయటి ప్రపంచాన్ని తప్పక పరిచయం చేయాల్సిందే. లేదంటే సామాజిక నైపుణ్యాలు కొరవడతాయి. కాబట్టి.. వీటిని అలవాటు చేయండి. తోటివారితో, తోబుట్టువులతో మాట కలిపేలా ప్రోత్సహించండి. అప్పుడే చిన్న బుర్రలకి బయటి ప్రపంచం పరిచయం అవుతుంది. ఇతరులతో ఎలా మెలగాలి, ఏం మాట్లాడాలన్నదీ వారికి తెలుస్తుంది. క్రీడల్లో వారిని భాగస్వాములను చేయాలి. అందుకోసం స్పోర్ట్స్ అకాడెమీలో వారిని చేర్పించండి. క్రీడలు మానసిక ఎదుగుదలకి దోహదపడతాయి. కొత్త స్నేహితులు పరిచయం అవుతుంటారు. దాంతో కొత్తవారితో మాట్లాడాలంటే బిడియం పోతుంది. తల్లితో తప్ప ఎవ్వరితోనూ పెద్దగా మాట్లాడని చిన్నారులు ఒకేసారి బయట ప్రపంచంలో కలవడం కాస్త కష్టం. ఆ ఇబ్బందిని మీతో పంచుకున్నప్పుడు మీరు దానికి సానుకూలంగా స్పందించాలి. లేదంటే ఆత్మన్యూనతకు లోనయ్యే అవకాశం ఉంది. వారు చెప్పే కారణాలకి మీ అనుభవాలను జోడించి స్నేహాన్ని ప్రయత్నించమని చెప్పాలి. చిన్నపిల్లలకు ఇప్పుడు మనం ఏం చెబితే అదే వారి మనసులో బలంగా నాటుకుపోతుంది. అందువల్ల స్నేహాల్లో ఎటువంటి తారతమ్యం ఉండకూడదని వివరించండి. అప్పుడే భిన్న సంస్కృతులు, సంప్రదాయాల పట్ల వారికి అవగాహన ఏర్పడుతుంది. □

# ఎప్పుడు కావాలన్నా కమ్మని కాఫీ

ముక్కుపుటాలని హాయిగా పలకరించే కాఫీ



పరిమళం ఒక్కసారి అలవాటైందా.. ఇక అంతే! వదల్లేం. మంచి కాఫీ కలపడం ఒక ఆర్ట్ అంటారు. ఆ కెమిస్ట్రీ కుదరడం అందరికీ సాధ్యం కాదు. కానీ ఎక్కడైనా ఏ సమయంలో అయినా ఒకేలా ఉండే కాఫీని అందించాలనుకున్నారు కొమిటీర్ సంస్థను స్థాపించిన మాథ్యూరాబర్ట్స్. ఇందుకోసం తొమ్మిదేళ్లు కష్టపడి ఫ్రీజింగ్ కాఫీని తయారుచేశారు. ఈ కాఫీని కలపడానికి ఎక్కువ సమయం పట్టదు. బరిస్తా కాఫీ రుచిని ఇంట్లోనే పక్కాగా అందించేందుకు ఆధునిక బ్రూయింగ్ టెక్నిక్ నైపుణ్యాలని పాటించి ఈ కాఫీని తయారుచేసింది కొమిటీర్ సంస్థ. ఈ ఆలోచన నచ్చడంతో ఇన్వెస్టర్లు కోట రూపాయలని పెట్టుబడిగా అందించారు. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎనిమిది రకాల కాఫీ గింజలతో తయారుచేసిన ఈ ఫ్రిజింగ్ కాఫీ.. మనికి బిళ్లల రూపంలో దొరుకుతుంది. కాఫీ కావాలనుకున్నప్పుడు పాలల్లో కలిపితే సరి. అన్నట్టు ఈ ఏడాది ప్రపంచ ఉత్తమ ఆవిష్కరణల్లో దీన్ని ఒకటిగా టైమ్ పత్రిక పేర్కొంది. □

# దేవుడి సన్నిధిలో కాసేపు..



'ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవాజీవముతోడు నా మాటప్రకారము గాక, యీ సంవత్సరములలో మంచైనను, వర్షమైనను పడదని ప్రకటించెను. (1రాజులు 17:1). ఈ మాటలు అన్నది ఏలీయా అనే దేవుడి ప్రవక్త. ఎవరితో అన్నాడు అంటే ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో అన్నాడు. ఎందుకని ఈ మాటలు ఏలీయా చెప్పాడు? ఆహాబు తన దేవుడైన యెహోవాను సేవించడం మానేసి, అన్యుల దేవతలను అనుసరించడం వల్ల దేవుడు దేశంలో వర్షం లేకుండా చేశాడు. ఇక్కడ ఏలీయా మాటల్ని గమనిస్తే..నేరుగా రాజువద్దకు వెళ్లి, ధైర్యంగా నేను దేవుడి సన్నిధిలో నిలబడి మాట్లాడుతున్నాను అని చెప్పాడు. ఏలీయా దేవుడి సన్నిధిలో జీవించడం నేర్చుకున్నాడు. దేవుడితో తన అనుబంధాన్ని మరణించేంతవరకు కొనసాగించాడు. దేవుడి సన్నిధిలో మనం జీవిస్తే మనకు వచ్చే లాభం ఏమిటో ఏలీయా ఎదుర్కొన్న పరిస్థితుల నుంచే తెలుసుకుందాం. మొదట ఆదేశంలో దేవుడు వర్షం రాకుండా చేశాడు. అంటే ఆ దేశంలో కరువు వచ్చింది. కరువుకాలంలో దేవుడు కాకుల ద్వారా ఏలీయాకు ఉదయం, రాత్రి రొట్టెను, మాంసాన్ని పంపాడు. ఒకవైపు ప్రజలు కరువుతో అల్లాడుతుంటే దేవుడి మాత్రం ఏలీయాను రొట్టె, మాంసంతో పోషించాడు. తర్వాత ఏలీయాను దేవుడు ఒక విధవరాలి ఇంటికి నడిపించాడు. ఏలీయా ద్వారా దేవుడు ఆ విధవరాలిని, ఆమె కుమారుడిని పోషించాడు. ఏలీయా ద్వారా దేవుడు ఒక విధవరాలికి, ఆమె కుమారుడికి ఆహారం లభించడం వల్ల జీవించారు. ఏలీయా దేవుడి సన్నిధిలో జీవించడం వల్ల కరువులో పోషించబడ్డాడు, ఆయన ద్వారా మరో ఇద్దరికి ఆహారం దొరికింది. అవును మనం కూడా నిత్యం దేవుడి సన్నిధిలో జీవిస్తే తప్పనిసరిగా కరువులో దేవుడు మనల్ని మనతోపాటు మనపై ఆధారపడ్డవారిని కూడా పోషించి, సంరక్షిస్తాడు. మన చుట్టూ ఎన్నో విపత్కరపరిస్థితులను చూస్తున్నాం. భద్రత, క్షేమం అనేది ఎక్కడా లేదు. ఒకవైపు అనేక కంపెనీలు ఉద్యోగులను తీసివేస్తున్నారు. మరోవైపు ప్రకృతి విపత్తులు. ఇలా పలు సమస్యలతో మనం సతమతమవుతున్నాం. ఈ పరిస్థితుల్లో మనం ఏం చేయాలి? నిజదేవుడైన యేసుక్రీస్తును సేవించాలి. నిత్యం ఆయనతో మన అనుబంధాన్ని కొనసాగించాలి. ఆయన సన్నిధిలో మనం జీవించాలి. అప్పుడే మనం ఏ సమస్యలనైనా ఎదుర్కోగలం. దేవుడే మనల్ని సంరక్షిస్తాడు, కాపాడుతాడు. మనం దేవుడిపై ఆధారపడడం మన బాధ్యత, మన అవసరాలను తీర్చడం ప్రభువు బాధ్యత. కాబట్టి ఏలీయాలాగా మనం కూడా దేవుడి సన్నిధిలో జీవిద్దాం. ఆయన సన్నిధిలో జీవిస్తే, సమాధానంతో పాటు ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మనకెన్నో పనులు, ఎన్నో ఒత్తిడిలు ఉన్నాయి. వాటన్నింటిని పక్కనపెట్టి, రోజుకు కొంతసేపు ప్రార్థనలో గడపడం ముఖ్యం. ఈ ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రార్థన ద్వారా దేవుడి సహవాసంలో ముందుకు సాగిపోదాం.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# రుచికరమైన చింతాకు రుచులు



మాంసం, చేపలు, రొయ్యలు.. ఇలా ఏవైనా సరే చింత చిగురురుచి ముందు దిగదుడుపే. అందుకే ఏ కూరతో అయినా సరే ఇది జట్టు కట్టేస్తుంది. చిరు పులుపుతో నోరూరిస్తుంది. మరి మీరేం వండాలని ఆలోచిస్తున్నారా? మీ కోసంమే ఇవి.

## పులిహోర ..

**కావలసినవి :** చింతచిగురు-కప్పు, పొడి అన్నం- రెండు కప్పులు, వేరు సెనగ పప్పు-మూడు పెద్ద చెంచాలు, సెనగపప్పు-రెండు పెద్ద చెంచాలు, ఆవాలు-అర టీ స్పూను, మినపప్పు-పెద్ద చెంచా, పసుపు-కొద్దిగా, కరివేపాకు-నాలుగు రెబ్బలు, ఎండు మిర్చి-మూడు, నూనె-తగినంత, ఉప్పు-రుచికి సరిపడా, ఇంగువ-చిటికెడు.



**తయారీ :** అన్నం (ఉడుకుతున్నప్పుడే ఒక చెంచా నూనె, చిటికెడు ఉప్పు కలిపి) పొడిగా వండి చల్లార్చాలి. అర టీ స్పూను నూనెలో చింత చిగురును పచ్చివాసన పోయేవరకు చిన్నమంటపై వేయించి పక్కనుంచాలి. అదే కడాయిలో నూనె వేసి ఎండుమిర్చి వేరుసెనగ గింజలు, సెనగపప్పు, మినపప్పు, ఆవాలు, కరివేపాకు పసుపు, ఇంగువ ఒక్కొకనకటిగా వేగనిచ్చిత తాలింపుని చిగురుతో పాటు అన్నంలో కలిపితే సరి.

## కొబ్బరి పచ్చడి..

**కావలసినవి :** చింతచిగురు- కప్పు, తాజా కొబ్బరి ముక్కలు-కప్పు, పసుపు-చిటికెడు, ఉప్పు-తగినత, పచ్చిమిర్చి-అయిదు, ఎండుమిర్చి-ఏడు, ఆవాలు-అరచెంచా, మినపప్పు-చెంచా, మెంతులు-కొద్దిగా, ఇంగువ-చిటికెడు, నూనె- మూడు చెంచాలు. **తాలింపు కోసం:** ఆవాలు, జీలకర్ర, మినపప్పు- చెంచా చొప్పున, కరివేపాకు- రెండు రెమ్మలు, ఎండుమిర్చి- ఒకటి.



**తయారీ :** బాణలిలో నూనె పోసి కాగాక చింత చిగురు, కొబ్బరి ముక్కలు, ఉప్పు, పచ్చిమిర్చి తప్ప మిగిలినవన్నీ వేసుకుని ఎర్రగా వేయించుకోవాలి. అవి చల్లారాక మిక్సీలో వేసి ఒసారి తిప్పాలి. ఈ మిశ్రమానికి మిగిలిన పదార్థాలు కూడా చేర్చి మెత్తగా రుబ్బు కోవాలి. దీనికి చివరగా తాలింపు వేస్తే పచ్చడి తయారవుతుంది. అన్నంలోకి ఈ పచ్చడి చాలా బాగుంటుంది.

## చిన్న చేపలతో ..

**కావలసినవి :** చిన్న చేపలు-అరకిలో, చింత చిగురు-పావు కప్పు, ఉప్పు-రుచికి సరిపడా, ధనియాలపొడి-చెంచా, పసుపు కొద్దిగా, కారం-మూడు చెంచాలు, టొమాటో- చిన్నది, ఉల్లి పాయలు-మూడు, పచ్చి మర్చి-నాలుగు, కరివేపాకు-రెండు రెబ్బలు.



**తయారీ :** ముందుగా చేపల్ని శుభ్రంగా కడిగి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇప్పుడు చింతాకుని చేత్తో పొడిలా నలిపి అందులోకి వేసుకోవాలి. ఆపై సన్నగా కోసి పెట్టుకున్న ఉల్లిపాయ,పచ్చిమర్చి ముక్కల్ని, ధనియాల పొడి, కారం, ఉప్పు, పసుపు అన్నీ సంగం చొప్పున అందులో వేసి కలిపి మూత పెట్టి ఓ గంట పక్కనుంచాలి. ఈలోగా పొయ్యి వెలిగించి బాణలీలో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమర్చి వేయించాలి. అవి రంగు మారాక మిగిలిన ఉప్పు, పసుపు, కారం, ధనియాలపొడి వేసి మూతపెట్టేయాలి. కాస్త నూనె పైకి తేలాక కలిపి పెట్టుకున్న చేపల్ని కూడా వేసి గరిటె పెట్టకుండా గిన్నె పైకి ఎతినత కదపాలి. ఇలా చిన్న మంటమీద కాసూపు మగ్గనిచ్చాక నీళ్ల పోసుకోవాలి. అవన్నీ ఆవిరై కూర దగ్గర పడ్డాక కొంచెం కొత్తిమీర చల్లుకకుంటే సరి.

## మటన్ ..

**కావలసినవి :** చింత చిగురు-కప్పు, మటన్-అర కేజీ, ఉల్లిపాయలు-నాలుగు, పచ్చిమర్చి-ఐదు, ఉప్పు, కారం-రుచికి తగినంత, అల్లం వెల్లుల్లి పేస్ట్-పెద్ద చెంచా, పసుపు-చిటికెడు, ధనియాల పొడి, గరం మసాలా-రెండు పెద్ద చెంచాల చొప్పున, నూనె-కొద్దిగా, జీలకర్ర-చెంచా, బిర్యానీ ఆకులు-మూడు.



**తయారీ :** మటన్‌ని కడిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత చింత చిగురును శుభ్రం చేసుకుని చేతులతో నలిపి పొడి చేసుకోవాలి. ఇప్పుడు, ఉల్లి,పచ్చిమిర్చిలను సన్నగా కోసి పెట్టుకోవాలి. కుక్కర్‌లో కొద్దిగా నూనెపోసి కాగాక.. జీలకర్ర, బిర్యానీ ఆకులు, ఉల్లి, పచ్చిమర్చి ముక్కలు వేసి రంగు మారే వరకూ మగనగనివ్వాలి. ఆపై వెల్లుల్లి పేస్తుని చేర్చి పచినచవాసన పోయే వరకూ ఉంచి, తర్వాత మటన్ వేసి మూత పెట్టాలి.ఇది మగ్గాక ఉప్పు, కారం, పసుపుతో పాటు రెండు నిమిషాలాగి ధనియాలపొడి, గరం మసాలా, కొత్తిమీర తరుగు కూడా చల్లి మూత పెట్టాలి. ఇందులో నీళ్లు పోసి నూనె పైకి తేలే వరకూ మంట మధ్యస్థంగా ఉంచి అడుగంటకుండా తిప్పాలి. అప్పుడు కొన్ని నీళ్లు పోసి మూతకు విజిల్ పెట్టి ఆరు కూతలు వచ్చే వరకూ ఉడికించాలి. చల్లారాక ముక్క ఉడికిందో లేదో చూసిచ ఇంత చిగురు కలిపి మరో ఆరేడు నిమిషాలు సిమ్‌లో ఉంచి ఉడకనివ్వాలి. ఈ కూరను వేడి వేడి అన్నంలోకి తింటే భలే రుచిగా ఉంటుంది.

## చికెన్ ఫ్రై ..



**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్-అరకేజీ, చింతచిగురు-ఒకటింపావు కప్పు, కొబ్బరి తురుము-రెండు చెంచాలు, అల్లంవెల్లుల్లి ముద్ద-చెంచా, ఉల్లిపాయలు-రెండు, పచ్చిమర్చి-మూడు, పసుపు-పావుచెంచా, కారం-రెండు చెంచాలు, ధనియాలపొడి-చెంచా, గరంమసాలా-అరచెంచా, ఉప్పు-తగినంత, నూనె-అరకప్పు, దాల్చినచెక్క-రెండు ముక్కలు, అవంగాలు-మూడు.

**తయారీ :** చింత చిగురును శుభ్రంగా కడిగి పెట్టుకోవాలి. స్టౌమీద కడాయి పెట్టి నూనె పోయాలి. అదికాగాక దాల్చినచెక్క, లవంగాలు వేసి వేయించుకోవాలి. అందులోనే ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి తరుగు వేయాలి. అవి బాగా వేగాక అల్లం వెల్లుల్లి ముద్ద,చికెన్ ముక్కలు వేసి బాగా కలిపి మూత పెట్టేయాలి. అయిదు నిమిషాల య్యాక పసుపు, కారం, తగినంత ఉప్పు, ధనియాలపొడి, కొబ్బరి తురుము, గరంమసాలా వేసి బాగా కలిపి మూత పెట్టాలి. చికెన్ పూర్తిగా ఉడికాక చింతచిగురు వేసి బాగా కలపాలి. ఇప్పుడు స్టౌవ్ సిమ్‌లో పెట్టి మధ్య మధ్య కలుపుతూ ఉంటే కాసేపటికి కూర పొడిపొడిగా అవుతుంది. అప్పుడు దింపేయాలి.□

# గ్లాస్ రిన్సర్



డిష్‌వాషర్‌తో తోమి శుభ్రం చేస్తాం. గ్లాసులు, బాటిళ్ల విషయానికొస్తే వాటిని తోమాల్సిన అవసరం ఉండదు. కేవలం నీళ్లతో శుభ్రం చేస్తే చాలు. అందుకోసం ప్రత్యేకంగా తయారుచేసిన పరికరమే గ్లాస్ రిన్సర్ పరికరం. వంట చేసిన పాత్రలన్నింటి నీ సింకులో వేసి, దీన్ని సింకు పక్కనే అమర్చుకో వచ్చు. గుండ్రంగా, వెడల్పుగా ఉండే ఈ పరికరంపై గ్లాసును ఉంచి ఒత్తితే చాలు. నీళ్లు వేగంగా వచ్చి గ్లాసు లోపలి భాగాల్ని శుభ్రం చేస్తాయి. ఇది కేవలం గ్లాసుల కోసమే కాదు.. బాటిళ్లు, సీసాల మూతలు శుభ్రం చేయడానికీ ఉపయోగపడుతుంది. □



# గుకేష్ సంచలన ఓటమి

## నార్వే చెస్ టోర్నీలో ఛాంపియన్‌గా కార్ల్‌సన్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక నార్వే చెస్ 2025 టోర్నమెంట్ అత్యంత నాటకీయ పరిణామాల మధ్య ముగిసింది. ప్రపంచ ఛాంపియన్, భారత యువ సంచలనం దొమ్మరాజు గుకేశ్ చివరి రౌండ్లో ఊహించని రీతిలో ఓటమి పాలుకావడంతో ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ మరోసారి టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. మహిళల విభాగంలో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ అన్నా ముజిచుక్ విజేతగా నిలిచింది. మాగ్నస్ కార్ల్‌సన్ తన హోం టర్న్‌లో మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. చివరి రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగైసితో డ్రా చేసుకోవడం ద్వార 16 పాయింట్లతో టోర్నీలో అగ్రస్థానంలో నిలిచి విజేతగా నిలిచాడు. టోర్నీలో అద్భుతమై ప్రదర్శన కనబరిచిన గుకేశ్ చివరి రౌండ్‌లో అమెరికా గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానా చేతిలో ఓటమి పాలయ్యాడు. టైటిల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే కనీసం డ్రా అయినా చేసుకోవాల్సిన మ్యాచ్‌లో సమయం ఒత్తిడితో గుకేశ్ తీవ్ర తప్పిదం చేసి ఓటమిని అంగీకరించాల్సి వచ్చింది. దీంతో గుకేశ్ 14.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో అత్యంత ఆసక్తికరమైన మ్యాచ్‌లలో ఒకటి గుకేశ్, కార్ల్‌సన్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో గుకేశ్ ప్రపంచ నంబర్ వన్ కార్ల్‌సన్‌ను క్లాసికల్ చెస్‌లో తొలిసారి ఓడించి సంచలనం సృష్టించాడు. ఫాబియా కరువానా గుకేశ్‌పై విజయం సాధించడం ద్వారా 15.5 పాయింట్లతో టోర్నీలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగైసి టోర్నీలో ఐదో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో కార్ల్‌సన్‌తో డ్రా చేసుకున్నప్పటికీ.. ఆర్మాగెడాన్ గేమ్‌లో విజయం సాధించి టోర్నమెంట్‌ను మంచి నోట్‌తో ముగించాడు. ఇక మహిళల విభాగంలో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్ అన్నా ముజిచుక్ 16.5 పాయింట్లతో విజేతగా నిలిచింది. భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి మూడో స్థానంలో నిలిచింది.




## స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో..

# లెడికి విజయం

**న్యూఢిల్లీ:** తొమ్మిది సార్లు ఒలింపిక్ ఛాంపియన్ కేటీ లెడెక్కీ యుఎస్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో మరో అద్భుతమైన విజయాన్ని సాధించింది. చికాగోలో శనివారం జరిగిన 400 మీటర్ల ఫ్రీస్టైల్‌ను 3:58.56 సెకన్లలో సాధించి తన 2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్ ప్రోగ్రామ్‌కు మరో ఈవెంట్‌ను జోడించింది. సింగపూర్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు 800 మీటర్ల ఫ్రీలో విజయంతో ఇప్పటికే టికెట్ సంపాదించుకున్న లెడెకీ, 200 మీటర్ల మార్కులో ప్రపంచ రికార్డు వేగంతో దూసుకెళ్లింది. అంతేకాకుండా ఈ వారం 200 మీటర్ల ఫ్రీలో లెడెకీని ఒకటిరెండు ముగింపులో నడిపించిన క్లైర్ వైన్‌స్టెయిన్ కంటే 1.49 సెకన్ల ముందు చేరుకుంది. ఇక గత నెలలో ఆమె తన సొంత ప్రపంచ రికార్డు, ఇప్పటివరకు రెండవ అత్యుత్తమ 400 మీటర్ల ఫ్రీ ఈత మరియు 800 మీటర్ల ఫ్రీ ప్రపంచ రికార్డు తర్వాత చరిత్రలో రెండవ వేగవంతమైన 1,500 మీటర్ల ఫ్రీ ఈదింది. చివరి 20 మీటర్లలో కేట్ డగ్లస్ ప్రపంచ రికార్డును అధిగమించి 1:05.79 సమయంలో 100 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్‌ను గెలుచుకుంది, మూడుసార్లు ఒలింపిక్ బంగారు పతక విజేత కింగ్ 1:06.02 సమయంలో రెండవ స్థానంలో నిలిచింది. ప్రపంచ రికార్డు కలిగిన రీగన్ స్మిత్ మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌ను గెలుచుకుంది, రెండవ ల్యాప్‌లో కాథరిన్ బెర్కాఫ్‌ను 57.69 సెకన్లలో అధిగమించింది. మూడు రన్నరప్ స్థానాల్లో నిలిచిన తర్వాత స్మిత్ ఈ వారంలో తన మొదటి విజయాన్ని సాధించింది, బెర్కాఫ్ 58.13 సెకన్లలో రెండవ స్థానంలో నిలిచింది.



## ఫ్రెంచ్ ఓపెన్‌లో.. ముగిసిన

# జకోవిచ్ పోరాటం

## ఫైనల్స్‌కు సిన్నర్

**న్యూఢిల్లీ:** ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడైన నొవాక్ జకోవిచ్ పోరాటం సెమీ ఫైనల్లోనే ముగిసింది. శనివారం ఉత్కంఠగా సాగిన పోరులో మట్టి కోర్టులో మరో ట్రోఫీ గెలవాలనుకున్న అతడి కలను ఇటలీ కెరటం జన్నిక్ సిన్నర్ కల్లలు చేశాడు. కెరియర్లో అత్యధిక గ్రాండ్‌స్లామ్స్‌తో చరిత్ర సృష్టించిన జకోకు సిన్నర్ చెక్ పెట్టాడు. సెర్బియా వీరుడికి చుక్కలు చూపిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లాడీ వరల్డ్ నంబర్ 1. తద్వారా ఓపెన్ ఎరాలో ఈ మెగా టోర్నీ తుది పోరుకు అర్హత సాధించిన రెండో ఇటాలియన్‌గా సిన్నర్ రికార్డు నెలకొల్పాడు. మాజీ వరల్డ్ నంబర్ 1 జకోవిచ్ మరో గ్రాండ్‌స్లామ్ ఆశలపై సిన్నర్ నీళ్లు చల్లాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ దిశగా సాగుతున్న అతడిని సెమీస్‌లో ఇంటికి పంపాడీ యంగ్‌స్టర్. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా జకోపై పైచేయి సాధించాడీ ఇటలీ సెన్సేషన్. తొలి సెట్ కోల్పోయినప్పటికీ కంగారు పడకుండా.. తన మార్క్ ఆటతో విరుచుకుపడ్డాడు సిన్నర్. బలమైన ఏస్‌లు, పదునైన సర్వ్‌లతో చెలరేగి వరుసగా రెండు సెట్లను 7-5, 7-5 తో గెలుపొందిన అతడు మ్యాచ్ విజేతగా నిలిచాడు. జకో అత్యుత్తమైన ఆటగాడు. అతడిని ఓడించాలంటే సర్వ శక్తులు ఒడ్డాల్సిందే. అందుకే సెమీస్‌లో నేను నా బెస్ట్ గేమ్ ఆడాను. మానసికంగా బలంగా ఉండడంతో పాటు ప్రతి పాయింట్ గెలవాలనే ఉద్దేశంతో ఆడాను. అంతేకాదు జకోకు కౌంటర్ అటాక్ ఇవ్వడం చాలా ముఖ్యం. అది సాధ్యమవ్వాలంటే శ్రద్ధగా ఉండాలి. సో.. సెమీస్‌లో నేను అదే చేశాన్న అని మ్యాచ్ అనంతరం సిన్నర్ తెలిపాడు. టైటిల్ పోరులో అతడు డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్ ఢీకొట్టనున్నాడు.




# భారత్ టీం ఫైనల్

## టీమిండియా కెప్టెన్‌గా గిల్

## బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌కు కూర్పు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఆగస్టులో భారత్, బంగ్లాదేశ్ మధ్య 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. 2022 తర్వాత టీం ఇండియా తొలిసారి బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుంది. ఈ పర్యటన భారత్ కూడా ప్రత్యేకమైనది. 2022 ప్రారంభంలో, వన్డే సిరీస్ ఆడటానికి బంగ్లాదేశ్ చేరుకున్న టీం ఇండియా ఘోర పరాజయాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ నాయకత్వంలో, భారతదేశం 1-2 తేడాతో సిరీస్‌ను కోల్పోవలసి వచ్చింది. దీనికి ప్రతీకారం తీర్చుకోవడానికి భారతదేశానికి సువర్ణావకాశం ఉంది. ఈ ఏడాది వన్డే సిరీస్ ఆగస్టు 17న ప్రారంభమవుతుండగా, రెండో వన్డే అదే నెల 20న మొదలై చివరి వన్డే 23న జరుగుతుంది. ఈ వన్డే సిరీస్ ముగిసిన తర్వాత టీ20 సిరీస్ జరగనుంది. ఇక ఈ పర్యటన కోసం, భారత జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ యువ ఆటగాళ్లపై ఫోకస్ చేస్తున్నాడు. రోహిత్ శర్మ లేకపోవడంతో, ఈ పర్యటనలో భారత్‌కు కొత్త కెప్టెన్ కూడా రావొచ్చు. ఈ సిరీస్ కోసం టీం ఇండియా శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీలో మైదానంలోకి దిగవచ్చు. వాస్తవానికి, శుభ్‌మాన్ ఇటీవల టెస్ట్ జట్టుకు రెగ్యులర్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. గిల్ 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న టీం ఇండియాకు వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. అదే సమయంలో, గత ఏడాది కాలంగా కెప్టెన్‌గా ఉన్న శ్రేయాస్ అయ్యర్‌కు బంగ్లాదేశ్ పర్యటనలో కూడా పెద్ద బాధ్యత లభించే అవకాశం ఉంది. దీని అర్థం బీసీసీఐ కూడా గిల్‌ను భారత తదుపరి వన్డే కెప్టెన్‌గా పరిశీలిస్తోంది. ఆ తర్వాత బంగ్లాదేశ్ పర్యటనలో తన కెప్టెన్సీ నైపుణ్యాలను ప్రదర్శించడానికి అతనికి అవకాశం ఇవ్వవచ్చు. దీంతో పాటు, బోర్డు శ్రేయాస్ అయ్యర్‌కు కీలక బాధ్యతను కూడా ఇవ్వవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా భారత జట్టులో మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ పాత్ర చాలా ముఖ్యమైనది. శుభ్‌మాన్ గిల్ జట్టుకు నాయకత్వం వహించనున్న రోహిత్ శర్మ లేకపోవడంతో, వైస్ కెప్టెన్సీ బాధ్యతను శ్రేయాస్ అయ్యర్ భుజాలపై మోపవచ్చు. దేశవాళీ క్రికెట్‌లో అయ్యర్ ముంబైకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఐపీఎల్‌లో ఉన్నప్పుడు, ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ప్రత్యేకత ఏమిటంటే అయ్యర్ 2024లో కేకేఆర్ తరపున టైటిల్ గెలుచుకున్నాడు. పంజాబ్, ఢిల్లీని ఫైనల్స్‌కు చేరేలా చేశాడు. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, ముఖేష్ కుమార్, అక్షర్ పటేల్, దిగ్వేజ్ రతి, అర్షదీప్ సింగ్‌లను దాదాపు ఖరారు చేశారు.




## తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్‌లో తొలి రోజు

# భారత్ ఖాతాలో 4 స్వర్ణాలు

## పసిడితో మెరిసిన పూజ, అబూబకర్, జ్యోతి, షిర్సే

**న్యూఢిల్లీ:** తైవాన్ అథ్లెటిక్స్ ఓపెన్ 2025 తొలి రోజు భారత్ అథ్లెట్లు 4 స్వర్ణ పతకాలను సాధించారు. మహిళల 1500 మీటర్ల ఈవెంట్‌లో పూజా స్వర్ణం సాధించడం ద్వారా భారతదేశం తరపున ఖాతా తెరిచింది. శనివారం జరిగిన తైవాన్ ఓపెన్ తొలి రోజు శనివారం జరిగిన ఈ పోటీల్లో ఆమె 4:11.65 సమయంలో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. గత నెలలో, దక్షిణ కొరియాలోని గుమిలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆమె ఇదే ఈవెంట్‌లో 4:10.83 సమయంతో రజతం గెలుచుకుంది. 22 ఏళ్ల ఆమె పోటీలో 800 మీటర్ల రేసులో కాంస్యం కూడా గెలుచుకుంది. అలాగే పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబకర్ తన మూడవ ప్రయత్నంలో 16.21 మీటర్ల దూరం దూకి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ ఈవెంట్‌లో భారతదేశం తన రెండవ స్వర్ణాన్ని గెలుచుకుంది. ఇక స్ప్రింట్ హర్డిల్స్ నుండి భారతదేశం మరో రెండు బంగారు పతకాలను జోడించింది. మహిళల 100 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్‌ను యర్రాజీ జ్యోతి 12.99 సెకన్ల సమయంతో గెలుచుకుంది. భారత హర్డిలర్ రెండవ స్థానంలో వెనుకబడి ఫైనల్ హర్డిల్‌లోకి వెళ్ళిన తర్వాత, విజయం సాధించడానికి తీరని ఫైనల్ పుష్‌పై ఆధారపడింది. అలాగే పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ రేసులో తేజస్ షిర్సే సీజన్‌లో అత్యుత్తమ సమయం 13.52 సెకన్లతో స్వర్ణం గెలుచుకోవడం ద్వారా డబుల్ సాధించాడు. రేసులో ఎక్కువ భాగం అతను నియంత్రణలో ఉన్నాడు. మరియు చివరి హర్డిల్‌ను క్లిప్ చేయకపోతే మెరుగైన సమయాన్ని నమోదు చేసుకునేవాడు. కాగా భారత పురుషులు మరియు మహిళల 4100 మీటర్ల రిలే జట్లు ఈ రోజు తరువాత పోటీపడతాయి.

# ఐసిటికి గురుదక్షిణగా ముఖేష్ అంబానీ రూ.151 కోట్లు విరాళం

**ముంబై, జూన్ 7:** భారతదేశం, ఆసియాలో అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసిటి)కి రూ.151 కోట్లు విరాళంగా ఇచ్చారు. ఇది చరిత్రలో ఇది అతిపెద్ద విరాళం. దేశంలోని అత్యంత విలువైన కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఈ సంస్థ నుండి చదువుకున్నారు. గతంలో యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (యుడిసిటి) అని పిలిచేవారు. దీనిని 1933లో బొంబాయి విశ్వవిద్యాలయం స్థాపించింది. 2008లో దీనికి ఐసీటీ అని పేరు మార్చారు. డీమ్డ్ యూనివర్సిటీ హోదా ఇచ్చారు. అనితా పాటిల్ రాసిన 'ది డివైన్ సైంటిస్ట్' పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా అంబానీ ఐసిటికి ఈ విరాళాన్ని ప్రకటించారు. ఈ పుస్తకం పద్మ విభూషణ్ ప్రొఫెసర్ మన్ మోహన్ శర్మ జీవితం ఆధారంగా రూపొందించారు. చాలా మంది ఆయనను భారతీయ కెమికల్ ఇంజనీరింగ్‌లో గొప్ప గురువుగా భావిస్తారు. గురుదక్షిణ గురించి మాట్లాడుతూ, శర్మ అభ్యర్థన మేరకు అంబానీ ఐసీటీకి రూ.151 కోట్లు విరాళంగా ఇస్తానని ప్రకటించారు. వారు మాకు ఏదైనా చెప్పినప్పుడు, మేము వింటామని అన్నారు. ముఖేష్ మీరు ఐసీటీ కోసం పెద్దగా ఏదైనా చేయాలి అని, అది ప్రొఫెసర్ శర్మ కోసం అని ప్రకటించడానికి నేను సంతోషంగా ఉన్నాను అని అంబానీ అన్నారు. యుడిసిటి క్యాంపస్‌ను సందర్శించడం ఎల్లప్పుడూ ఒక పవిత్ర ఆలయాన్ని సందర్శించినట్లు అనిపిస్తుందని అంబానీ అన్నారు. ప్రొఫెసర్ శర్మ, నేను మిమ్మల్ని నా అత్యంత



గౌరవనీయమైన గురువుగా, నా మార్గదర్శిగా, ప్రేరణకు మూలంగా భావిస్తాను.. శర్మ లాంటి గొప్ప వ్యక్తి జీవితాన్ని రాయడం చాలా కష్టమైన పని అని పాటిల్‌ను కూడా ప్రశంసించారు అంబానీ. తాను ఐఐటి - బొంబాయి కంటే యుడిసిటిని ఎంచుకున్నాను అని అంబానీ గుర్తు చేసుకున్నారు.

# ఆరు దేశాల్లో వాట్సాప్ బ్యాన్

**ముంబై, జూన్ 7:** వాట్సాప్ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందిన ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్‌గా మారింది. దీనికి పరిచయం అవసరం లేదు. ప్రతిరోజూలక్షలాది మంది యాక్టివ్ యూజర్లు ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కువగా ఉపయోగించే యాప్‌లలో వాట్సాప్ ఒకటి. కానీ వాట్సాప్ ఉపయోగించే చాలా మందికి వాట్సాప్ లాక్ చేయబడిన లేదా నిషేధించబడిన 6 దేశాల గురించి కూడా తెలియదు? ఈ దేశాలు వాట్సాప్‌ను నిషేధించాయి. ప్రపంచంలోని చాలా దేశాలలో వాట్సాప్ ఉపయోగిస్తున్నాయి. కానీ కొన్ని దేశాలు దీనిని నిషేధించాయి. చైనా, ఇరాన్, సిరియా, ఉత్తర కొరియా, ఖతార్, యుఎఇ వంటి దేశాలలో వాట్సాప్ పనిచేయదు. **చైనా:** విస్తృతమైన ఇంటర్నెట్ నియంత్రణలో భాగంగా వాట్సాప్‌ను నిషేధించారు. డేటా విధానాలతో మెరుగ్గా పనిచేసే స్థానికంగా అభివృద్ధి చేయబడిన యాప్‌లను ప్రభుత్వం ఇష్టపడుతుంది. **ఉత్తర కొరియా:** ఉత్తర కొరియాలో ఇంటర్నెట్ చాలా పరిమితం చేయబడింది. చాలా మంది పౌరులకు ఇంటర్నెట్ అందుబాటులో ఉండదు. ఉన్నత స్థాయి అధికారులు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తారు. మరికొందరు క్వాంగ్‌మ్యోంగ్ అనే ఇంట్రానెట్‌ను ఉపయోగించాలి. **ఇరాన్:** వాట్సాప్ పై ఇరాన్ వైఖరి కాలక్రమేణా



మారిపోయింది. రాజకీయ అశాంతి సమయంలో దీనిని నిషేధించారు. ఇటీవలి నివేదికలు ఆంక్షలు కొంతవరకు సడలింపు ఉన్నట్లు సూచిస్తున్నాయి. కానీ వినియోగదారులు ఇప్పటికీ ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాట్సాప్‌ను ఉపయోగించడానికి వినియోగదారులు జుశివిలపై ఆధారపడాలి. **యుఎఇ:** వాట్సాప్ మెసేజింగ్ యుఎఇలో పనిచేస్తుంది. కానీ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్లు పరిమితంంగా చేసింది. ఈ నిర్ణయం ఆ దేశ టెలికమ్యూనికేషన్ విధానాలు, స్థానిక నిబంధనలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ లైసెన్స్ పొందిన యాప్‌లకు సంబంధించినది. **సిరియా:** సిరియా వాట్సాప్ వంటి ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సాధనాలను నిషేధించింది. **ఖతార్:** ఖతార్‌లో వాట్సాప్ వాయిస్, వీడియో కాలింగ్ ఫీచర్లు పరిమితంగా ఉన్నాయి.

# రికార్డుస్థాయిలో వెండి పరుగులు

**ముంబై, జూన్ 7:** ఇటీవల ఎంసీఎక్స్‌లో వెండి ధరలు రికార్డు గరిష్టాన్ని తాకాయి. దాదాపు 3.5 శాతం పెరిగి కిలోకు రూ. 1,05,000కు చేరుకున్నాయి, అయితే ప్రపంచ ధరలు 12 సంవత్సరాల గరిష్ట స్థాయి అయిన ఔన్సుకు 34.90 డాలర్లకు చేరుకున్నాయి. బలమైన పెట్టుబడిదారుల డిమాండ్, బలహీన పడుతున్న డాలర్, పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఈవీ, సౌర రంగాల నుంచి పెరుగుతున్న పారిశ్రామిక డిమాండ్ ఈ స్థాయి పెరుగుదలకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. జూన్ ప్రారంభంలో బంగారంతో పాటు వెండి కూడా ప్రధాన సాంకేతిక నిరోధక స్థాయిలను అధిగమించడంతో మార్కెట్ సెంటిమెంట్‌లో మార్పు కనిపించిందని వివరిస్తున్నారు. రెండు సంవత్సరాల తర్వాత యూఎస్ డాలర్ కనిష్ట స్థాయికి చేరుకోవడంతో పాటు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పునరుద్ధరించిన వాణిజ్య యుద్ధ ఆందోళనలు కూడా విలువైన లోహాల ర్యాలీకి ఆజ్యం పోస్తున్నాయని నిపుణులు వివరిస్తున్నారు. బంగారంవెండి నిష్పత్తి 107 నుంచి 95కి బాగా పడిపోయిందని బలమైన వృద్ధి సామర్థంతో సాపేక్షంగా తక్కువ విలువ కలిగిన ఆస్తిగా బంగారం కంటే వెండికి పెట్టుబడిదారులు ప్రాధాన్యత పెరుగుతున్నట్లు సూచిస్తుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా వెండి ధరలు దీపావళి నాటికి రూ.1,20,000 చేరుకోవచ్చుని వివరిస్తున్నారు. ఆర్థిక అనిశ్చితి పెరగడం, సేవల రంగంలో సంకోచం, మార్చి 2023 తర్వాత అత్యంత నెమ్మదిగా ప్రైవేట్ ఉద్యోగాల వృద్ధి వంటి కారణాలు నేపథ్యంలో గురువారం బంగారం ధరలు కూడా పెరిగాయి. ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.91,300 మరియు 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.99,600 వద్ద ఉంది. మూడు శాతం జీఎస్టీతో బంగారం ధరలు ముంబైలో 10 గ్రాములకు రూ.1 లక్షను తిరిగి చేరుకుని రూ.1,02,588 వద్ద ఉన్నాయి. గత కొన్ని నెలల్లో అద్భుతమైన పురోగతి తర్వాత బంగారం ధరలు రాబోయే రెండు నెలల్లో 1215 తగ్గవచ్చని వివరించడం గమనార్హం. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులు బంగారం, వెండి పెట్టుబడుల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.




# చోక్సీ బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయాలి: సెబి ఆదేశాలు

**ముంబై, జూన్ 7:** గీతాంజలి జెమ్స్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులో మొత్తం రూ.2.1 కోట్ల బకాయిలను తిరిగి పొందడానికి సెబి కీలక చర్యలు తీసుకుంది. ఆర్థికనేరగాడు, పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ బ్యాంకుఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్‌లను అటాచ్ చేయాలని మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి ఆదేశించింది. గత నెలలో 15 రోజుల్లోపు చెల్లింపుచేయకపోతే ఆస్తులతోపాటు బ్యాంకు ఖాతాలను అటాచ్ చేస్తామని చోక్సీకి జారీ చేసిన డిమాండ్ నోటీసుల ఆధారంగా సెబి తాజా చర్యలు తీసుకుంది. గీతాంజలి జెమ్స్ లిమిటెడ్ షేర్లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ నిబంధనలను ఉల్లంఘించిన కేసులో 2022, జనవరిలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) విధించిన జరిమానాను చోక్సీ చెల్లించకపోవడంతో డిమాండ్ నోటీసులు పంపింది. తాజా నోటీసుల్లో పెండింగ్‌లో ఉన్న రూ.2.1 కోట్ల బకాయిలలో రూ.1.5 కోట్లు జరిమానా, రూ.60 లక్షలు వడ్డీ అని సెబి తెలిపింది. కాగా గీతాంజలి జెమ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ప్రమోటర్ గ్రూప్‌లో భాగమైన మెహుల్ చోక్సీ, నీరవ్ మోడీకి మామ. ఇద్దరూ ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.14వేల కోట్లకుపైగా మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 2018 ప్రారంభంలో పిఎన్‌బి కుంభకోణం వెలుగులోకి వచ్చిన తర్వాత చోక్సీ, మోడీ ఇద్దరూ భారత్ నుంచి పారిపోయారు. మెహుల్ చోక్సీ నుంచి బకాయిలను తిరిగి పొందడానికి, సెబి అన్ని బ్యాంకులు, డిపాజిటరీలు, మ్యూచువల్ ఫండ్‌లను చోక్సీ



ఖాతాల నుంచి ఎటువంటి డెబిట్‌ను అనుమతించవద్దనికోరింది. అయితే క్రెడిట్‌లను అనుమతిచ్చింది. ఇంకా డిపాజిటర్ వద్ద ఉన్న అన్ని ఖాతాలను, లాకర్లను అటాచ్ చేయాలని సెబి బ్యాంకులను స్పష్టం చేసింది.

# వాణిజ్యం


# ఇన్ఫోసిస్‌కు జిఎస్‌టి నుంచి క్లీన్ చిట్

**ముంబై, జూన్ 7:** దేశీయ రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్‌కు భారీ ఊరట లభించింది. రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసుకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ నుంచి క్లీన్ చిట్ వచ్చింది. ఈ విషయాన్ని ఇన్ఫోసిస్ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. 201819 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ప్రీ షో కాజ్ నోటీసు ప్రొసీడింగ్స్‌ను మూసివేస్తున్నట్లు డీజీజీఐ నుంచి తమకు సమాచారం అందినట్లు పేర్కొంది. 2017 నుంచి 2022 మధ్య ఇన్ఫోసిస్ విదేశీ శాఖల్లో జరిగిన వ్యయాలకు సంబంధించి రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసు 2024 జులైలో ఇన్ఫోసిస్ అందుకుంది. ఈ ప్రీషోకాజ్ నోటీసును కర్ణాటక రాష్ట్ర జీఎస్టీ అధికారులు జారీ చేశారు. విదేశీ శాఖల నుంచి దిగుమతి చేసుకున్న సేవలపై రివర్స్ ఛార్జ్ మెకానిజం కింద ఈ నోటీసు పంపారు. ఈ మొత్తం 2025 జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 85 శాతానికి సమానం. డీజీజీఐ జారీ చేసిన నోటీసులపై ఇన్ఫోసిస్ అప్పట్లోనే స్పందించింది. గతంలో తమపై ఉన్న అన్ని జీఎస్టీ బాకీలను చెల్లించామని, కేంద్ర, రాష్ట్ర నిబంధనలను పూర్తిగా పాటిస్తున్నట్లు తెలిపింది. తాజాగా ఈ నోటీసుకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను మూసివేసినట్లు డీజీజీఐ వెల్లడించడంతో ఆ మేర ఇన్ఫోసిస్‌కు ఊరట లభించింది.




# నార్వే ప్రభుత్వం పౌరులకు నిరుద్యోగ భత్యం

**న్యూఢిల్లీ, జూన్ 7:** ప్రపంచంలోని అనేక దేశాల విధానాలు వారి పౌరులకు చాలా ప్రయోజనకరంగా ఉన్నాయి. నార్వేలో అలాంటి ఒక ప్రత్యేకమైన వ్యవస్థ అమలు అవుతోంది. ఒక వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతే, అతను ఖాళీగా కూర్చోవలసిన అవసరం లేదు. నార్వే ప్రభుత్వం అటువంటి నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అందిస్తుంది. తద్వారా వారు ఎటువంటి ఒత్తిడి లేకుండా వారి తదుపరి ఉద్యోగాన్ని వెతుక్కోవచ్చు. నివేదికల ప్రకారం.. నార్వేజియన్ ప్రభుత్వం తన పౌరులకు నిరుద్యోగ భత్యం, అంటే నిరుద్యోగ భృతిని అందిస్తుంది. దీని అర్థం ఒక వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతే వారు ప్రతి నెలా ప్రభుత్వం నుండి నిర్ణీత మొత్తంలో డబ్బును అందుకుంటూనే ఉంటారు. ఆ వ్యక్తికి మరొక ఉద్యోగం దొరికే వరకు లేదా ఒక నిర్దిష్ట కాలపరిమితి పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఈ సహాయం అందిస్తుంది. మీరు మీ మునుపటి ఉద్యోగంలో రూ.లక్ష పొందుతూ ఉంటే నిరుద్యోగంలో కూడా మీరు ప్రభుత్వం నుండి దాదాపురూ.62,000 పొందవచ్చు. అయితే, దీనికి కొన్ని షరతులు ఉన్నాయి. ఆ వ్యక్తి గత 12 నెలల్లో కనీసం స్థిర ఆదాయాన్ని సంపాదించి ఉండాలి. అతను తన స్వంత ఇష్టానుసారం తన ఉద్యోగాన్ని వదిలి వెళ్ళకూడదు. ఆ వ్యక్తి నిరంతరం కొత్త ఉద్యోగం కోసం వెతుకుతూ ఉండాలి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.